www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# ప్రజా విశ్వంభర
అక్షరం సాక్షిగా..
RNI No : TGTEL/25/A1676
సోమవారం
17-08-2026
సంపుటి :02 | సంచిక : 35 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS


డా॥ కాచం సత్యనారాయణ
CMD


# కల్యాణలక్ష్మి రద్దుకు కాంగ్రెస్ కుట్ర



- హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ ఎత్తివేసేందుకు ప్రయత్నిస్తోంది
- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కేవలం ఒక సంక్షేమ పథకం మాత్రమే కాదు
- పేద కుటుంబాల ఆడబిడ్డల భవిష్యత్తు, ఆత్మగౌరవంతో ముడిపడిన కార్యక్రమాలు
- సోమవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలి : కేటీఆర్

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ఆర్థిక భరోసాకు ప్రతీకగా నిలిచిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పూర్తిగా రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ లక్షలాది పేద కుటుంబాలకు అండగా నిలిచిన ఈ పథకాలను ఎత్తివేసేందుకు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ కుట్రను అడ్డుకోవడంతో పాటు కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర జనరల్ బాడీ సభ్యులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కేటీఆర్ ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కేవలం ఒక సంక్షేమ పథకం మాత్రమే కాదని, తెలంగాణ పేద కుటుంబాల ఆడబిడ్డల భవిష్యత్తు, ఆత్మగౌరవంతో ముడిపడిన కార్యక్రమాలని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన వెంటనే పేద కుటుంబాల్లో ఆడబిడ్డ పెళ్లి ఎంతటి ఆర్థిక భారమో గుర్తించిన కేసీఆర్ 2014 అక్టోబర్ 2న ఈ పథకాలను ప్రారంభించారని గుర్తుచేశారు. రూ.51 వేల ఆర్థిక సహాయంతో ప్రారంభమైన ఈ పథకాన్ని దశలవారీగా రూ.75,116కు, అనంతరం రూ.1,00,116కు పెంచారని తెలిపారు. కేసీఆర్ హయాంలో సుమారు 13 లక్షల మంది ఆడబిడ్డల కుటుంబాలకు రూ.13 వేల కోట్ల మేర ఆర్థిక సహాయం అందిందన్నారు. కోవిడ్ వంటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభ సమయంలోనూ కేసీఆర్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి ద్వారా

2లో



# కేసీఆర్ సభకు రావాలి.. సూచనలివ్వాలి

- సెప్టెంబరులో శాసనసభ సమావేశాలు పెడుతున్నాం
- కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికే ఆదాయం సరిపోతోంది
- రోజుకు 18 గంటలు పనిచేస్తున్నాం..
- ఈ 32 నెలల్లో మూడు రోజులైనా సెలవు తీసుకున్నానా?
- నిరుద్యోగుల కోసం నేనున్నా.. మీకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తా
- కేసీఆర్.. 'ఫ్యామిలీ జస్టిస్' చేస్తే.. నేను సోషల్ జస్టిస్ చేశాను
- రైతు రుణమాఫీ చేస్తానని రెండుసార్లు కేసీఆర్ మోసం చేశారు
- రైతురుణ విముక్తి కలిగిన రాష్ట్రంగా తెలంగాణను మార్చా : సీఎం రేవంత్‌రెడ్డి

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: అన్ని ప్రభుత్వ శాఖల్లో విడతలవారీగా ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తామని, విడతలవారీగా ప్రభుత్వ ఉద్యోగాలు చేపట్టే బాధ్యత తనదని ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి హామీ ఇచ్చారు. మాయ మాటలు నమ్మి యువత మోసపోవద్దని, పోటీ పరీక్షలకు సన్నద్ధమై భవిష్యత్తును తీర్చిదిద్దుకోండని సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటన భాగంగా ములుగు నుంచి హనుమకొండ వచ్చిన రేవంత్ రెడ్డి, పరకాలలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వంద పడకల ఆసుపత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనాలను ప్రారంభించారు. రూ.484 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం పరకాలలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో పాల్గొన్నారు.

**ప్రతీ ప్రభుత్వ ఉద్యోగాన్ని భర్తీ చేస్తా..**

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, కానిస్టేబుల్ పోస్టులకు విడతలవారీగా నోటిఫికేషన్లు ఇస్తామని, ఖాళీగా ఉన్న ప్రతి ప్రభుత్వ ఉద్యోగాన్ని భర్తీ చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. యువత ఆత్మబలిదానాలు చేసి తెలంగాణ సాధించుకున్నారని అన్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ కుటుంబం యువతను రెచ్చగొట్టిందని, మొన్న తెలంగాణ భవన్‌లో రక్తదాన కార్యక్రమం చేపట్టారని, రక్తదాన కార్యక్రమంలో కేటీఆర్, హరీశ్‌రావు చుక్క రక్తం ఇవ్వలేదని, బీఆర్ఎస్ కార్యకర్తలు రక్తం ఇస్తే అమ్ముకొని కోట్ల రూపాయలు సంపాదించారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు.

2లో

# దేశ భద్రత విషయంలో రాజీ లేదు

- మోడీ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది
- సరిహద్దు భద్రతను మరింత పటిష్ఠం చేస్తున్నాం
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా వ్యవస్థలు పనిచేస్తున్నాయి



విశ్వంభర, ఇబ్రహీంపట్నం: దేశ భద్రత విషయంలో మోడీ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (ఎన్ఎస్‌జీ) శిక్షణ కేంద్రంలో గార్డ్స్ కుటుంబాల కోసం నిర్మించిన 48 గృహ సముదాయాలను ఎన్ఎస్‌జీ

2లో

# మోడీ హింసాత్మక పాలనకు ఎదురు నిలిచిన యువత



- శాంతి, ప్రేమ, హాస్యాన్ని ఆయుధాలుగా యువత తమ గళాన్ని వినిపించింది
- అధికారాన్ని ప్రశ్నించడం, హక్కుల కోసం నిలబడటం ప్రజాస్వామ్యంలో కీలకం
- బీజేపీ కార్యకర్తల నుంచి దురుసు ప్రవర్తన, మాటల దాడులు, హింసను ఎదుర్కొన్నారు
- అయినప్పటికీ విద్యార్థినులు వెనక్కి తగ్గలేదు
- విద్యార్థుల గొంతును ఇకపై ఎవరూ అణచలేరు
- విద్యార్థులపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రశంసలు

2లో



# పాతబస్తీలో మెట్రో కోసం ముమ్మరంగా భూసేకరణ

▶ పలు భవనాలు, మజ్లీలు కూల్చివేత ▶ మొత్తం ఏడున్నర కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: పాతబస్తీలో మెట్రో విస్తరణలో భాగంగా ప్రభుత్వం పలు భవనాలను కూల్చివేసింది. ఈ భూసేకరణలో కొన్ని మార్పులు వస్తున్నాయంటూ పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. వెంటనే కోర్టులో పిటిషన్? వేశారు. అప్పటినుంచి ఈ వివాదం కొనసాగుతుండగా తాజాగా దీనిని విచారించిన హైకోర్టు అనుమతులు ఇచ్చింది. దాంతో ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. దాంట్లో భాగంగా పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో ఉన్న భవనాలు, మజ్లీలు కూల్చివేశారు. దానికి పరిహారం కూడా చెల్లిస్తున్నారు. మెట్రో రైలు ప్రాజెక్టు పనులకు అడ్డంకులు తొలగిపోవటంతో పాతనగరంలోని ఇమ్లీబన్? ఎంజీబీఎస్? నుంచి దారుల్‌షిఫా, మీర్‌చౌక్, అలిజాకోట్ల, హరిబౌలి, శాలిబండ మీదుగా ఫలక్‌నుమా

2లో

# ఆమె దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

- వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించకుండా సోనియా అడ్డుకున్నారు
- ఈ ఘటనను దేశ ప్రజలందరూ కళ్లారా చూశారు
- ఓటు బ్యాంకు రాజకీయాల కోసం జాతీయ గేయాన్ని అవమానించారు
- ఆ పార్టీని దేశ ప్రజలు ఎన్నటికీ క్షమించరు : అమిత్ షా

విశ్వంభర, నేషనల్ బ్యూరో: జాతీయ గేయం వందేమాతరంను కాంగ్రెస్ పార్టీ అవమానించిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆరోపించారు. ఈ గేయాన్ని రచించిన బంకిం చంద్ర చటోపాధ్యాయతోపాటు దేశ ప్రజలకు ఆ పార్టీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాజస్థాన్ చిత్తోర్‌గఢ్‌లో జరిగిన ఓ సభలో పాల్గొన్న అమిత్ షా, శనివారం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో వందేమాతరం గేయాన్ని మధ్యలోనే ఆపేయాలని సోనియా కోరినట్లు ఆరోపించారు. ఆ దృశ్యాలను దేశమంతా టీవీల్లో చూసిందన్నారు. వందేమాతరాన్ని పాడినందుకు స్వాతంత్ర్య సమరయోధులు తూటాలు, లాఠీ దెబ్బలను తిన్నారని, జైలు పాలయ్యారని అమిత్ షా గుర్తు చేశారు. ఓటుబ్యాంకు రాజకీయాల కోసమే హస్తం పార్టీ వందేమాతరం గేయాన్ని మరిచిపోయిందని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడిచిన తర్వాత ఎర్రకోటతో పాటు జెండా ఆవిష్కరణ జరిగిన అన్ని చోట్లా వందేమాతరం ఆలపించారని తెలిపారు. "సోనియా జీ, 140 కోట్ల మంది ప్రజలు మిమ్మల్ని గమనిస్తున్నారు. మీరు చేసిన ఈ పాపాన్ని దేశ ప్రజలు ఎప్పటికీ క్షమించరు. 'వందేమాతరం' గేయాన్ని అసంపూర్ణంగా వదిలేయాలని ఎవరైనా ఎలా ఆలోచించగలరు? కాంగ్రెస్ పార్టీ దీనికి సిగ్గుపడాలి" అని అన్నారు. మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయీ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన 'అటల్ గౌరవ్ స్మృతి సమారోహ్'లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన 21 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని ఆవిష్కరించారు. పోఖ్రాన్ పరీక్షల తర్వాత అంతర్జాతీయ ఒత్తిడి ఉన్నప్పటికీ, భారతదేశాన్ని అణు శక్తిగా మార్చడంతో సహా వాజ్‌పేయీ అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. వాజ్‌పేయి ప్రభుత్వం తన హయాంలో గ్రామాలను రోడ్లతో అనుసంధానించిందని, జాతీయ రహదారులను నిర్మించిందని గుర్తుచేశారు. గిరిజన అభివృద్ధి కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిన ఘనత కూడా వాజ్‌పేయీదేనని ఆయన కొనియాడారు.

# నేడే సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభం



- ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- పేదలకు పైసా ఖర్చు లేకుండా సూపర్ స్పెషాలిటీ వైద్యం
- కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా టిమ్స్ సనత్‌నగర్
- 1,082 పడకలు.. అందులో 300 ఐసీయూ బెడ్స్..31 మేజర్ ఆపరేషన్ థియేటర్లు

విశ్వంభర, హైదరాబాద్ : సామాన్య ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం సనత్‌నగర్ లో నిర్మించిన ప్రతిష్ఠాత్మక డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (డిఆర్ ఎం సీ ఆర్ టిమ్స్) ను ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి సోమవారం ప్రారంభించనున్నారు. ప్రభుత్వ వైద్యరంగంలో అత్యాధునిక సౌకర్యాలతో కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా టిమ్స్ సనత్‌నగర్ రూపుదిద్దుకుంది. ప్రభుత్వ రంగంలో ఒకే దశలో నిర్మించిన అతిపెద్ద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా ఇది ప్రత్యేకతను సంతరించుకుంది. 22.6 ఎకరాల విస్తీర్ణంలో, 11.70 లక్షల చదరపు అడుగుల నిర్మిత విస్తీర్ణంతో ఈ సమగ్ర వైద్య సముదాయాన్ని అభివృద్ధి చేశారు. క్లాసిక్ ఆర్కిటెక్చర్‌తో నాలుగు బ్లాకులుగా నిర్మించిన టిమ్స్ 75 శాతం నీటి పొదుపుతో ఐజీబీసీ గోల్డ్ రేటింగ్ సాధించింది. ఆరు కీలక విభాగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గా దీన్ని తీర్చి దిద్దారు. ఈ ఆసుపత్రిలో రోగులకు సమగ్ర వైద్య సేవలు అందనున్నాయి. ఏఐ ఆధారిత న్యూమాటిక్ ట్యూబ్ వ్యవస్థను దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వ రంగంలో నిర్మితమైన టిమ్స్ లో ఏర్పాటు చేయటం విశేషం. ఈ వ్యవస్థ ద్వారా రోగుల నుంచి పరీక్షలు చేసేందుకు సేకరించిన నమూనాలు ఒకటి నుంచి రెండు నిమిషాల్లోనే సంబంధిత పరీక్షా కేంద్రాలకు చేరతాయి.

**ఒకే మాస్టర్‌ప్లాన్‌తో.. పూర్తి స్థాయి వైద్య సముదాయం..**

సాధారణంగా ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధి దశలవారీగా సంవత్సరాలపాటు కొనసాగుతుంటుంది. అందుకు భిన్నంగా టిమ్స్ సనత్‌నగర్‌ను ఒకే దశలో, ఒకే మాస్టర్‌ప్లాన్ కింద సంపూర్ణ

2లో

# కల్తీ ఆహారం, నకిలీ ఔషధాల కట్టడికి టీజీ సేఫ్




- ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ విభాగాలను విలీనం చేస్తూ ఉత్తర్వులు
- కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాష్ మహంతి నియామకం
- పర్యవేక్షణకు 6 కీలక విభాగాలు, పోలీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం

2లో

ప్రజా విశ్వంభర
V3 NEWS

## దేశ భద్రత విషయంలో రాజీ లేదు

డైరెక్టర్ జనరల్ సంజయ్ సింఘాల్‌తో కలిసి కేంద్ర మంత్రి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో అక్రమ వలసలను నిరోధించడంతోపాటు ఉగ్రవాదులు, తీవ్రవాదుల నిర్మూలనలో ఎన్‌ఎస్‌జీ కమాండోలు, ఇతర జవాన్ల సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. నిరంతరం సరిహద్దుల్లో దేశ భద్రతను కాపాడుతున్న జవాన్ల కుటుంబాలు సురక్షితంగా.. సౌకర్యంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. దేశ రక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని... సరిహద్దు భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నిఘా వ్యవస్థలు పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రధాని నాయకత్వంలో కేంద్ర హోంశాఖ మార్గదర్శకత్వంలో కేంద్ర సాయుధ పోలీసు బలగాల ఆధునికీకరణతో పాటు జవాన్ల సంక్షేమానికి ఆధునిక గృహ వసతి, వైద్య సదుపాయాలు, పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నట్లు బండి సంజయ్ తెలిపారు.

## కేసీఆర్ సభకు రావాలి.. సూచనలివ్వాలి

**కేసీఆర్‌ను కూడా తీసుకురావాలి..**

కేటీఆర్, హరీశ్‌రావు శాసనసభ సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారని, మీ పాలనపై, కాంగ్రెస్ పాలనపై చర్చిద్దామని రేవంత్? సవాల్? విసిరారు. సెప్టెంబరులో శాసనసభ సమావేశాలు పెడుతున్నామని, కేసీఆర్?ను కూడా తీసుకురావాలని సూచించారు. సీఎంగా, కేంద్రమంత్రిగా చేసిన కేసీఆర్ అనుభవం, సలహాలు తమకు కావాలని తెలిపారు. అనుభవం లేకపోయినా ఇచ్చిన మాట కోసం అహర్నిశలు కష్టపడుతున్నామని, కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికే ఆదాయం సరిపోతోందని రేవంత్? అన్నారు.

**వరంగల్ పోరాటాల గడ్డ..**

పరకాలలో ప్రజాపాలన – ప్రగతిబాట కార్యక్రమానికి వేలాదిగా మహిళలు వచ్చారన్న సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రాంత సమస్యల పరిష్కారానికి ఎన్నోసార్లు తనను, మంత్రులను కలిసేవారని గుర్తు చేశారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డి వల్లే ఈ ప్రాంతంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయని, వరంగల్ పోరాటాల గడ్డ అని సీఎం కొనియాడారు. ఈ ప్రాంతంలో ప్రజలకు చైతన్యం ఉందని, ఆలోచన ఉందన్నారు. యశస్విని 50 వేల ఓట్ల మెజార్టీతో గెలిచారని అభినందించారు.

**కేసీఆర్ రెండుసార్లు మోసం చేశారు..**

మట్టిలో కలిసినా, సరే ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రోజుకు 18 గంటలు పని చేస్తున్నామని, 32 నెలల్లో మూడు రోజులైనా సెలవు తీసుకున్నానా అని అడిగారు. రైతు రుణమాఫీ చేస్తానని రెండుసార్లు కేసీఆర్ మోసం చేశారని విమర్శించారు. రైతురుణ విముక్తి కలిగిన రాష్ట్రంగా తెలంగాణను మార్చామని పేర్కొన్నారు.

**నిరుద్యోగుల కోసం నేనున్నా..**

నిరుద్యోగులు ధర్నాలు, ర్యాలీలు చేసి సమయం వృథా చేసుకోకండి. ధర్నాల్లో పాల్గొంటే కేసులతో భవిష్యత్ నాశనమవుతుంది. నిరుద్యోగుల కోసం నేనున్నా.. మీకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తా. కేసీఆర్.. 'ఫ్యామిలీ జస్టిస్' చేస్తే.. నేను సోషల్ జస్టిస్ చేశాను. కేసీఆర్ సీఎం అయితే ఆయన కుటుంబానికే లాభం.. నేను ముఖ్యమంత్రి అయితే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుంది" అని రేవంత్ అన్నారు.

## కల్తీ ఆహారం, నకిలీ ఔషధాల కట్టడికి టీజీ సేఫ్

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణ, కల్తీ ఆహారం, నకిలీ ఔషధాల విక్రయాల కట్టడికి తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఫుడ్ సేఫ్టీ డిపార్ట్ మెంట్, డ్రగ్ కంట్రోల్ డిపార్ట్ మెంట్ లను ఒకే గొడుగు కిందికి తెస్తూ ఏకీకృత పాలనా యంత్రాంగం టీజీ సేఫ్ (తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్)ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్. చోంగ్తు ఉత్తర్వులు జారీ చేశారు. టీజీ సేఫ్ కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి అవినాష్ మహంతిని నియమించారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో అమలవుతున్న మోడల్‌ను అధ్యయనం చేసిన ప్రభుత్వం, ఆహార–ఔషధ చట్టాల సమర్థవంతమైన అమలు కోసం ఈ నిర్ణయం తీసుకుంది. 1981 నుంచి స్వతంత్రంగా పనిచేస్తున్న డ్రగ్స్ కంట్రోల్ విభాగం, ఫుడ్ సేఫ్టీ కమిషనరేట్‌లు ఇకపై టీజీ సేఫ్ పరిధిలోకి వస్తాయి. ఈ ఉత్తర్వులు 2026 ఆగస్టు 15 నుంచి అధికారికంగా అమల్లోకి రానున్నాయి.

**6 కీలక విభాగాలు ఏర్పాటు..**

టీజీ సేఫ్ కమిషనర్ నేతృత్వంలో సమగ్ర పర్యవేక్షణ కోసం ఆరు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు.

**డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ వింగ్:** డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ 1940 నిబంధనల ప్రకారం లైసెన్సులు, తనిఖీలు, శాంప్లింగ్, టెస్టింగ్, విచారణల పర్యవేక్షణ.

**ఫుడ్ సేఫ్టీ వింగ్:** ఆహార భద్రత ప్రమాణాల చట్టం 2006 ప్రకారం లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు, నమూనాల సేకరణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులు.

**ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్:** పోలీస్ శాఖ నుంచి సిబ్బందిని డిప్యుటేషన్‌పై కేటాయించి నిఘా సమాచార సేకరణ (ఇంటెలిజెన్స్), ఆకస్మిక తనిఖీలు, ప్రాసిక్యూషన్ ప్రక్రియలను వేగవంతం చేయడం.

**లీగల్ అండ్ ప్రాసిక్యూషన్ వింగ్:** రెండు విభాగాల కేసులకు అవసరమైన న్యాయ సలహాలు, కోర్టు ప్రాసిక్యూషన్ సహాయాన్ని అందించడం.

**ల్యాబొరేటరీ వింగ్:** ఫుడ్ టెస్టింగ్, డ్రగ్ టెస్టింగ్ ల్యాబొరేటరీలను ఒకే విభాగం పరిధిలోకి తెచ్చి ఆధునిక పరికరాలతో విస్తరించడం.

**అడ్మినిస్ట్రేటివ్ వింగ్:** మానవ వనరులు, బడ్జెట్, అకౌంట్స్, ఇతర పరిపాలనాపరమైన అంశాల నిర్వహణ.

**ప్రయోగాత్మకంగా క్యూర్ రీజియన్‌లో ప్రారంభం..**

హోటళ్లు, రెస్టారెంట్లు, ఫుడ్ వ్యాపారాలు, ఫార్మా కంపెనీలు అధికంగా ఉన్న కోర్ అర్బన్ రీజియన్ లో తొలుత టీజీ సేఫ్ పైలట్ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. ఇక్కడ పటిష్ఠ తనిఖీల కోసం తగినంత మంది పోలీస్ బలగాలను డీజీపీ కేటాయించనున్నారు. ఈ అథారిటీ కోసం అవసరమైన బడ్జెట్‌ను సమకూర్చడంతో పాటు, ఖాళీగా ఉన్న పోస్టులను డిప్యుటేషన్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతుల్లో భర్తీ చేసుకునేందుకు అనుమతి ఇచ్చారు. స్టేట్ లెవల్ కమిటీ ఏర్పాటు ఆధునిక సాంకేతికతతో కూడిన పర్యవేక్షణ వ్యవస్థను రూపొందించేందుకు, సర్వీస్ నిబంధనలు, సిబ్బంది కేటాయింపు, ల్యాబ్‌ల ఆధునీకరణపై సమగ్ర నివేదిక అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక స్టేట్ లెవల్ కమిటీని ఏర్పాటు చేయనుంది. క్యూర్ రీజియన్‌లో వచ్చే ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయి వ్యవస్థను విస్తరించనున్నారు.

## పాతబస్తీలో మెట్రో కోసం ముమ్మరంగా భూసేకరణ

వరకు మొత్తం ఏడున్నర కిలోమీటర్ల మేర రహదారి విస్తరణకు వందడుగులకు పైగా భూసేకరణ చేపట్టారు. ఆరేడు వందలకు పైగా భవనాలు, మల్గీలు కూల్చివేసి పరిహారం చెల్లిస్తున్నారు. దారుల్?షిఫాలో నిజాం పాలనలో మున్షీగా పనిచేసిన వ్యక్తి, రోటీ షాపును నడిపేవారు. అయితే రోడ్డు విస్తరణలో భాగంగా ఆ షాపును సైతం తొలగించారు. కొంతమంది వ్యాపారులు ఉపాధి కోల్పోకుండా మల్గీలను కొనసాగించేందుకు కొంత స్థలం అవసరమని అధికారులను కోరారు. వారికి రెండు, మూడడుగుల వెడల్పుతో భూసేకరణలో మినహాయింపు ఇచ్చారు. కుడివైపుతో పోల్చితే ఎడమవైపు అధికంగా భూసేకరణ జరిగిందనే విషయాన్ని సవాల్? చేస్తూ గతంలో మహ్మద్ రవూఫ్ సహా మరో ఏడుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసును విచారించిన సింగిల్? జడ్జి గతేడాది జనవరిలో స్టే విధించారు. ఈ స్టేను ఎత్తివేయాలని ప్రభుత్వం మధ్యంతర పిటిషన్? వేసింది. దీనిని హైకోర్టు విచారించి భూసేకరణ ప్రక్రియతోపాటు మెట్రోరైలు ప్రాజెక్టు పనులు కొనసాగించొచ్చంటూ స్పష్టం చేసింది. శాలిబండకు చెందిన సునీల్ శ్రీవాత్సవ్ బంగారు ఆభరణాల యజమానుల సంఘం ప్రతినిధి. ఆయనకు ఉన్న మల్గీ స్థలం శాలిబండలో రోడ్డు విస్తరణలో భాగంగా కోల్పోయారు. అధికారులు చేపట్టిన భూసేకరణలో భాగంగా స్థలం విలువను పరిగణనలోకి తీసుకుని ప్రాంతాల వారీగా నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు. పాతబస్తీలోని కాలి కబర్‌కు చెందిన మహమ్మద్ ఉస్మాన్ ఖురేషి స్థలాన్ని సేకరించారు. భూసేకరణకు సంబంధించి అతనికి దాదాపు రూ.37 కోట్ల నష్టపరిహారం రావాల్సి ఉంది. కానీ ఈ విషయంలో అధికారులు జాప్యం చేస్తున్నారని తెలిపారు.

## కల్యాణలక్ష్మి రద్దుకు కాంగ్రెస్ కుట్ర

పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలిచిందని గుర్తుచేశారు. అయితే ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మితో పాటు ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని బలోపేతం చేయాల్సింది పోయి దానినే రద్దు చేసేందుకు ప్రయత్నిస్తోందని కేటీఆర్ విమర్శించారు. కల్యాణలక్ష్మి కోసం ఎదురుచూస్తున్న ప్రతి ఆడబిడ్డ ఇప్పుడు ఎన్నికల హామీ ప్రకారం తులం బంగారం కూడా డిమాండ్ చేస్తుండటంతో, ఆ ప్రశ్నల నుంచి తప్పించుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి ఎంత దారుణంగా మారిందో అర్హులైన లబ్ధిదారులే చెబుతున్నారని అన్నారు. పెళ్లిళ్లు జరిగి చాలా కాలం గడిచినా, కొందరికి పిల్లలు పుట్టినా కూడా తమకు రావాల్సిన కల్యాణలక్ష్మి సహాయం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారని ధ్వజమెత్తారు. చాలా కాలం తర్వాత ఆమోదం పొందిన దరఖాస్తులకు సంబంధించిన చెక్కులు కూడా పూర్తిస్థాయిలో పంపిణీ కాకుండా ఆగిపోయాయని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని అర్హులైన దరఖాస్తులను వెంటనే పరిష్కరించి, ఆర్థిక సహాయాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కల్యాణలక్ష్మి అంశం హైకోర్టు పరిధిలో ఉన్న సమయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై కూడా కేటీఆర్ మండిపడ్డారు. నాలుగుసార్లు గడువు ఇచ్చినా ప్రభుత్వం కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించారు. పేదింటి ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన కీలకమైన అంశంలో ప్రభుత్వం సరైన వాదనలు ఎందుకు వినిపించలేకపోయిందని నిలదీశారు. ముఖ్యమంత్రి, మంత్రులు అవినీతి వంటి హైడ్రా వంటి అంశాల్లో ప్రైవేటు న్యాయవాదులకు భారీ మొత్తాలు చెల్లించి వాదించే ప్రభుత్వం, ఆడబిడ్డల హక్కులకు సంబంధించిన పథకాన్ని కాపాడుకునే విషయంలో మాత్రం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ప్రశ్నించారు. హైకోర్టు తీర్పును ఇప్పుడు సాకుగా చూపుతూ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పూర్తిగా నిలిపివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కంకణం కట్టుకుందని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పటికే కేసీఆర్ హయాంలో అమలైన పలు సంక్షేమ కార్యక్రమాలను నిలిపివేసిన కాంగ్రెస్, ఇప్పుడు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లను కూడా రద్దు చేయాలని చూస్తోందని విమర్శించారు. "ఆడబిడ్డ భారం కాదు.. భరోసా" అనే భావనకు కేసీఆర్ ప్రభుత్వం రూపమిచ్చిందని కేటీఆర్ అన్నారు. అలాంటి పథకాలను రద్దు చేస్తే తెలంగాణ ఆడబిడ్డలు, వారి కుటుంబాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతాయని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి తులం బంగారం వంటి హామీలతో ఓట్లు పొందిన కాంగ్రెస్ ఇప్పుడు వాటిని మరిచిపోయిందని మండిపడ్డారు. రేపు రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ, మండల కేంద్రాల్లో నిర్వహించే నిరసనల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పేదింటి ఆడబిడ్డల పక్షాన తమ గళాన్ని వినిపించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుని కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. "కల్యాణలక్ష్మి ఏమైంది? షాదీ ముబారక్ ఏమైంది? ఎన్నికల్లో హామీ ఇచ్చిన తులం బంగారం ఎప్పుడు ఇస్తారు?" అంటూ కాంగ్రెస్ నేతలను ప్రజలు ప్రశ్నించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఆడబిడ్డల కోసం కేసీఆర్ చేసిన సంక్షేమ కార్యక్రమాలను కాపాడుకుందాం.. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయించేలా ఒత్తిడి పెంచేందుకు పోరాడుదాం అని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## నేడే సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభం

సూపర్ స్పెషాలిటీ వైద్య సముదాయంగా ప్రభుత్వం తీర్చిదిద్దింది. ఆస్పత్రిలో మొత్తం 1,082 పడకలు, అందులో 300 ఐసీయూ పడకలు ఉన్నాయి. మొత్తం పడకల్లో దాదాపు 30 శాతం ఐసీయూలకు కేటాయించడం ద్వారా అత్యవసర, క్లిష్ట వైద్య సేవలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం ఈపీసీ విధానంలో నిర్మించే బాధ్యతను లిమేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్)లికు అప్పగించింది. సివిల్ నిర్మాణాలు, మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ (ఎంఈపీ) వ్యవస్థలతోపాటు ఆధునిక వైద్య పరికరాలు, సాంకేతిక సదుపాయాలను ఎంఈఐఎల్ సమకూర్చింది.

**నాలుగు బ్లాకులు.. సమగ్ర వైద్య సేవలు..**

ఆస్పత్రిని నాలుగు ప్రధాన బ్లాకులుగా ప్రభుత్వం నిర్మించింది. మొత్తం 31 మేజర్, 6 మైనర్ ఆపరేషన్ థియేటర్లు ఇందులో ఉన్నాయి. డయాగ్నస్టిక్స్ విభాగంలో 17 పాథాలజీ ల్యాబ్‌లు, 12 మైక్రోబయాలజీ ల్యాబ్‌లు, 10 బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లు, 5 ప్రత్యేక ల్యాబ్‌లు ఉన్నాయి. బ్లాక్–ఏలో అత్యవసర సేవలు, 15 ఆపరేషన్ థియేటర్లు, 30 ఐసీయూ బెడ్లు, సెంట్రల్ స్టెరైల్ సర్వీస్ విభాగం ఉన్నాయి. బ్లాక్–బీలో ఓపీ రిజిస్ట్రేషన్, సెంట్రల్ ఫార్మసీ, కార్డియాక్ ఆపరేషన్ థియేటర్, లీనాక్ ఆధారిత న్యూక్లియర్ మెడిసిన్ విభాగం, రెండు క్యాథ్‌ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. బ్లాక్–సీలో రేడియాలజీ, పాథాలజీ ల్యాబ్‌లు, సాధారణ, ప్రైవేట్ వార్డులు, వీఐపీ సూట్లు ఉన్నాయి. బ్లాక్–డీలో పరిపాలన, విద్యా విభాగాలతోపాటు 200 మంది కూర్చునే ఆడిటోరియం ఉంది.

**నిమిషాల్లోనే రక్త నమూనాలు..**

**ఏఐ ఆధారిత పైప్ వ్యవస్థ..**

టిమ్స్ సనత్‌నగర్‌లో అత్యంత ప్రత్యేకమైన సాంకేతిక సదుపాయాల్లో ఏఐ ఆధారిత న్యూమాటిక్ ట్యూబ్ వ్యవస్థ ఒకటి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో దేశంలోనే తొలిసారిగా ఈ తరహా వ్యవస్థను టిమ్స్ సనత్ నగర్ లో ఏర్పాటు చేశారు. సీల్డ్ ట్యూబ్‌లు, గాలి ఒత్తిడితో రక్త నమూనాలు, మందులు, వైద్య నివేదికలు, అత్యవసర వినియోగ వస్తువులను వార్డులు, అత్యవసర విభాగం, ల్యాబ్‌లు, ఫార్మసీ, బ్లడ్ బ్యాంక్‌ల మధ్య కేవలం 1--2 నిమిషాల్లో ఈ విధానం ద్వారా తరలించవచ్చు. దీంతో పరీక్షల ఫలితాల కోసం పట్టే సమయం తగ్గడంతోపాటు కలుషితమయ్యే ప్రమాదం కూడా తగ్గుతుంది.

**ఆరు కీలక విభాగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్..**

అవయవ మార్పిడి, కార్డియాక్ సైన్సెస్, ఆంకాలజీ, న్యూరోసైన్సెస్, నెఫ్రాలజీ, ట్రామా కేర్ వంటి ఆరు ప్రధాన రంగాల్లో టిమ్స్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ప్రభుత్వం తీర్చిదిద్దింది. కిడ్నీ, కాలేయం, గుండె, బహుళ అవయవ మార్పిడి సేవలకు ఇక్కడ అవకాశం ఉంది. ఆధునిక కార్డియోథొరాసిక్ శస్త్రచికిత్సలు, లీనాక్ ఆధారిత రేడియోథెరపీ, 24 గంటల అత్యవసర వైద్య సేవలు, ఐసీయూ బ్యాకప్‌తో 30 క్లినికల్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి.

**అత్యాధునిక స్కానింగ్ సదుపాయాలు..**

ఆస్పత్రిలో 3.0 టెస్లా ఎంఆర్ఐ, 128–స్లైస్ సీటీ స్కానర్, అధునాతన మామోగ్రఫీ యూనిట్, 5 ఎక్స్‌రే యంత్రాలు ఏర్పాటు చేశారు. రోగులతో వచ్చే సహాయకుల కోసం జీ5 అంతస్తుల్లో నిర్మించిన ధర్మశాలలో 200 మందికి వసతి కల్పించేలా సదుపాయాలు ఉన్నాయి. 30 మృతదేహాల సామర్థ్యంతో మార్చురీతో పాటు, కేంద్ర వంటశాల, లాండ్రీ,, వైద్య వాయు (మెడికల్ ఆక్సిజన్) పైప్‌లైన్ వ్యవస్థలకు ప్రత్యేక బ్లాకులు ఇందులో నిర్మించారు.

**75 శాతం నీటి పొదుపు..**

**ఐజీబీసీ గోల్డ్ రేటింగ్..**

టిమ్స్ సనత్‌నగర్ నిర్మాణంలో పర్యావరణహిత సాంకేతికతకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఈ విధానం ద్వారా 75 శాతం నీరు ఆదా ఐంది . తగిన సామర్థ్యంతో ఎస్టీపీ, ఈటీపీలు ఏర్పాటు చేసి మురుగునీరు, వ్యర్థ ద్రవాలను ఈ ఆసుపత్రిలో శుద్ధి చేయనున్నారు. వర్షపు నీటిని సేకరించి యార్డ్ వాటర్ సంప్‌ల ద్వారా మొక్కలు, గ్రీన్ కారిడార్లకు వినియోగించే విధానం టిమ్స్ సనత్ నగర్ లో అమలుకానుంది. పర్యావరణహిత నిర్మాణం, ఇంధన సామర్థ్య వ్యవస్థల కారణంగా ప్రాజెక్టుకు ఐజీబీసీ గోల్డ్ రేటింగ్ లభించింది.

**35 లక్షల సురక్షిత పని గంటలు..**

నిర్మాణ సమయంలో 35 లక్షల సురక్షిత పని గంటలు నమోదు చేసినట్లు ఎంఈఐఎల్ గ్రూప్ తెలిపింది. ప్రమాదాలు చోటుచేసుకోకుండా నిర్మాణాన్ని పూర్తి చేయడం ద్వారా వృత్తిపరమైన ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యం ఇచ్చినట్లు సంస్థ పేర్కొంది.

**ప్రభుత్వ వైద్యరంగంలో కొత్త ప్రమాణం..**

హైదరాబాద్ నడిబొడ్డున క్లాసిక్ ఆర్కిటెక్చర్‌తో కాంక్రీట్ నిర్మాణంగా రూపుదిద్దుకున్న టిమ్స్ సనత్‌నగర్ ప్రభుత్వ వైద్యరంగంలో భారీ స్థాయి మౌలిక వసతులు, అత్యాధునిక సాంకేతికత, పర్యావరణ పరిరక్షణ, భద్రతను సమన్వయం చేసిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుగా నిలిచింది. సామాన్య ప్రజలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో లభించే స్థాయి అధునాతన వైద్య సేవలను ప్రభుత్వ వ్యవస్థలోనే అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యానికి ఈ ఆస్పత్రి ప్రతీకగా నిలవనుంది. ప్రభుత్వ ఆస్పత్రులు కూడా ప్రైవేటు కార్పొరేట్ వైద్య సంస్థలకు దీటైన స్థాయిలో ఆధునిక, సూపర్ స్పెషాలిటీ సేవలు అందించగలవని ఈ ప్రాజెక్టు చాటిచెబుతోందని వైద్య రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



## ఆమె దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గిరిజన సంక్షేమానికి నిరంతరం ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు.

**సోనియా గాంధీపై బీజేపీ నేతల ఫిర్యాదు..**

మరోవైపు ఈ వివాదం నేపథ్యంలో కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు ఆదివారం కర్ణాటకలోని ఉర్వా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ప్రవర్తన జాతీయ గేయాన్ని అగౌరవపరచడమేనని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు విమర్శించారు. ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ నాయకత్వం జాతీయ గేయం 'వందేమాతరం' పట్ల తీవ్రమైన అగౌరవాన్ని కలిగి ఉందని ఆరోపించారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవాలపై దుమారం రేగింది. జెండావందనం సందర్భంగా వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించకుండా ఆ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ మధ్యలోనే అడ్డుకున్నారని బీజేపీ ఆరోపించింది. ఇందుకు సంబంధించిన వీడియో దృశ్యాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి బి.ఎల్.సంతోష్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. తల్లి, తనయుడు, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు పూర్తి వందేమాతరాన్ని ఆలపించడానికి ఇష్టపడుతున్నట్లు లేదని, కొందరి ఆలోచనాధోరణి 1947కి పూర్వం ఎలా ఉందో ఆ తర్వాతా అలాగే ఉందని విమర్శించారు. వందేమాతరం పూర్తి గేయాన్ని ఎందుకు వేశారంటూ కార్యకర్తల్ని సోనియా ప్రశ్నించారని, అది ఎంతో సిగ్గుచేటు అని బీజేపీ అధికార ప్రతినిధి గోపాలకృష్ణ అగర్వాల్ మండిపడ్డారు. అయితే, బీజేపీ విమర్శలకు కాంగ్రెస్ వివరణ ఇచ్చింది. వివాదమేమీ లేదని కొట్టిపారేసింది. ఎక్కువసేపు నిల్చొని ఉన్న ఖర్గేకు కుర్చీ వేయాల్సిందిగా సోనియా సైగ చేశారని, గేయాన్ని ఆపాలని కాదని క్లారిటీ ఇచ్చింది.

## మోడీ హింసాత్మక పాలనకు ఎదురు నిలిచిన యువత

విశ్వంభర, నేషనల్ బ్యూరో: నీట్? పేపర్? లీక్? సహా వివిధ పరీక్షల అక్రమాలపై ఆందోళనలకు దిగిన విద్యార్థులపై కాంగ్రెస్ ఎంపీ, లోక్?సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రశంసలు కురిపించారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూ, అధికారాన్ని ప్రశ్నిస్తూ నిలబడిన భారత యువత ధైర్యం, పట్టుదలను కొనియాడారు. ముఖ్యంగా ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థినులు ఎదుర్కొన్న వేధింపులు, దూషణలు, హింసను ప్రస్తావిస్తూ వారికి తన మద్దతు ప్రకటించారు. విద్యార్థులతో ఇటీవల నిర్వహించిన సమావేశానికి సంబంధించిన వీడియోను రాహుల్ గాంధీ ఆదివారం సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు.

'జవాబుదారీతనం కోసం పోరాడుతూ, మోడీ హింసాత్మక పాలనకు ఎదురు నిలిచిన భారత యువత ధైర్యం, స్థైర్యం ప్రశంసనీయం. శాంతి, ప్రేమ, హాస్యాన్ని ఆయుధాలుగా చేసుకుని యువత తమ గళాన్ని వినిపించింది. అధికారాన్ని ప్రశ్నించడం, తమ హక్కుల కోసం నిలబడటం ప్రజాస్వామ్యంలో కీలకం. బీజేపీ కార్యకర్తల నుంచి దురుసు ప్రవర్తన, మాటల దాడులు, హింసను ఎదుర్కొన్నప్పటికీ విద్యార్థినులు వెనక్కి తగ్గలేదు. కొంతమందిని ప్రధాని మోడీకి క్షమాపణ చెప్పే పరిస్థితికి కూడా నెట్టారు. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్న ప్రతి ఒక్క యువతిపై తనకు గర్వంగా ఉంది. ఇక వారి గొంతులను ఎవరూ అణచలేరు. విద్యార్థులు తమ సమస్యలను బహిరంగంగా చెప్పుకునే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉంది' అని రాహుల్ గాంధీ అన్నారు. ఇక విద్యార్థులతో తన సమావేశాలను కొనసాగించనున్నట్లు రాహుల్ తెలిపారు. ఆగస్టు 22న పుణెలో 'ఛత్రోన్ కీ గూంజ్' పేరుతో మరో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈసారి కార్యక్రమం ప్రత్యేకంగా విద్యార్థినుల కోసమే నిర్వహించనున్నట్లు తెలిపారు. 'ఇప్పుడు అమ్మాయిలు మాట్లాడతారు. దేశం వింటుంది' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను నేరుగా వినడం, వారి అనుభవాలను దేశ ప్రజల ముందుకు తీసుకురావడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. రాహుల్ గాంధీ ఈ నెల 5న విద్యార్థులతో సమావేశమైన అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఐదుగురు విద్యార్థులు ఆయనతో కలిసి మీడియా ముందుకు వచ్చారు. వారిలో మోడల్ రియా అహిర్ కూడా ఉన్నారు. ముంబైలో విద్యార్థుల నిరసన సందర్భంగా పోలీసు వ్యాన్‌ను అడ్డుకుంటూ ఆమె నిలబడిన ఫొటో అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అయింది. తనపై ఆన్‌లైన్‌లో వేధింపులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ రియా అహిర్ పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. ఇక దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థుల నిరసనల్ని కూడా రాహుల్ గాంధీ ఇటీవల జరిగిన ఛత్రోం కీ గూంజ్ కార్యక్రమంలో ప్రస్తావించారు. ఈ నిరసనలు చీకటిలో వెలుగు దివ్వెలా నిలిచాయని, తమ భయాల్ని పక్కనబెట్టి పోరాడిన యువతకు శుభాకాంక్షలు తెలిపారు. అయితే సమస్యల్ని పరిష్కరించేందుకు ద్వేషం, హింసను ఆశ్రయించబోమని స్పష్టం చేసిన రాహుల్ గాంధీ 'ప్రేమ, ఆప్యాయతతో వ్యవస్థను మారుస్తాం' అని చెబుతూ, యువత కూడా అదే మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు హాజరయ్యారు. తీవ్రంగా కురిసిన వర్షానికి మైదానంలో నీళ్లు నిలిచిపోవడం, బురద పేరుకుపోయినప్పటికీ పెద్ద ఎత్తున యువత కార్యక్రమానికి తరలివచ్చారు. రాహుల్ గాంధీ రాకకు ముందు ముంబయికి చెందిన ర్యాపర్లు డ్యాన్స్ ప్రదర్శనలు చేశారు. కార్యక్రమానికి ముందు రోజు కాంగ్రెస్ ఆధ్వర్యంలో నగరంలో బైక్ ర్యాలీ కూడా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు అంతకుముందు హాస్టళ్లలో ఎదురవుతున్న సమస్యలు, పోటీ పరీక్షలకు సంబంధించిన ఇబ్బందుల్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తున్నట్లు తెలిపారు

# సొంత చెల్లికే న్యాయం చేయలేని వారు.. 2 కోట్ల మంది ఆడబిడ్డలకు చేస్తారా?: రేవంత్

## గురుదేవ్ సందేశం నన్నెంతో ప్రభావితం చేసింది: రాంచందర్ రావు



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: భారత మాజీ ప్రధాని, 'భారతరత్న' అటల్ బిహారీ వాజ్‌పేయి తన జీవితాన్ని దేశానికి అంకితం చేసిన నిస్వార్థ నేత అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు కొనియాడారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వాజ్ పేయి చిత్రపటానికి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాంచందర్ రావు 'వాజ్‌పేయి దాదాపు ఆరేళ్లకు పైగా ప్రధానిగా దేశాన్ని సమర్థవంతంగా నడిపించారు. వారి హయాంలో చేపట్టిన జాతీయ రహదారుల నిర్మాణం, టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులు, సామాన్యులకు సైతం గ్యాస్ కనెక్షన్లు సులభంగా అందేలా చేయడం వంటి సంస్కరణలు దేశాభివృద్ధికి బలమైన పునాది వేశాయి. భారత రాజకీయ చరిత్రలో వాజ్‌పేయి గారి పరిపాలనా కాలాన్ని ఒక 'స్వర్ణయుగం'గా పరిగణిస్తారు' అని పేర్కొన్నారు. వాజ్‌పేయి పాటించిన విలువలతో కూడిన రాజకీయాలను ప్రస్తావిస్తూ, 'పార్లమెంటులో కేవలం ఒక్క ఓటు తేడాతో ప్రభుత్వం పడిపోయే పరిస్థితి ఉన్నప్పటికీ, నైతిక విలువలకు కట్టుబడి రాజీపడకుండా నిలిచిన మహోన్నత నాయకుడు ఆయన. అధికారం కంటే ప్రజాస్వామ్య విలువలకే వాజ్‌పేయి గారు అగ్రతాంబూలం ఇచ్చారు. నేటి తరం రాజకీయ నాయకులు, యువత ఆ ఉన్నతమైన విలువల నుంచి స్ఫూర్తి పొందాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అని స్పష్టం చేశారు. జీవితాంతం దేశ సేవకే అంకితమైన వాజ్‌పేయి నిస్వార్థ దేశభక్తి, అంకితభావాన్ని గుర్తించి ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం వారికి దేశ అత్యున్నత పురస్కారమైన 'భారతరత్న'తో సత్కరించిందని తెలిపారు. వాజ్‌పేయి భౌతికంగా మన మధ్య లేకపోయినా, వారి ఆశయాలు, సిద్ధాంతాలు నిరంతరం ప్రతి భారతీయుడి హృదయంలో చిరస్థాయిగా నిలిచి ఉంటాయన్నారు. నేటి యువతరం వారి జీవిత చరిత్రను అధ్యయనం చేసి, వారి చూపిన మార్గంలో నడవడమే వారికిచ్చే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు.

### ఆధ్యాత్మిక గురువుల పాత్ర కీలకం..

నేటి యువతకు సరైన దిశ, స్పష్టమైన మార్గదర్శకత్వం ఎంతో అవసరమని, పూజ్య గురుదేవ్ వంటి మహనీయుల ఆశీస్సులు, మార్గదర్శనం ద్వారానే భావితరం సన్మార్గంలో పయనిస్తుందని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్ రావు పేర్కొన్నారు. గురుదేవ్ ఆధ్యాత్మిక సమక్షంలో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని, ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని, రాబోయే యువతరం గురించి వారు పలికిన ప్రతి మాట అక్షరాలా శతశాతం సత్యమని ఆయన అన్నారు. వారి ప్రవచనాలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని, గురుదేవ్ ఇచ్చిన సందేశాన్ని తూచా తప్పకుండా ఆచరణలో పెడుతూ సమాజ సేవ, మానవ సేవకు నిరంతరం అంకితమై పని చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఒక న్యాయవాదిగా, విద్యావంతుడిగా సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగిన ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతను గుర్తించి, సమాజాన్ని సరైన దిశగా నడిపించాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజ హితం కోసం నిస్వార్థంగా పని చేసే ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక గురువుల ఆశీస్సులు ఎల్లప్పుడూ వెన్నంటే ఉంటాయని పేర్కొన్నారు.



ఎల్బీనగర్లోని వన్ కన్వెన్షన్లో జరిగిన దొడ్డా నారాయణరావు, విజయ లక్ష్మీ దంపతుల కూతురు రితిక-రక్షిత్ ల నిశ్చితార్థ కార్యక్రమానికి వీ 3 న్యూస్ ఛానల్, ప్రజా విశ్వంభర దినపత్రికల ఛైర్మన్ డా.కాచం సత్యనారాయణ- సుష్మ దంపతులు హాజరై నూతన జంటను శుభాకాంక్షలు తెలిపారు.


విశ్వంభర, ములుగు: మేడారంలో వనదేవతలను బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. రామప్ప దేవాలయంతో సమానంగా సమ్మక్క, సారలమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ములుగు జిల్లాలో సీఎం పర్యటించారు.

### తొలుత మేడారంలో పర్యటించిన సీఎం..

వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ములుగు చేరుకుని గట్టమ్మ దేవాలయం వద్ద హ్యామ్ రోడ్ల పైలాన్‌ను ఆవిష్కరించారు. ఆ తర్వాత జిల్లా కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించారు. ములుగు జిల్లాలో రూ.868 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు."ఆనాడు పీసీసీ అధ్యక్షుడిగా ములుగు నుంచే పాదయాత్ర మొదలు పెట్టాం. పోరాటానికి, పౌరుషానికి మారుపేరైన సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుని పాదయాత్ర చేపట్టాం. ప్రజల సమస్యలు తెలుసుకుని తీరుస్తామని హామీ ఇచ్చాం. మీ ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చాం. మల్లూరు నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి త్వరలోనే నిధులు మంజూరు చేస్తాం. జంపన్న వాగును కూడా నూటికి నూరు శాతం అభివృద్ధి చేస్తాం. ములుగు ప్రాంత అభివృద్ధికి ఏం కావాలో చెబితే నిధులు మంజూరు చేస్తాం.

### సీతక్కను సొంత ఆడబిడ్డలా..

రక్తం పంచుకు పుట్టకపోయినా సీతక్కను సొంత ఆడబిడ్డగా చూసుకుంటున్నాం. కొందరు ఆస్తిలో భాగం ఇవ్వాల్సి వస్తుందని సొంత చెల్లినే బయటకు నెట్టారు. సొంత చెల్లికే న్యాయం చేయని వారు.. రాష్ట్రంలోని 2 కోట్ల మంది ఆడబిడ్డలకు న్యాయం చేస్తారా?



కుమారుడు దౌర్జన్యం చేస్తుంటే మందలించాల్సిన తండ్రి ఫాంహౌస్‌లో పడుకున్నారు. సొంత బిడ్డను ఇంటి నుంచి బయటకు వెళ్లగొడుతుంటే మౌనంగా ఉన్నారు. కుమారుడు చేసిన నేరంలో తండ్రికి కూడా సగభాగం ఉన్నట్లే. అలాంటి తండ్రీకుమారులు రాష్ట్రానికి పట్టిన శనీశ్వరులు. ఇంకొకరు అఘోరారావు.. అఘోరా పూజలు చేస్తున్నారు. ప్రజలు ఇబ్బందులు పడాలని కోరుకున్నారు. దేవుడు మనవైపు ఉన్నాడు.. వర్షాలు కురిపించాడు.

### రేవంత్ నాయకత్వంలో ములుగు అభివృద్ధి మంత్రి సీతక్క

ములుగు అంటే గతంలో అభివృద్ధి లేని ప్రాంతం అనేవారని మంత్రి సీతక్క అన్నారు. సీఎం రేవంత్ నాయకత్వంలో ఈ జిల్లా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. "పదేళ్లు కొట్లాడితే ములుగు జిల్లా ఇచ్చారు. ఏడాదిలో మూడుసార్లు వనదేవతలను దర్శించుకున్న సీఎం రేవంత్. రాష్ట్రంలో ఏ జిల్లాకూ ఇవ్వనన్ని ఇందిరమ్మ ఇళ్లు ములుగు జిల్లాకు ఇచ్చారు" అని చెప్పారు.

## కన్నుల పండువగా శ్రీ వాగ్దేవి నాట్యస్థల్ వార్షికోత్సవం

విశ్వంభర, హైదరాబాద్: సాంప్రదాయ నృత్య కళలు ఎన్ని విభిన్న రూపాల్లో ఉన్నప్పటికీ వాటి అంతిమ పరమార్థం రససిద్ధిని సాధించి ప్రేక్షకులను ఆనంద పరవశుల్ని చేయడమేనని ప్రఖ్యాత భరతనాట్యం గురువు, కనకదుర్గ నాట్య విభావరి అధ్యక్షురాలు నిర్మలా ప్రభాకర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో శ్రీ వాగ్దేవి నాట్యస్థల్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నిర్మలా ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సాంప్రదాయ నృత్య కళలు మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక భావాలను తరతరాలకు అందించే గొప్ప మాధ్యమాలని పేర్కొన్నారు. నాట్యం ద్వారా పురాణాలు, ఇతిహాసాలు, భక్తి భావాలు, సామాజిక సందేశాలను సజీవంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావచ్చని అన్నారు. కూచిపూడి నాట్య కళాభివృద్ధి, ప్రచారానికి శ్రీ వాగ్దేవి నాట్యస్థల్ డైరెక్టర్ శైలజ వడ్డాణం చేస్తున్న కృషిని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దాదాపు 60 మంది యువ కళాకారులు వేదికపై తమ నాట్య ప్రతిభను ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. భక్తి, శృంగార, వీర తదితర రసభావాలను ప్రతిబింబించే నృత్యాంశాలతో కళాకారులు అద్భుత ప్రదర్శనలు ఇచ్చారు. రేవతి రాగం, ఆదితాళంలో కూర్చిన మహిషాసుర మర్దిని, పంతువరాళి రాగం,




ఆదితాళంలో రూపొందించిన శివతాండవం, రాగమాలికలో మిశ్రచాపు తాళంతో ప్రదర్శించిన ప్రహ్లాద పట్టాభిషేకం, ఆదితాళంలో సంచార ఆధార అంశం, హిందోళ రాగం, ఆదితాళంలో జగతపు తనువు జాతర తదితర నృత్యాంశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శాస్త్రీయ నృత్యంలోని లయ, రాగం, అభినయం, ముద్రల సమన్వయంతో సాగిన ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. స్నిగ్ధ, శివాహి, లిఖిత, నిశ్చిత, అషీరా, ప్రేరణ, సమృద్ధి, మధుశ్రీ, వైష్ణవి, లాస్యతో పాటు పలువురు కళాకారులు తమ నాట్య నైపుణ్యంతో అలరించారు. చిన్నారుల నుంచి యువ కళాకారుల వరకు ఎంతో ఉత్సాహంగా పాల్గొని భారతీయ సాంప్రదాయ నృత్య కళపై తమ అభిరుచిని చాటుకున్నారు. కార్యక్రమానికి శ్రీ వాగ్దేవి నాట్యస్థల్ డైరెక్టర్ శైలజ వడ్డాణం స్వాగతం పలికారు. నృత్య కళను అభ్యసిస్తున్న విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం, భారతీయ శాస్త్రీయ నృత్య సంప్రదాయాలను భావితరాలకు చేరవేయడమే సంస్థ లక్ష్యమని ఆమె తెలిపారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన గురువులు, కళాకారులు, తల్లిదండ్రులు, ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలుపుతూ వందన సమర్పణ చేశారు. రసరమ్యమైన నృత్య ప్రదర్శనలతో, కళాకారుల అద్భుత ప్రతిభతో శ్రీ వాగ్దేవి నాట్యస్థల్ వార్షికోత్సవం కన్నుల పండువగా సాగి, ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది.

## మరో రైలు ఢీకొని యువతి మృతి

విశ్వంభర, సికింద్రాబాద్: తల్లిదండ్రులతో కలిసి రైలు దిగి పట్టాలు దాటుతుండగా.. మరో రైలు ఢీకొన్న ఘటనలో ఓ యువతి మృతి చెందింది. ఈ విషాదకర ఘటన మౌలాలి రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సాయిఈశ్వర్ గౌడ్ కథనం ప్రకారం.. జనగామ జిల్లా నేరేడుమెట్లకు చెందిన ప్రకాశ్, జ్యోతి దంపతులు కొంతకాలంగా మౌలాలి హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె మానస (20) నెల రోజుల క్రితమే నర్సు శిక్షణ పూర్తి చేసుకుంది.కుటుంబ సభ్యులు కలిసి జనగామలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి.. గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. మౌలాలి రైల్వేస్టేషన్ వద్ద తల్లిదండ్రులతో కలిసి రైలు దిగిన మానస.. రెండో నంబరు ప్లాట్‌ఫాం నుంచి 1వ నంబరుకు వెళ్లేందుకు పట్టాలు దాటుతుండగా అదే సమయంలో దూసుకొచ్చిన విశాఖ- సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ ఆమెను ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీకి తరలించారు. రెప్పపాటులో జరిగిన ఈ విషాద ఘటనతో ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.



## రేషన్ కార్డులపై మీ ఫోటోలు ఎందుకు? మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి సూటి ప్రశ్న



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: రేషన్ కార్డులపై సీఎం, ఉత్తమ్ ఫోటోలు ఎందుకని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ప్రశ్నించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. సన్న బియ్యానికి బ్రాండ్ అంబాసిడర్ కేసీఆర్ అని.. సన్న బియ్యం పంపిణీ మొదలు పెట్టింది కేసీఆర్ అని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు రేవంత్ అబద్ధాలు మాట్లాడారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డికి బూతులు తప్ప రాష్ట్రానికి ఉపయోగపడే పని ఒక్కటీ లేదని మండిపడ్డారు. రైతులను కంటిమీద కునుకు లేకుండా ఇబ్బంది పెడుతున్న సీఎం.. వ్యవసాయాన్ని పండుగ చేశామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. 2 లక్షల ఉద్యోగాలు ఏవి ?నిరుద్యోగ భృతి ఏది అని.. రాజీవ్ యువ వికాసం ఏమైందని ప్రశ్నించారు. సంగారెడ్డికి వచ్చి వ్యక్తిగత విమర్శలు చేసిపోయారని.. ఒక్క పైసా కూడా ఇవ్వలేదని అన్నారు. హరీశ్‌రావుపై క్షుద్ర పూజల ఆరోణలు చేస్తున్నారని.. నవీన యుగంలోనూ సీఎం రేవంత్ రాతి యుగంలో ఉన్నట్టు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. క్షుద్ర పూజలు చేసే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారా? అని నిలదీశారు. రేవంత్‌రెడ్డి ఎన్ని డైవర్షన్ రాజకీయాలు చేసినా వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపును అడ్డుకోలేరని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు మాణిక్ రావు, చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ సిటీ పోలీస్‌లో కొలువులు..

### 150 ఎస్పీఓ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

విశ్వంభర, హైదరాబాద్: హైదరాబాద్ సిటీ పోలీస్ విభాగంలో ఖాళీగా ఉన్న 150 ప్రత్యేక పోలీసు అధికారులు పోస్టులను పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం మాజీ సైనికులు, మాజీ పారామిలటరీ బలగాలు, రిటైర్డ్ పోలీసు సిబ్బంది నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. మాజీ సైనికుల వయస్సు 31-08-2026 నాటికి 58 సంవత్సరాల కంటే తక్కువ ఉండాలి. మాజీ పారామిలటరీ, రిటైర్డ్ పోలీసు సిబ్బంది పదవీ విరమణ పొందిన తర్వాత రెండు సంవత్సరాల లోపు వారై ఉండాలి. వీరికి గరిష్ట వయోపరిమితి 62 సంవత్సరాలుగా నిర్ణయించారు. ఎంపికైన వారికి నెలకు రూ.26,000 గౌరవ వేతనంగా చెల్లిస్తారు. ఎలాంటి వేతనంతో కూడిన సెలవులు ఉండవు. అయితే అత్యవసర సమయంలో వేతనం చెల్లింపు లేకుండా సెలవులు మంజూరు చేస్తారు. అభ్యర్థులు ఒరిజినల్, జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలి. డిశ్చార్జ్ బుక్/డిశ్చార్జ్ సర్టిఫికేట్/రిటైర్మెంట్ ఆర్డర్, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, ఎస్‌బీఐ పాస్‌బుక్ జిరాక్స్, ఓటరు గుర్తింపు కార్డు, కుల ధృవీకరణ పత్రం, టెక్నికల్ ట్రేడ్ ప్రొఫిషియన్సీ సర్టిఫికెట్ సమర్పించాలి. డ్రైవర్ అభ్యర్థులకు చెల్లుబాటు అయ్యే ఎల్‌వీఎ/ఎవీఎ డ్రైవింగ్ లైసెన్స్ అవసరం. అలాగే మూడు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు సమర్పించాలి.

**దరఖాస్తు సమర్పణ విధానం- చివరి గడువు**

ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు అవసరమైన పత్రాలతో హైదరాబాద్ పెట్లబుర్జ్‌లోని సీఎఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్న ఎస్పీవోస్ కార్యాలయంలో వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను 25-08-2026 సాయంత్రం 5:00 గంటల లోపు సమర్పించాలి. గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని అధికారులు స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో అతిపెద్ద మట్టిగణపతి.. ఈసారి నాగోల్‌లో..



విశ్వంభర, ఉప్పల్: తెలంగాణలో వినాయకచవితి నవరాత్రుల వేడుకలు ఏస్థాయిలో జరుగుతాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ముఖ్యంగా హైదరాబాద్ గణేష్ చతుర్థి నవరాత్రోత్సవాలకు పెట్టింది పేరు. గల్లీ గల్లీకి కనీసం రెండుమూడు గణేషుడి మండపాలైనా దర్శనమిస్తాయి. రకరకాల థీమ్స్ లో గణేషులను ప్రత్యేకంగా తయారు చేయించి మరీ.. ఘనంగా నవరాత్రోత్సవాలను నిర్వహిస్తారు. ఇక హైదరాబాద్ లో వినాయకచవితి ఉత్సవాలనగానే.. అందరికీ ఖైరతాబాద్ గణేషుడే గుర్తొస్తారు. భారీ రూపాన్ని దర్శించుకునేందుకు నగర నలుమూలల నుంచే కాదు.. తెలుగు రాష్ట్రాల నుంచి అనేకమంది ఈ ప్రాంతానికి క్యూ కడతారు. 11 రోజులపాటు నిర్వహించే గణేష్ చతుర్థి ఉత్సవాలతో ఖైరతాబాద్ ప్రాంతమంతా భక్తులతో కిక్కిరిసిపోయి ఉంటుంది. ఈ ఏడాది ఖైరతాబాద్ గణేషుడిని 69 అడుగుల ఎత్తులో పంచముఖ సంకటహర మహా గణపతి థీమ్ తో రూపొందిస్తున్నారు. అయితే ఈసారి ఖైరతాబాద్ గణేషుడిని మించిన ఎత్తుతో నాగోల్ లో మహా మట్టిగణపతి కొలువుదీరుతున్నాడు. నాగోల్ లోని తిరంగ్ యూత్ అసోసియేషన్ తీసుకున్న నిర్ణయం ఆసక్తిని రేకెత్తిస్తోంది. పదేళ్లుగా ఈ అసోసియేషన్ మట్టి విగ్రహాన్నే ఏర్పాటు చేయిస్తుండగా.. ఈసారి ఏకంగా 72 అడుగుల భారీ మట్టి గణపతిని తయారు చేయిస్తున్నారు. అష్టసిద్ధి మహాగణపతిగా కొలువుదీరుతున్న ఈ ఏకదంతుడు ఈసారి భాగ్యనగరంలో అతిపెద్ద గణేషుడు కావడం విశేషం. విగ్రహంపై ఏడు విభిన్న రూపాల్లో చిన్న గణేషుల ప్రతిమలను రూపొందిస్తున్నారు. నెలరోజులుగా 21 మందికిపైగా కార్మికులు విగ్రహ తయారీలో నిమగ్నమయ్యారు. పర్యావరణాన్ని కాపాడుతూ.. కేవలం మట్టి విగ్రహాలను మాత్రమే పూజించాలని అందరికీ చాటిచెప్పడమే లక్ష్యంగా ఈ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మరో 30 రోజుల్లో విగ్రహ నిర్మాణం పూర్తవుతుందని, పండుగకు మూడురోజుల ముందునుంచే స్వామివారి దర్శనాన్ని కల్పిస్తామని వెల్లడించారు.

## డా.కాచం సత్యనారాయణకు ఆహ్వానం

విశ్వంభర, హైదరాబాద్: ఎల్బీనగర్‌లోని కామినేని హాస్పిటల్ వెనుక భాగంలో ఈ నెల 25న "ఎస్‌వీవీ కన్సల్టెన్సీ, తన్విక్ ఇంటీరియర్స్ అండ్ రియల్ ఎస్టేట్" నూతన కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని వీ3, విశ్వంభర దిన పత్రిక చైర్మన్ కాచం సత్యనారాయణకు నిర్వాహకులు సంతోష్ నాయక్ ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా కాచం సత్యనారాయణను శాలువాతో సత్కరించి, ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ కార్యక్రమంలో వీ3, విశ్వంభర దిన పత్రిక బ్యూరో చీఫ్ దుమ్మాజీ నవీన్, నరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌తో సమానంగా ములుగు అభివృద్ధి : మంత్రి సీతక్క

విశ్వంభర, హైదరాబాద్: హైదరాబాద్ తో సమానంగా ములుగు అభివృద్ధి చెందుతోందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ములుగు జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటిస్తున్నారు. మేడారం వద్ద సమ్మక్క – సారలమ్మ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు, తులాభారం నిర్వహించి.. మొక్కులు తీర్చుకున్న అనంతరం.. ములుగు జిల్లా నూతన కలెక్టరేట్ ను ఆయన ప్రారంభించారు. కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గతంలో ములుగు అంటే అడవులు, అభివృద్ధి లేని ప్రాంతంగా చూసేవారని గుర్తుచేసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక.. ములుగు అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ములుగు జిల్లా కోసం 10 ఏళ్లు కొట్లాడితే.. 33వ జిల్లాగా ఇచ్చారన్నారు. ఎన్నికలకు ముందే ములుగు కలెక్టరేట్ కు శంకుస్థాపన జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కలెక్టరేట్ నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేసిందన్నారు. ఏడాది కాలంలో సమ్మక్క – సారలమ్మలను దర్శించుకున్న ఏకైక సీఎం.. రేవంత్ రెడ్డి ఒక్కరేనన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లాకూ ఇవ్వనన్ని ఇందిరమ్మ ఇళ్లను ములుగు జిల్లాకు ఇచ్చారని సీతక్క తెలిపారు.

# ప్రధాని వ్యాఖ్యలు రాజకీయ విమర్శగా మాత్రమే చూడగలమా?

"మేధో నక్సలిజం"పై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలను కేవలం మావోయిస్టు భావజాలంపై చేసిన రాజకీయ విమర్శగా మాత్రమే చూడగలమా? లేక దేశంలో అసమ్మతి, ప్రత్యామ్నాయ రాజకీయ ఆలోచనల పట్ల పాలకపక్ష వైఖరిలో వస్తున్న మార్పుకు సంకేతంగా చూడాలా? ఇప్పుడీ ప్రశ్న మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.కమ్యూనిస్టు, మావోయిస్టు సిద్ధాంతాలతో బీజేపీకి తీవ్రమైన సైద్ధాంతిక విభేదాలు ఉండటం కొత్త విషయం కాదు. కమ్యూనిస్టులు వర్గ రాజకీయాలు, లౌకికవాదం, ప్రభుత్వ రంగం, సంపద పంపిణీ వంటి అంశాల్లో ఒక దృక్పథాన్ని ప్రతిపాదిస్తే, బీజేపీ అందుకు భిన్నమైన రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక దృక్పథాన్ని ముందుకు తెస్తుంది.సిద్ధాంతాల మధ్య ఈ ఘర్షణ ప్రజాస్వామ్యంలో సహజమే.కానీ సమస్య అక్కడితో ఆగడం లేదు.

ప్రధాని తన విమర్శను కాంగ్రెస్ రాజకీయ విధానాలు, ఆ పార్టీ "మైండ్‌సెట్" వరకు విస్తరించేలా మాట్లాడినప్పుడు అది మరింత తీవ్రమైన చర్చకు దారితీస్తుంది. దేశంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన ప్రధాన ప్రతిపక్ష పార్టీ విధానాలను కూడా "మేధో నక్సలిజం" పరిధిలోకి నెట్టే రాజకీయ భాష ఉపయోగిస్తే-రేపు ప్రజాస్వామిక ప్రతిపక్షానికి ఉన్న స్థానం ఏమిటి?కాంగ్రెస్‌తో విభేదించవచ్చు - కానీ నక్సలిజంతో ముడిపెటడమా?బీజేపీకాంగ్రెస్‌ను తీవ్రంగా విమర్శించవచ్చు. కాంగ్రెస్ ఆర్థిక విధానాలు తప్పని చెప్పవచ్చు. ఆ పార్టీ లౌకికవాద విధానాన్ని వ్యతిరేకించవచ్చు. సంక్షేమం, రిజర్వేషన్లు, మైనారిటీ విధానం, విదేశాంగం- దేనిపైనైనా రాజకీయంగా పోరాడవచ్చు.అదే ప్రజాస్వామ్యం.కానీ ఒక ప్రధాన పార్లమెంటరీ ప్రతిపక్ష పార్టీ ఆలోచనా విధానాన్నే నక్సలిజంతో ముడిపెట్టే స్థాయికి రాజకీయ భాష చేరితే దాని పరిణామాల గురించి ఆలోచించాల్సిందే.ఎందుకంటే "నక్సలిజం" సాధారణ రాజకీయ విమర్శకు ఉపయోగించే పదం కాదు. భారతదేశంలో అది సాయుధ తిరుగుబాటు, హింస, అంతర్గత భద్రత వంటి అంశాలతో ముడిపడి ఉంది.అటువంటి పదాన్ని రాజకీయ ప్రత్యర్థుల భావజాలానికి వర్తింపజేస్తూ పోతే.. రాజకీయ ప్రత్యర్థి క్రమంగా రాజకీయ శత్రువుగా చిత్రీకరించబడే ప్రమాదం ఉంటుంది.నేడు కాంగ్రెస్..రేపు ఎవరు?ఇదే అసలు ఆందోళన.నక్సలిజాన్ని వ్యతిరేకించడంలో సమస్య లేదు. సాయుధ హింసను ప్రజాస్వామిక సమాజం అంగీకరించాల్సిన అవసరమూ లేదు.కానీ "మేధో నక్సలిజం" అనే నిర్వచనం విస్తరిస్తూ పోతే దాని హద్దు ఎక్కడ?నేడు కమ్యూనిస్టు మేధావి కావచ్చు..రేపు కాంగ్రెస్ నాయకుడు కావచ్చు..ఆ తరువాత ప్రభుత్వాన్ని విమర్శించే పాత్రికేయుడు కావచ్చు..విశ్వవిద్యాలయఅధ్యాపకుడు




కావచ్చు.. విద్యార్థి నాయకుడు కావచ్చు..రైతు ఉద్యమకారుడు కావచ్చు..కార్మిక సంఘ నాయకుడు కావచ్చు..అందుకే ఇది కేవలం కాంగ్రెస్ సమస్య కాదు.ఇది ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం, అసమ్మతి, భావప్రకటన స్వేచ్ఛకు సంబంధించిన సమస్య.ప్రతిపక్షం శత్రువు కాదు..ప్రత్యామ్నాయం.ప్రజాస్వామ్యంలో అధికార పక్షానికి ప్రతిపక్షం శత్రువు కాదు. ప్రత్యామ్నాయం.ప్రజలు ఈరోజు ఒక పార్టీకి అధికారం ఇవ్వవచ్చు. రేపు మరో పార్టీకి ఇవ్వవచ్చు. అధికారంలో ఉన్నవారు ప్రతిపక్షంలోకి వెళ్లవచ్చు. ప్రతిపక్షంలో ఉన్నవారు అధికారంలోకి రావచ్చు.ఈ అవకాశమే ప్రజాస్వామ్యానికి ప్రాణం.అందుకే ప్రతిపక్షాన్ని రాజకీయంగా ఓడించాలి. ఎన్నికల్లో ఓడించాలి. ప్రజల ముందు వారి విధానాలు తప్పని నిరూపించాలి.కానీ ప్రతిపక్ష రాజకీయ ఆలోచనలకే "నక్సలిజం" వంటి భద్రతాపరమైన ముద్రలు అంటించడం ప్రారంభమైతే, ఎన్నికల పోటీ క్రమంగా దేశభక్తులు-దేశవ్యతిరేకులు అనే ప్రమాదకరమైన విభజనగా మారే అవకాశం ఉంటుంది. సిద్ధాంతానికి సిద్ధాంతమే సమాధానం కమ్యూనిస్టు సిద్ధాంతం తప్పని బీజేపీ భావిస్తే తన సిద్ధాంతంతో దాన్ని ఎదుర్కోవాలి.కాంగ్రెస్ విధానాలు దేశానికి మంచివి కావని భావిస్తే ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల ముందుంచాలి. అంబేద్కరిస్టు, సోషలిస్టు, గాంధేయ, మార్క్సిస్టు ఏ భావజాలమైనా ప్రజల్లో స్వేచ్ఛగా చర్చకు రావాలి.ఏ సిద్ధాంతం మంచిదో నిర్ణయించాల్సింది ప్రభుత్వం కాదు.. ప్రజలు.ప్రజాస్వామ్యంలో పాలకుడు తన ఆలోచనను ప్రజలకు చెప్పవచ్చు. కానీ ప్రజలు ఏం ఆలోచించాలో నిర్ణయించే అధికారం పాలకుడికి ఉండదు. ఆలోచనకు భయపడాల్సిన అవసరం లేదు. ఒక బలమైన ప్రజాస్వామ్య ప్రభుత్వం విమర్శను చూసి భయపడాల్సిన అవసరం లేదు.ప్రశ్నకు సమాధానం చెప్పాలి.విమర్శకు ప్రతివాదం చేయాలి.సిద్ధాంతాన్ని సిద్ధాంతంతో ఎదుర్కోవాలి. ప్రభుత్వాన్ని విమర్శించినంత మాత్రాన ఎవరూ దేశద్రోహులు కారు.బీజేపీని వ్యతిరేకించినంత మాత్రాన ఎవరూ నక్సలైట్లు కారు. కాంగ్రెస్‌ను సమర్థించినంత మాత్రాన ఎవరూ దేశవ్యతిరేకులు కారు.కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అధ్యయనం చేసినంత మాత్రాన ఎవరూ సాయుధ తిరుగుబాటుదారులు కారు.ఆలోచనకు, హింసకు మధ్య ఉన్న గీతను చెరిపివేయకపోవడమే ప్రజాస్వామ్యానికి అత్యంత అవసరం.ఇది కాంగ్రెస్ ఒక్కదాని సమస్య కాదుప్రధాన ప్రతిపక్ష పార్టీ భావజాలానికే "మేధో నక్సలిజం" వంటి పదజాలం వర్తించే రాజకీయ వాతావరణం ఏర్పడితే ప్రజాస్వామ్యవాదులు అప్రమత్తం కావాలి.ఇది కాంగ్రెస్‌ను సమర్థించాలా? బీజేపీనివ్యతిరేకించాలా? అనే చిన్న రాజకీయ ప్రశ్న కాదు.అధికారంలో లేని పార్టీకి ఈ దేశంలో గౌరవ ప్రదమైన రాజకీయ స్థానం ఉంటుందా? పాలకులను వ్యతిరేకించే భావజాలానికి స్వేచ్ఛ ఉంటుందా?ప్రభుత్వాన్ని ప్రశ్నించే పౌరుడికి భయం లేకుండా మాట్లాడే అవకాశం ఉంటుందా?ఇవే అసలు ప్రశ్నలు.ప్రధానమంత్రి దేశానికి భరోసా ఇవ్వాల్సింది ఒకటే..సాయుధ హింసను ప్రభుత్వం చట్టబద్ధంగా ఎదుర్కొంటుంది; కానీ ప్రజాస్వామిక అసమ్మతిని, రాజకీయ ప్రత్యామ్నాయాలను, స్వతంత్ర ఆలోచనలను శత్రువులుగా చూడదు అని.ఆ స్పష్టత లేకపోతే "మేధో నక్సలిజం" అనే పదం భవిష్యత్తులో ఎవరిపై ప్రయోగించబడుతుందోనన్న ఆందోళన మరింత పెరుగుతుంది. చివరగా... ప్రతిపక్షం లేని వ్యవస్థ ప్రజా స్వామ్యంకాదు.విమర్శ లేని సమాజం స్వేచ్ఛా సమాజం కాదు.ఆలోచనకు భయపడే రాజ్యం బలమైన రాజ్యం కాదు.భారతదేశం తన ప్రజాస్వామ్య బలాన్ని నిరూపించుకోవాల్సింది ఆలోచనలను అణచివేయడం ద్వారా కాదు..తనకు వ్యతిరేకమైన ఆలోచనలను కూడా భరించగలగడం ద్వారా!



దేగల జనార్ధన్

## పశ్చిమ కనుమలు.. పరిరక్షణతోనే సుస్థిర అభివృద్ధి




పశ్చిమ కనుమల భవిష్యత్తుపై దేశవ్యాప్తంగా మరోసారి చర్చ మొదలైంది. జూలై 27, 2026న కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ పశ్చిమ కనుమలను పర్యావరణ సున్నిత ప్రాంతంగా ప్రకటించేందుకు ఏడో ముసాయిదా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గుజరాత్, మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోని 56,825.7 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని ఇందులో చేర్చారు. దశాబ్దానికి పైగా సాగుతున్న ఈ ప్రక్రియ ఇప్పటికీ తుది నిర్ణయానికి రాకపోవడం, ఈ అంశంలోని పర్యావరణ అవసరాలు, స్థానిక జీవనోపాధులు, అభివృద్ధి అవసరాల మధ్య సమతుల్యత ఎంత క్లిష్టమో తెలియజేస్తోంది.సుమారు 1,500--1,600 కిలోమీటర్ల మేర విస్తరించిన పశ్చిమ కనుమలు హిమాలయాల కంటే పురాతనమైన పర్వత వ్యవస్థ. 2012లో యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించిన ఈ ప్రాంతం ప్రపంచంలోని అత్యంత కీలకమైన జీవవైవిధ్య హాట్‌స్పాట్లలో ఒకటి. ఇక్కడ 4,000--5,000 వరకు వృక్ష జాతులు నమోదయ్యాయి. దాదాపు 650 చెట్ల జాతుల్లో 352 స్థానికంగా మాత్రమే కనిపించే ఎండెమిక్ జాతులు. ఉభయచరాలు, సరీసృపాల్లోనూ ఎండెమిజం అత్యధికంగా ఉంది. కనీసం 325 ప్రపంచవ్యాప్తంగా ముప్పును ఎదుర్కొంటున్న జాతులకు ఈ ప్రాంతం ఆశ్రయం కల్పిస్తోంది.అయితే పశ్చిమ కనుమల ప్రాధాన్యం అడవులు, వన్యప్రాణులతో మాత్రమే పరిమితం కాదు. గోదావరి, కృష్ణా, కావేరి వంటి ప్రధాన నదులకు ఈ పర్వత ప్రాంతం కీలక జలవనరుగా ఉంది. రుతుపవనాలపై ప్రభావం చూపుతూ దక్షిణ భారతదేశ వర్షపాత వ్యవస్థను కూడా ప్రభావితం చేస్తుంది. అడవులు నీటిని నిల్వ చేయడం, భూగర్భ జలాలను పునరుద్ధరించడం, నేలకోతను తగ్గించడం, కార్బన్‌ను గ్రహించడం వంటి సేవలను అందిస్తున్నాయి. అందువల్ల పశ్చిమ కనుమల పరిరక్షణ అనేది పర్యావరణ అంశం మాత్రమే కాదు; నీటి భద్రత, ఆహార భద్రత, వ్యవసాయం, వాతావరణ స్థిరత్వంతో ముడిపడిన జాతీయ అంశం.మరోవైపు మానవ ఒత్తిడి పెరుగుతున్న వాస్తవాన్ని కూడా విస్మరించలేం. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్, బెంగుళూరు సంస్థ పరిశోధన ప్రకారం 1985లో పశ్చిమ కనుమలలో సతత హరిత అటవీ కవర్ 16.21 శాతంగా ఉండగా, 2018 నాటికి అది 11.3 శాతానికి తగ్గింది. వ్యవసాయ విస్తరణ, వాణిజ్య తోటలు, నిర్మాణాలు, మైనింగ్, ఇతర భూవినియోగ మార్పులు అడవుల విభజనకు కారణమయ్యాయి. అడవుల నిరంతర విస్తీర్ణం చిన్న చిన్న ముక్కలుగా విడిపోవడం జీవవైవిధ్యానికే కాకుండా నీటి వ్యవస్థలకు కూడా దీర్ఘకాలిక ప్రమాదం.అందుకే పర్యావరణ పరిరక్షణను స్థానిక ప్రజల జీవనోపాధికి వ్యతిరేకంగా చూడటం సరైన దృష్టికోణం కాదు. కాఫీ, టీ, మిరియాలు, ఏలకులు వంటి తోటల సాగు, వ్యవసాయం, పర్యాటకం, చిన్న వ్యాపారాలు అనేక కుటుంబాలకు జీవనాధారం. పర్యావరణ సున్నిత ప్రాంతంగా గుర్తింపు పొందినంత మాత్రాన స్థానికుల సాధారణ జీవన కార్యకలాపాలను నిలిపివేయడం లక్ష్యం కాదు. ప్రమాదకరమైన మైనింగ్, క్వారీయింగ్, భారీ నిర్మాణాలు, అధిక కాలుష్య కార్యకలాపాలను నియంత్రిస్తూ, పర్యావరణానికి అనుకూలమైన వ్యవసాయం, బాధ్యతాయుతమైన పర్యాటకం, స్థానిక ఉత్పత్తులకు విలువ జోడించే పరిశ్రమలను ప్రోత్సహించే విధానం అవసరం. గత ముసాయిదాల్లోనూ ఈ తరహా కార్యకలాపాల మధ్య తేడాను స్పష్టంగా చూపించారు.అమలులో ప్రధానంగా అవసరమయ్యేది ఖచ్చితమైన మ్యాపింగ్. గ్రామ సరిహద్దులు, అటవీ ప్రాంతాలు, సాగుభూములు, నివాస ప్రాంతాలు, కీలక జీవవైవిధ్య ప్రాంతాలను ఉపగ్రహ సమాచారం, భౌగోళిక అధ్యయనాలు, స్థానిక సమాచారంతో కలిపి గ్రామ స్థాయిలో గుర్తించాలి. ఒకే నియమాన్ని పర్వతశ్రేణి మొత్తం మీద యాంత్రికంగా అమలు చేయడం కంటే ప్రాంతానుసారంగా కార్యకలాపాలను వర్గీకరించడం మెరుగైన మార్గం. ప్రజల అభిప్రాయాలను నిర్ణయ ప్రక్రియలో చేర్చడం కూడా అంతే ముఖ్యం.అదే సమయంలో పరిరక్షణ భారం మోయే స్థానిక సమాజాలకు ఆర్థిక ప్రోత్సాహకాలు అవసరం. పర్యావరణ సేవలకు చెల్లింపులు, నీటి సంరక్షణకు ప్రోత్సాహకాలు, స్థానిక యువతకు ప్రకృతి ఆధారిత ఉపాధి, బాధ్యతాయుత పర్యాటకం, అటవీ ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్లు వంటి చర్యలు తీసుకుంటే సంరక్షణ ప్రజలకు భారంగా కాకుండా అవకాశంగా మారుతుంది.పశ్చిమ కనుమల విషయంలో ఇక అవసరమైంది 'పర్యావరణమా? అభివృద్ధా?' అనే ఎంపిక కాదు. పర్యావరణాన్ని కాపాడుతూ అభివృద్ధి చేసే కొత్త నమూనా అవసరం. మైనింగ్ కంటే నీటి భద్రత, అనియంత్రిత నిర్మాణాల కంటే ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, ప్రకృతి విధ్వంసక పర్యాటకం కంటే బాధ్యతాయుతమైన పర్యాటకం, తాత్కాలిక ఆదాయం కంటే దీర్ఘకాలిక జీవన భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. పశ్చిమ కనుమలను కాపాడటం అంటే ఒక పర్వతశ్రేణిని మాత్రమే రక్షించడం కాదు; దక్షిణ భారతదేశపు నీరు, వ్యవసాయం, జీవవైవిధ్యం, వాతావరణ సమతుల్యత, భవిష్యత్ తరాల జీవనాధారాన్ని కాపాడటం. ఈ అవగాహనతో శాస్త్రీయ ఆధారాలు, స్థానిక భాగస్వామ్యం, న్యాయమైన ఆర్థిక ప్రోత్సాహకాలు కలిసిన పరిష్కారమే ఇప్పుడు అత్యవసరం.

**హెచ్.ప్రతాప్, సీనియర్ పాత్రికేయులు**

## అబద్ధం చెప్పే అద్దం.. అత్యంత అరుదైనది

అద్దం అబద్ధాలు చెప్పడం ఏమిటి! అబద్ధం చెప్పే అద్దం ఏమిటి! ఏమిటీ ఈ పిచ్చి వాగుడు! అద్దం అంటేనే ఉన్నది ఉన్నట్లు చూపేది కదా. మరి అద్దం అబద్ధాలు చెప్పడం ఏమిటి? అని అనుకోవచ్చును. కానీ ఆ అద్దం అత్యంత అరుదైనది, ప్రత్యేకమైనది, దివ్యమైనది. అందుకే అది నిజం చెప్పదు గాక చెప్పదు. అందువల్ల అది అసాధారణమైన ఒక ప్రత్యేక మైన,దివ్యమైన అద్దం. అలాంటి అద్దం మొత్తం భూమిపై ఒకే ఒక్కటిఉన్నది.అది ఈదేశఅధికార "పరివారం" వద్ద మాత్రమే ఉన్నది. తాము అనుకునే, విశ్వసించే అంశాలను ఆఅద్దం ద్వారా లోకానికి చూపుతుంది. వాటిని మాత్రమే విశ్వసించాలి అని ఫత్వాలను జారీ చేస్తుంది. కాదు,కాదు ఆ పదం వారికి నచ్చదు.వారు ద్వేషించే వర్గానికి చెందిన భాషా పదం కదా. అందుకే దాన్ని వాళ్లు శాసనం అని చెబుతారు.అలాంటి అర్థం లేని శాసనాలను చేస్తుంది.వాటిని అందరూ తు.చ.తప్పకుండా పాటించి తీరాలి అంతే. ఆ అద్దాన్ని పూర్తిగా విశ్వసించే జనాల సంఖ్య తక్కువగా వేమీ కాదు. అలా గుడ్డిగా విశ్వసించేవారి సంఖ్య ఇప్పుడు కోట్లలోకి చేరుకుంది. ప్రశ్నించే వారు, ప్రతిదాన్ని తరచి చూసి తార్కికంగా విశ్లేషించిన తరువాత మాత్రమే అర్థం చేసుకునే వారిని పరివారం లెక్కలోకి తీసుకోదు. ప్రస్తుత ఏలిక గారిని గుడ్డిగా ఆరాధించే అంధ గణం వారికి చాలును. ఈ గణం వారికి ఒక సైన్యం లాంటిది. తమ అభిమాన నాయకుడు కాబట్టి ఆ అద్దం ద్వారా చెప్పే మాటలను వారు కాదనరు, తిరస్కరించరు. అద్దంలో చూపే, ప్రతిబింబం కురూపి, అనాకారి అయినా వారికి అత్యంత సుందరంగా దర్శనమిస్తుంది. అంధభక్తులు కదా మరి. ఆ అద్దం చెప్పే అబద్ధాలను కాదన్న వారి తాటను తీసిపారేస్తారు మరి. అదీ వారి ప్రత్యేకత. ఆ అద్దం గతంలో విషయాలను చెప్పింది, చూపింది. "లౌకిక పౌరస్మృతి" అనే కొత్త రాగం కూడా ఆ మధ్య పలికింది. అప్పట్లో ఒకమారు సోషలిజానికి తమ అద్దంలో కొత్త రంగును చూపింది. గాంధీయన్ సోషలిజం అని దానికి పేరు పెట్టుకుంది. ప్రచారం చేసుకుంది. గాంధీని ద్వేషించడం వీరిని మించిన వారు మరొకరు లేరు అనే సంగతి మొత్తం ప్రపంచానికీ తెలుసు కదా. ఈ మాట విని ప్రపంచం తెల్లబోయింది. కానీ దాన్ని వాళ్లు ఖాతరు చేయలేదు. వాళ్ళు అనుకునేది విశ్వసించేది మినహా వాళ్లు దేనినీ లెక్క చేయరు అనే సంగతి అందరికీ తెలుసు. ప్రజాస్వామ్యం,లౌకిక వాదం/సెక్యులరిజం అనే పదమే గిట్టనివారు, అది పూర్తిగా పరాయి భావన అని కొట్టిపారేసి, గట్టిగా వాదించే వారు ఈ మాటను చెప్పడం,అది కూడా సానుకూల అర్థంలో దేశ అధికార కేంద్రమే చెప్పడం/ప్రకటించడం బహు చిత్రమైన సంగతే అవుతుంది కదా. ఇలాంటి కాకరకాయ కబుర్లు గతంలో చాలానే చెప్పింది.వాటిలో మచ్చుకు కొన్ని గుర్తు చేసుకుందాం..యేడాదికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పన. దేశం వెలుపల ఉన్న ఈ దేశ నల్లకుబేరులు అక్రమ సంపదను మొత్తాన్ని వెనక్కి రప్పించి ఒక్కొక్క భారతీయుడి ఖాతాలో రూ.15 లక్షల చొప్పున జమ చేయడం.డాలర్ మారకం ధరను కుదించి వేయడం. ఇప్పుడు అమెరికన్ సెంట్ భారత రూపాయి కి సమాన మారకం విలువకు పతనమై పోయింది. పెట్రో ఉత్పత్తుల ధరలను సగానికి తగ్గించి వేస్తామని వారు దశాబ్దం కింద చేసిన ప్రకటన జనానికి గుర్తు చేయనక్కర లేదు. అందరి జీవితాలు పెట్రోలియం ఉత్పత్తులతో ముడిపడే ఉంటాయి.వాళ్లుచెప్పిన నాటికి ఇప్పటి అన్ని పెట్రో ఉత్పత్తుల ధరలు రెట్టింపు అయిన వాస్తవాన్ని దేశ ప్రజలు అంతా చూస్తున్నారు దేశంలో ఉన్న పేదరికాన్ని పూర్తిగా నిర్మూలిస్తానని నాడు ప్రకటించారు. ఇప్పుడు దేశ జనాభాలో సగానికి పైగా జనాభాకు ఉచిత తిండి గింజల (రేషన్)ను అందించ వలసిన దుస్థితికి చేరుకుంది. పాశ్చాత్య ప్రపంచం ఇప్పటి వరకు చేసిన అన్ని ఆవిష్కరణలకు తమ పూర్వీకుల జ్ఞానమే మూలం అని అనేకమార్లు ప్రకటించారు. కానీ ఇప్పటి వరకూ వాటికి సంబంధించి ఒక్క ఆధారం కూడా చూప లేదు. ఇతరుల నుంచి మేము కొత్తగా నేర్చుకోవలసిన జ్ఞానంఅణువంత కూడా లేదని ఎప్పుడూ అంతులేని అతిశయాన్ని ప్రకటించడం వీరి ప్రత్యేక లక్షణం. ఎందుకంటే...జ్ఞానం అంతా తమ డీ ఎన్ ఏ లోనే నిక్షిప్తమై ఉన్నదని చెబుతారు మా డీఎన్ ఏ లోనే ప్రజాస్వామ్యం ఉంది. ఇలా వీరి అద్దం చెప్పిన అబద్ధాల సంఖ్య కొండవీటి చాంతాడంత ఉంటుంది. అవన్నీ ఇక్కడ వివరించడం సాధ్యం కాదు. ఏలిక గారు తాజాగా ఒక కొత్త పద ప్రయోగం చేశారు.తమ ఆలోచనలను, అభిప్రాయాలను ప్రశ్నించే వారిని, తమ భావజాలం, సిద్ధాంతంతో విభేదించే వారిని "దిమాగీ (మేధో) నక్సల్స్"అని పేర్కొన్నాడు.గతంలో వీరిని అర్బన్ నక్సల్స్ అని పేర్కొనేవారు.ఈ ముద్ర వేసిన, పడిన అనేక మంది ఎలాంటి విచారణలు లేకుండా జైళ్లలోనే ఉన్నారు.అడవుల్లో ఉన్న "హతియారీ నక్సల్స్" అందరినీ ఇప్పటికే నిర్మూలించి వేశామని,ప్రమాదకరమైన దిమాగీ నక్సల్స్ వేట సాగించవలసి ఉందని ఒక పరోక్ష హెచ్చరికను చేశారు.80 వ స్వతంత్ర దినం సందర్భంగా చేసిన ఈ హెచ్చరికకు తాజా నేపథ్యం జంతర్ మంతర్ లో జెన్ జీ(నవ యువతరం) నుంచి ప్రతిఘటన కారణం అనేది నిపుణుల విశ్లేషణ.



గోవర్ధన్ గందె,
9347056621.

## ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రాణాలతో చెలగాటం



ప్రాణం పోతున్న వేళ ఎదురుగా కనిపించే తెల్లకోటు బతుకుపై చివరి ఆశ. దేవుడు కన్నా. వైద్యుడు మిన్న నానుడి .ప్రాణాన్ని నిలబెట్టే హస్తాలు వైద్యుడివేనని సమాజం విశ్వసిస్తుంది. అందుకే వైద్య వృత్తికి అంతటి గౌరవం. కరోనా మహమ్మారి విజృంభించినప్పుడు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి, కుటుంబాలను పక్కనబెట్టి రోగుల కోసం శ్రమించిన వైద్యులు ఆ విశ్వాసానికి ప్రతిరూపంగా నిలిచారు. ఆధునిక వైద్యం సాధించిన అద్భుతాలతో ఆగిపోయిన గుండెకు మళ్లీ స్పందన తెస్తోంది. సంక్లిష్టమైన శస్త్రచికిత్సలతో మృత్యుముఖం నుంచి ఎందరో తిరిగి వస్తున్నారు. మానవాళికి వైద్య విజ్ఞానం కొండంత భరోసానిస్తోంది. అలాంటి పవిత్ర రంగంలో కొందరి ధనదాహం మాత్రం ఆ విశ్వాసానికే చిచ్చుపెడుతోంది.ప్రాణాలు కాపాడాల్సిన చోట లాభాల లెక్కలు మొదలైతే వైద్యం సేవ కాదు... సరుకవుతుంది. రోగి అవసరం కంటే ఆస్పత్రి ఆదాయం ముఖ్యమైతే తెల్లకోటు విలువ మసకబారుతుంది. నల్లగొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మూడేళ్లలో 191 మంది రోగులు మరణించారన్న ఆరోపణలు వెలుగులోకి రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇది కేవలం ఒక ఆస్పత్రికి సంబంధించిన వ్యవహారంగా చూడలేం. ఇంతటి సంఖ్య వెనుక వైద్యపరమైన కారణాలున్నాయా? చికిత్సలో లోపాలున్నాయా? నిర్వహణ వైఫల్యమా? లేక వ్యాపార ప్రయోజనాల కోసం రోగులను అవసరానికి మించి ఐసీయూలో ఉంచారా? అన్నది తేలాలి. బయటపడింది హిమశైల అగ్రభాగమే అయితే, తెర వెనుక వెలుగుచూడని మరణాలెన్ని? సమాధానం లేని కుటుంబాలెన్ని? అన్నది మరింత కలచివేసే ప్రశ్న.అయితే ఆరోపణల ఆధారంగా మొత్తం వైద్య వర్గాన్నీ అనుమానించడం సరికాదు. రాత్రింబవళ్లు శ్రమిస్తూ, ప్రాణాలను నిలబెడుతున్న నిజాయతీపరులైన వైద్యులు ఎందరో ఉన్నారు. కొందరి తప్పిదాలకు వారినంతా బాధ్యులను చేయడం అన్యాయం. అదే సమయంలో కొందరి అక్రమాలను కప్పిపుచ్చడం కూడా అంతే పెద్ద నేరం. అందుకే నల్లగొండ ఘటనపై నిష్పాక్షిక, సమగ్ర విచారణ జరగాలి. నిపుణులతో కూడిన స్వతంత్ర కమిటీ ప్రతి మరణాన్నీ పరిశీలించాలి. రోగి ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి చివరి క్షణం వరకు అందించిన చికిత్స, పరీక్షలు, మందులు, వైద్య నిర్ణయాలు, ఐసీయూ నిర్వహణ, మరణ కారణాలను శాస్త్రీయంగా విశ్లేషించాలి. నిర్లక్ష్యం రుజువైతే బాధ్యులు ఎంతటి వారైనా చట్టం ముందు నిలబడాలి. ఆరోపణలు నిరాధారమైతే వైద్యులకు అనవసర నిందల నుంచి రక్షణ కల్పించాలి.ఈ ఘటనతో ప్రశ్న ముగిసిపోదు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు ఆస్పత్రుల పనితీరుపై నిరంతర నిఘా అవసరం. భారీ భవనాలు, ఆధునిక పరికరాలు, ఆకర్షణీయమైన పేర్లు ఉన్నంత మాత్రాన నాణ్యమైన వైద్యం అందుతున్నట్లు కాదు. అనుమతులకు అనుగుణంగా వసతులున్నాయా? అత్యవసర వేళల్లో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉంటున్నారా? ఐసీయూలను అర్హత కలిగిన వైద్యులు పర్యవేక్షిస్తున్నారా? అగ్నిమాపక భద్రత, పరిశుభ్రత, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలు పాటిస్తున్నారా? ఇవన్నీ క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. తనిఖీలు కాగితాలపై కాకుండా క్షేత్రస్థాయిలో జరగాలి.మరోవైపు వైద్య ఖర్చులు సామాన్యుడి వెన్ను విరుస్తున్నాయి. అవసరం లేని పరీక్షలు, ఖరీదైన మందులు, అనవసరమైన విధానాలు, కమీషన్ల వ్యవస్థతో రోగి కుటుంబం ఆర్థికంగా కుదేలవుతోంది. అనారోగ్యం ఒక వైపు బాధిస్తే, ఆస్పత్రి బిల్లు మరోవైపు భయపెడుతోంది. ఉన్న ఇల్లు అమ్ముకోవడం, పొలం తాకట్టు పెట్టడం, అప్పుల ఊబిలో కూరుకు పోవడం వంటి దుస్థితి ఎన్నో కుటుంబాలను వెంటాడుతోంది. వైద్యం అందుబాటులో ఉండాల్సిన వ్యవస్థలోనే ఆరోగ్య సమస్య ఆర్థిక విపత్తుగా మారడం అత్యంత విషాదకరం.సంఘటన జరిగిన తర్వాత మేల్కొని, కొన్ని రోజులు హడావుడి చేసి మళ్లీ మౌనంలోకి జారుకునే విధానం మారాలి. ప్రతి జిల్లాలో స్వతంత్ర తనిఖీ బృందాలు ఉండాలి. ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి. అనుమానాస్పద మరణాలపై తప్పనిసరి 'డెత్ ఆడిట్' నిర్వహించాలి. ఆస్పత్రులలో మరణాల సంఖ్య మాత్రమే కాదు, వాటి కారణాలు, చికిత్సా విధానం, వైద్య నిర్ణయాలు, నిబంధనల అమలు వంటి అంశాలనూ నిరంతరం సమీక్షించాలి. తప్పు చేసిన వారిపై చర్యలు ఎంత ముఖ్యమో, నిర్దోషులైన వైద్యులపై నిరాధార ఆరోపణలు రాకుండా చూడడమూ అంతే ముఖ్యం.ఇవన్నింటికీ శాశ్వత పరిష్కారం ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ఉంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి ఏరియా, జిల్లా ఆస్పత్రుల వరకు అవసరమైన వైద్యులు, నర్సులు, సాంకేతిక సిబ్బంది, ఆధునిక పరికరాలు, అత్యవసర సేవలు అందుబాటులో ఉండాలి. ప్రభుత్వ ఆస్పత్రిపై నమ్మకం పెరిగితే, తప్పనిసరి పరిస్థితుల్లోనూ ప్రతి ఒక్కరూ ప్రైవేటు ఆస్పత్రి గడప తొక్కాల్సిన అవసరం ఉండదు. నాణ్యమైన వైద్యం డబ్బున్నవారి సౌకర్యం కాదు... ప్రతి పౌరుడి హక్కు.ఆస్పత్రి గడప దాటిన రోగికి చేతిలో ముందుగా కనిపించాల్సింది బిల్లు కాదు... బతుకుపై భరోసా. తెల్లకోటు చూసినప్పుడు భయం కాదు... నమ్మకం కలగాలి. వైద్యశాల ప్రాణాలకు నిలయంగా ఉండాలి తప్ప, నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా మారకూడదు. కొందరి ధనదాహం కారణంగా వైద్య రంగం మొత్తానికి మచ్చ పడకుండా ప్రభుత్వం కఠిన నియంత్రణ, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి. ప్రాణానికి ధర కట్టే పరిస్థితి ఎక్కడైనా ఉంటే అక్కడ చట్టం తన పని చేయాలి. ఎందుకంటే ఆస్పత్రి వ్యాపార కేంద్రం కాదు... మనిషి చివరి ఆశ. ఆ ఆశను కాపాడటం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు... సమాజం పట్ల అత్యున్నత కర్తవ్యం.

**-గడగోజు రవీంద్రాచారి, సీనియర్ జర్నలిస్టు**



## ఎస్ఐ కోచింగ్‌కు కబడ్డీ క్రీడాకారుడికి రూ.42 వేల సాయం

**విశ్వంభర, హైదరాబాదు :** రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడాకారుడు, ఎస్ఐ ఉద్యోగానికి సిద్ధమవుతున్న గందసిరి జ్యోతిబసుకు హైదరాబాదులోని నాతి లక్ష్మి నర్సింహా (ఎన్ఎల్ఎన్) ఫౌండేషన్ రూ.42 వేల ఆర్థిక సహాయాన్ని అందించింది. కోచింగ్, హాస్టల్ ఖర్చుల కోసం ఈ సహాయాన్ని అందజేశారు. సీఐ సైదులు గౌడ్ విద్యార్థికి లక్ష్య సాధనకు అవసరమైన మార్గదర్శకాలు, ప్రోత్సాహాన్ని అందించారు. పేద విద్యార్థులకు ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఎన్ఎల్ఎన్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు నాతి స్వామి మాట్లాడుతూ, విద్యతోనే సామాజికాభివృద్ధి సాధ్యమని, ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహించడం తమ బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.వి. రమణ, రాజేష్, రాఘవేంద్ర , గణేష్ , నాతి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బహుజన్ ముక్తి పార్టీ 6వ మహాసభ ను జయప్రదం చేయాలి: పాత్లావత్ గట్యా నాయక్



**విశ్వంభర, పరిగి,** పట్టణంలో ఆగస్టు30 న జరిగే మహాసభ ను వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎస్సి, ఎస్టి, ఓబీసీ, మైనారిటీ మూలనివాసి బహుజన సోదరులందరు పెద్ద ఎత్తున పాల్గొని సభ ను విజయవంతం చేయాలని బి ఎం పీ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ఘాట్యా నాయక్ మీడియా సమావేశంలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతులకు ఎమ్ ఎస్ పి మినిమమ్ సపోర్ట్ ప్రైజ్ దేశ రైతులకు ఇవ్వాలని, నిరుద్యోగ యూవతకు ఉద్యోగ నోటిఫికేషన్, నిరుద్యోగుల సమస్యల పరిష్కరించాలనే ఏజెండా పై చర్చ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్ నాయక్, దోమ మండల బీఎంపీ పార్టీ అధ్యక్షులు రవీందర్ నాయక్, ఓబీసీ మోర్చా నాయకులు పెద్దలు సత్తయ్య, బీఎంపీ పార్టీ మండల నాయకులు మూడవత్ రవీందర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాఖీ స్పెషల్ ప్రోమో సాంగ్‌ను విడుదల చేసిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**విశ్వంభర, పరిగి:** రాఖీ పండుగ సందర్భంగా పూడూరు మండల పరిధిలోని మిర్జాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు సుభాష్ రూపొందించిన నూతన పాటకు సంబంధించిన ప్రోమో సాంగ్‌ను గాంధీ భవన్‌లో పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి,రామ్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా విడుదల చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పూడూరు మండల పిఎసిఎస్ చైర్మన్ పట్లోళ్ల రఘునాథ్ రెడ్డి, ఆత్మ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ సురేందర్,సీనియర్ నాయకులు శ్రీనివాస్,కంకల్ సర్పంచ్ వీరేశం ,కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్ లో ఘనంగా బోనాల పండుగ



**విశ్వంభర , మహబూబాబాద్:** మున్సిపాలిటీలో ముత్యాలమ్మ తల్లి అమ్మవారిని భక్తులు సందర్శించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, మహబూబాబాద్ మున్సిపాలిటీ ప్రజలు సుఖసంతోషాలతో, సుభిక్షంగా, అభివృద్ధి పథంలో ముందుకు నడవాలని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ దేవాలయంలో మారు బోనం

**విశ్వంభర, గౌలిపుర:** బోనాల నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఈరోజు మారు బోనం, ఒడి బియ్యం అన్నదానం నిర్వహించారు. ఆషాడ మాసం అనంతరం వారం రోజుల తర్వాత ఈ మారు బోనాలు చేస్తామని చైర్మన్ ఘా సోమయ్య తెలిపారు. ఈ కార్యక్రమం చాలా సంవత్సరాల నుంచి కొనసాగుతుందని, ఎ లాంటి అడ్డంకులు లేకుండా నిర్వహించడం ఆ అమ్మవారి కృప అని బస్తీ వాసులంతా సుఖసంతోషాలతో తులతూగాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ అమ్మవారిని వేడుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తివాసులు కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.



## ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలకి సుఖసంతోషాలు కలగాలి

### ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



**విశ్వంభర, సూర్యాపేట:** ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులతో సూర్యాపేట ప్రజలకు సుఖసంతోషాలు కలగాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ లు అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పలు ముత్యాలమ్మ దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25వ వార్డులో కృష్ణ టాకీస్ సమీపంలోని శ్రీ ఊర ముత్యాలమ్మ దేవాలయం, 48వ వార్డులోని కోట మైసమ్మ దేవాలయం, 16వ వార్డులోని బేచిరాగ్ మదారం శ్రీ ముత్యాలమ్మ దేవాలయం, 1వ వార్డులోని ముత్యాలమ్మ తల్లి దేవాలయం, 2వ వార్డులోని ముత్యాలమ్మ తల్లి దేవాలయాలను వారు సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, జిల్లా యువజన అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, మాజీ జెడ్పిటిసి చింతమల్ల రమేష్, అబ్దుల్ రహీం, కౌన్సిలర్లు వెలుగు వెంకన్న, కొండపల్లి దిలీప్ రెడ్డి, మన్నెం అరుణ మల్లేష్, గుణగంటి హేమ సతీష్, కోడి శిరీష శివ, జహీర్, తన్వీర్ హుస్సేన్, చెంచాల మణిలత శ్రీనివాస్, బానోతు సైదులు, శ్రీ దండు మైసమ్మ దేవాలయ చైర్మన్ తంగేళ్ల కర్ణాకర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆలేటి మాణిక్యం, నరేందర్ నాయుడు, చెంచాల నిఖిల్ నాయుడు, 25వ వార్డు శ్రీ ఊర ముత్యాలమ్మ దేవాలయ అధ్యక్షుడు సారగండ్ల రాములు, కమిటీ సభ్యులు, 48వ వార్డు కోట మైసమ్మ దేవాలయ చైర్మన్ ఇండ్ల వీరయ్య, కమిటీ సభ్యులు ఈర్ల వాసు, ఎలగందుల లక్ష్మీనారాయణ, కోల నిరంజన్, మారిపెద్ది లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం




**విశ్వంభర, మహాదేవపూర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమం ఆగస్టు 17, 2026 సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మహాదేవపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి తమ సమస్యల పరిష్కారం కోసం హాజరయ్యే ప్రజలు ముందుగా తమ పేరు, గ్రామం, ఇతర వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అనంతరం సంబంధిత సమస్యపై దరఖాస్తుతో నేరుగా అధికారులను కలిసి తమ వినతులను సమర్పించవచ్చని తెలిపారు. ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించడంతో పాటు, తాగునీటి వంటి...మౌలిక సదుపాయాలను కూడా కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు అందరూ అందుబాటులో ఉంటారని తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామపంచాయతీల ప్రజలు తమ సమస్యలను దరఖాస్తుల ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఎంపీడీవో కోరారు. ప్రతి సోమవారం మహాదేవపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

## మహిళా ఉపాధ్యాయులే భావి భారత నిర్మాతలు




**విశ్వంభర, బాగ్ లింగంపల్లి:** మహిళా ఉపాధ్యాయులు రాజ్యాంగం, రాజకీయాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జి. రాధారాణి అన్నారు. టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సీహెచ్ దుర్గా భవాని అధ్యక్షతన ఆదివారం హైదరాబాదు బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మహిళా ఉపాధ్యాయుల సదస్సులో ఆమె మాట్లాడారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులపై ప్రతి మహిళ అవగాహన పెంచుకోవడంతో పాటు వాటిని విద్యార్థులకు బోధించాలని సూచించారు. మహిళల అభివృద్ధికి సామాజిక, సాంస్కృతిక అడ్డంకులు ఇప్పటికీ ప్రధాన అవరోధాలుగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు మరియం ధావలే మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో కార్పొరేటీకరణ వేగంగా పెరుగుతోందని విమర్శించారు. జాతీయ విద్యా విధానం ప్రభావంతో బాలికల విద్యకు నష్టం జరుగుతోందని, మహిళల హక్కుల పరిరక్షణకు సమష్టి కృషి అవసరమని పేర్కొన్నారు. ఎస్టీఎఫ్ఐ కార్యదర్శి ఎన్. అరుణకుమారి మాట్లాడుతూ మహిళా ఉపాధ్యాయులు శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. మహిళల భాగస్వామ్యం లేకుండా ఏ ఉద్యమమూ విజయవంతం కాదని ఎస్టీఎఫ్ఐ జాతీయ నాయకురాలు మోతుకూరి సంయుక్త అన్నారు. ఈ కార్యక్రమంలో చావ రవి, ఎ. వెంకట్, వి. శాంతకుమారి, వై. జ్ఞానమంజరి, విశాలి, కె. రవికుమార్, ఎస్. రవిప్రసాద్, గౌడు వెంకటప్ప, సింహాచలం, ఆర్. శారద, జి. నాగమణి, అరుణమ్మతో పాటు వివిధ జిల్లాల మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : వి. హనుమంతరావు



**విశ్వంభర, అంబర్‌పేట :** ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు అన్నారు. ఇటువంటి శిబిరాలు సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. హైదరాబాదు బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని భరత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో శంభుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో, మెడికోవర్ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన మెగా ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో కంటి, గుండె, రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలతో పాటు పలు వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. వైద్యులు ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ అవసరమైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ, గత పదేళ్లుగా ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరోనా సమయంలో నిత్యావసర సరుకుల పంపిణీతో పాటు వైద్య, విద్యా సహాయం అందించినట్లు చెప్పారు. భవిష్యత్తులో సేవా కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మోతా రోహిత్, ఆర్. లక్ష్మణ్ యాదవ్, పంజాల ధనుంజయ్ గౌడ్, వై. శంకర్ గౌడ్, రాంపల్లి జైహింద్, గడ్డం శ్రీధర్ గౌడ్, రావుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సామ జైపాల్ రెడ్డికి ప్రతిష్ఠాత్మక జాతీయ సమైక్యత అవార్డు




**విశ్వంభర, షాబాద్:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గం, షాబాద్ మండలం ఎర్రోనిగూడ గ్రామానికి చెందిన సామ జైపాల్ రెడ్డి కి ప్రతిష్ఠాత్మక "జాతీయ సమైక్యత అవార్డు" ప్రదానం చేశారు. సమాజ సేవ, ప్రజా సేవా కార్యక్రమాల్లో విశేషంగా సేవలందిస్తున్న జైపాల్ రెడ్డిని జాతీయ స్థాయిలో గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేశారు. ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు, వందే భారత్ మూవీ డైరెక్టర్ కళారత్న మల్లం రమేష్, జాతీయ అవార్డు గ్రహీత సుద్దాల అశోక్ తేజ, వంశీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు శిరోమణి డాక్టర్ వంశీ రామరాజు, ప్రముఖ సినీ నటుడు పోలాప్రగడ జనార్ధన్ రావు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ తదితర ప్రముఖుల చేతుల మీదుగా జైపాల్ రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. ప్రజా సేవలో చురుకుగా పాల్గొంటూ సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న సామ జైపాల్ రెడ్డికి ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డు దక్కడం పట్ల ఎర్రోనిగూడ గ్రామస్థులు, నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో లభించిన ఈ గౌరవం గ్రామానికి, చేవెళ్ల నియోజకవర్గానికి గర్వకారణమని పలువురు అభినందనలు తెలిపారు.



## విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేసిన డాక్టర్ సుధీర్ కుమార్

**విశ్వంభర, సూర్యాపేట:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సూర్యాపేట లోని మన అమ్మ హాస్పిటల్ అధినేత డా. సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రూ.25,000 విలువైన స్కూల్ బ్యాగులు, పెన్నులు, కంపాస్ బాక్సులు పంపిణీ చేయడం జరిగింది. విద్యార్థుల విద్యాభివృద్ధికి తనవంతు సహాయాన్ని అందిస్తూ, పేద మరియు ప్రతిభావంతులైన పిల్లలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ బాల్టు శోభన్ బాబు, జి. ఆంజనేయులు, సర్పంచ్ మొక్క వెంకటేశ్వర్లు,పాల్గొని విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు అందించే ప్రతి చిన్న సహాయం... వారి భవిష్యత్తుకు వేసే ఒక గొప్ప అడుగు అని చెప్పారు.

## అటల్ జీకి కేసముద్రంలో బీజేపీ ఘన నివాళి




**విశ్వంభర, కేసముద్రం:** భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి 8వ వర్ధంతిని కేసముద్రం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు ఉప్పునూతుల రమేష్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే సెంటర్‌లో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ దేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటిన మహోన్నత నాయకుడు వాజ్‌పేయి అని కొనియాడారు. గ్రామీణ రహదారుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనతో పాటు పోఖ్రాన్ అణు పరీక్షల ద్వారా దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేసిన ఘనత ఆయనదేనన్నారు. ఆయన ఆదర్శాలు బీజేపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పొదిల నరసింహారెడ్డి, మున్సిపల్ కన్వీనర్ బోగోజు నాగేశ్వరచారి, పలువురు మండల నాయకులు, మోర్చా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని అటల్ జీకి శ్రద్ధాంజలి ఘటించారు.

## టి ఎస్ సి ఏ డి అఖిల భారత క్రికెట్ పోటీలు




**విశ్వంభర, బాగ్ లింగంపల్లి:** తెలంగాణ స్టేట్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ద డే (టి ఎస్ సి ఏ డి) ఆధ్వర్యంలో తొలి పురుషుల ప్రీమియర్ క్రికెట్ లీగ్ అఖిల భారత స్థాయి ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు టి ఎస్ సి ఏ డి అధ్యక్షుడు తెడ్ల చిరంజీవి, వైస్ ప్రెసిడెంట్ వీకే జయప్రకాశ్, జనరల్ సెక్రటరీ ప్రసాద్ తెలిపారు. హైదరాబాదు బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 1 వరకు క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. క్రికెట్ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడంతో పాటు జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పించడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, వెంకటేష్, రఘు, సయ్యద్ అహ్మద్ ఉద్దీన్, ఇమ్రాన్ అలీ ఖాన్ పాల్గొన్నారు.

## ఘనంగా గోదాదేవి కళ్యాణ మహోత్సవం



**విశ్వంభర, ఘట్కేసర్ :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎదులాబాద్ శ్రీ గోదా రంగనాయక స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం గోదాదేవి కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారు, గోదాదేవి అమ్మవార్ల కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి భక్తులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, హాజరై గోదాదేవి కళ్యాణాన్ని తిలకించారు. మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి విచ్చేసి స్వామివారికి, పట్టు వస్త్రాలు సమర్పించారు బీఆర్ఎస్ నాయకుడు, మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ చామకూర భద్రారెడ్డి దంపతులు కూడా కళ్యాణ మహోత్సవానికి హాజరై వేడుకలను వీక్షించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు పాల్గొని స్వామివారి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవాన్ని నిర్వహించనున్నారు ఈ రథోత్సవానికి ఘట్కేసర్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు



## ఇనుగుర్తి నూతన ఎస్సై ని కలిసిన బిజెపి నాయకులు..

విశ్వంభర, ఇనుగుర్తి: ఇనుగుర్తి మండలానికి నూతన ఎస్సైగా విధుల్లో చేరిన పి.నరేష్ ను బిజెపి మండల శాఖ అధ్యక్షులు దుంపల సందీప్, జిల్లా యువ నేత గుగులోతు నవీన్ నాయక్ ల నేతృత్వంలో బిజెపి మండల నేతల తో పాటు వివిధ గ్రామాల నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై కి పుష్పగుచ్చాలు అందజేసి, శాలువాలతో సత్కరించారు. శుభాభినందన శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఎస్సై ఆధ్వర్యంలో మండలంలో మరింత శాంతియుత వాతావరణం నెలకొని, నేర రహిత మండలం గా కొనసాగాలని నాయకులు ఆకాంక్షించారు. తమ పార్టీ తరపున పోలీసు శాఖకు పూర్తిగా సహకరిస్తామని తెలిపారు.కార్యక్రమంలో నాయకులు బైరు పటేల్ రవి గౌడ్,డా.వెంకటేశ్వర్లు,కాల్సాని ప్రభాకర్ రెడ్డి,గాయపు సురేందర్ రెడ్డి,మునిగంటి యాకయ్య,జల్లె శ్రీను, మహంకాళి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## రజకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: అజయ్‌కుమార్



విశ్వంభర, బాగ్ లింగంపల్లి: రజక వృత్తిదారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని రజక కార్పొరేషన్ చైర్మన్ దాసరాజుల అజయ్‌కుమార్ అన్నారు. హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎదునూరి మదర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రజక వృత్తిదారులకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం, ప్రతి జిల్లాలో ఆధునిక దోబీఘాట్ల నిర్మాణం, ఉచిత విద్యుత్ బకాయిల చెల్లింపు, రజకులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో ప్రవేశపెట్టిన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి సహకరిస్తామని అజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బంగారు బాబు, ఫైళ్ల ఆశయ్య, చౌదరి శ్రీనివాస్, అశోక్‌కుమార్, బాలాపూర్ బాలరాజు, అన్నార వెంకటేశ్వర్లు, పాయిరాల రాములు, మరియాల గోపాల్, పెద్దాపురం భాస్కర్, సి. వెంకటస్వామి, అవనగంటి స్వామి, లక్ష్మీనారాయణ, యాదయ్య, జంగయ్య, యాదమ్మ, భాగ్య, బాత్‌రాజు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో ఘనంగా శ్రావణమాస బోనాల వేడుకలు



విశ్వంభర, బాగ్ లింగంపల్లి: నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం శ్రావణమాస బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలను తలపై మోసుకుంటూ వాయిద్యాల నడుమ అమ్మవారి ఆలయాలకు తరలివచ్చారు. హైదరాబాదులోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్‌లోని తెల్ల ఉప్పలమ్మ ఆలయంలో నిర్వహించిన బోనాల వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పోతురాజుల విన్యాసాల మధ్య మహిళలు బోనాలతో ర్యాలీగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు. వేడుకలకు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య పార్క్ వాకర్స్, తెల్ల ఉప్పలమ్మ ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

విశ్వంభర, రామన్నపేట: నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, జనంపల్లి గ్రామానికి చెందిన సింగం మల్లేశం కుమారుడి వివాహానికి నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



# 18న సర్వాయి పాపన్న పుట్టిన గడ్డపై సభను జయప్రదం చేయండి

## కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబు పిలుపు



విశ్వంభర, మోతే: మోతే మండలం రాఘవపురం గ్రామంలో బహుజన యుద్ధ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబు మాట్లాడుతూ సర్వాయి పాపన్న 376వ జయంతిని ఈనెల 18న ఆయన పుట్టిన గడ్డ జనగామ జిల్లా ఖిలాషాపురంలో ఘనంగా నిర్వహించి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మానుకోట నుంచి ప్రారంభమైన గీతన్నల చైతన్య బస్సు యాత్ర 18న జరిగే సభ అనంతరం ట్యాంక్‌బండ్ వరకు కొనసాగుతుందని తెలిపారు. మొఘల్ చక్రవర్తులు, భూస్వాములు, దొరలపై పోరాడిన సర్వాయి పాపన్న గొప్ప ప్రజా యోధుడని, ఆయన త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సభ్యురాలు బోడపట్ల జయమ్మ, మండల అధ్యక్షుడు గుణగంటి రంగయ్య గౌడ్, హక్కుజనుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు కారింగుల శ్రీనివాస్ గౌడ్, పలువురు గీత కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పి హెచ్ టి మార్కెట్ ను ప్రారంభించిన నటి శ్రీలీల




విశ్వంభర, ఉప్పల్: పద్మశాలి హ్యాండ్లూమ్ టెక్స్టైల్స్ , జ్యూలరీ గ్రాండ్ షాపింగ్ మాల్ ను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన నటి శ్రీలీల. వరంగల్ హైవే ఉప్పల్ బస్టాండ్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఈ పి హెచ్ టీ 210వ షాపును ఉప్పల్లో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పీహెచ్టీ మార్కెట్ మేనేజింగ్ పార్ట్నర్స్ గడ్డం వెంకటేష్, బుజ్జసత్యం, వనం నరసింహ, ధనుంజయులు మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ వస్త్ర ప్రపంచంలో అనేక రకాలైన చేనేత వస్త్రాలు, చేనేత ఉత్పత్తులు, ఫ్యాషన్ జ్యువెలరీ, తదితర విభాగాలకు ఒకే చోట విస్తృతమైన షాపింగ్ అవకాశాలు ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఉత్పత్తిదారుల నుంచి వేరుగా వినియోగదారులకు అందే విధంగా ఈ పీ హెచ్ టీ మార్కెట్ అభివృద్ధి చేశామని మేనేజింగ్ పార్ట్నర్స్ తెలిపారు. మధ్యవర్తుల వ్యవస్థలు తగ్గించడం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులను తక్కువ ధరలకు వినియోగదారులకు అందించడం వారి ప్రధాన లక్షణాలు పేర్కొన్నారు. మా పీ హెచ్ టీమార్కెట్లో పట్టు, ఫ్యాన్సీ, కాటన్, హ్యాండ్లూమ్స్, కాథీ, షూటింగ్,సెటింగ్స్, ఉమెన్స్,మెన్స్ వేర్, కిడ్స్ వేర్,మగ్గం వర్క్ ఫ్యాన్సీ జ్యువెలరీ, బంగారు ఆభరణాలు,తదితర విభాగాలకు సంబంధించిన షాపులు అన్ని ఒకే చోట ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ పార్ట్నర్స్, వ్యాపారవేత్తలు, వస్త రంగ ప్రతినిధులు, భాగస్వాములు, షాపు యజమానులు, వినియోగదారులు, అభిమానులు మరియు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# గౌరవెల్లిపై కాంగ్రెస్, బీఆర్ఎస్ విఫలం: పచ్చిమట్ల రవీందర్‌గౌడ్

## రైతులకు నీళ్లివ్వకుండా సంబరాలెందుకు..? ముందు ఎన్‌జీటీ కేసు పరిష్కరించాలి




విశ్వంభర, హుస్నాబాద్: గౌరవెల్లి ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని బీఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ ఆరోపించారు. ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమై 13 ఏండ్లు గడుస్తున్నా మెట్ట ప్రాంత రైతులకు సాగునీరు అందించలేకపోయారని ఆయన పత్రికా ప్రకటనలో విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టు సామర్థ్యాన్ని ఒక టీఎంసీ నుంచి 8.4 టీఎంసీలకు పెంచే సమయంలో అవసరమైన అనుమతులు, సమగ్ర డీపీఆర్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. సామర్థ్య పెంపుతో అటవీ ప్రాంతం, వన్యప్రాణుల ఆవాసాలకు నష్టం జరుగుతుందంటూ రైతులు ఎన్‌జీటీని ఆశ్రయించడంతో ప్రాజెక్టుపై కేసు కొనసాగుతోందన్నారు. గత ఎన్నికల సమయంలో రాజకీయ లబ్ధి కోసం ప్రాజెక్టులో ట్రయల్‌రన్ నిర్వహించి సంబరాలు చేసుకున్నారని, ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు రూ.450 కోట్లు తీసుకొచ్చామని చెబుతూ స్వీట్లు పంచుకోవడం ఏమిటని ప్రశ్నించారు. రైతులకు నీరు అందకముందే ఇరు పార్టీలు సంబరాలకు పరిమితం కావడం సరికాదన్నారు. ముందుగా రైతులతో చర్చించి ఎన్‌జీటీ కేసు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, చట్టపరమైన సమస్యలను తొలగించి కాలువల నిర్మాణం, భూసేకరణ పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పరస్పర విమర్శలకు పరిమితం కాకుండా రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు.

# కుల గణనపై కేంద్ర నిర్ణయం స్వాగతించదగ్గది: మురళీకృష్ణ



విశ్వంభర, నల్లకుంట : దేశవ్యాప్తంగా జనగణనలో కుల గణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు కె.పి. మురళీకృష్ణ అన్నారు. హైదరాబాదు నల్లకుంట డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్ర సామాజిక న్యాయంపై దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిందని తెలిపారు. జనాభా ప్రాతిపదికన ప్రతి వర్గానికి సమాన ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో కుల గణన అంశాన్ని కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకొచ్చిందన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం సమగ్ర కుల గణన చేపట్టి సామాజిక న్యాయానికి బాటలు వేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని గుర్తు చేశారు. కుల గణన ద్వారా వివిధ వర్గాల జనాభా, సామాజిక, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన సమాచారం లభిస్తుందని, ఆ గణాంకాల ఆధారంగా సంక్షేమ పథకాలు, విద్యా, ఉద్యోగ అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయవచ్చని మురళీకృష్ణ అన్నారు.

# గాంధీనగర్ కల్వర్టు పనులను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



విశ్వంభర , హుస్నాబాద్ : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం గాంధీనగర్ గ్రామం నుంచి అక్కన్నపేట మండల కేంద్రానికి వెళ్లే మార్గంలో వర్షాకాలంలో మత్తడి పడటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ సమస్యను పరిష్కరించేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో రూ.25 లక్షల నిధులు మంజూరయ్యాయి. నిధులతో చేపట్టిన కల్వర్టు నిర్మాణ పనులను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. నిర్మాణం పూర్తయితే వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న రాకపోకల ఇబ్బందులు తొలగిపోనున్నాయని తెలిపారు. పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని సూచించారు.సమస్యను పరిష్కరించేందుకు రూ.25 లక్షలు మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గ్రామ సర్పంచ్ పోలు సంపత్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరిశీలనలో గ్రామ ఉపసర్పంచ్ పోషవేణి శ్రీశైలం, హుస్నాబాద్ ఏఎంసీ వైస్ చైర్మన్ బంక చందు, హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెన్నరాజు, ఉపసర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని రాజ్‌కుమార్ గౌడ్, ఆల్ ఇండియా బంజారా నాయకులు భూక్య రమేష్ నాయక్ తదితరులున్నారు.



# చిన్ననాగారంలో ఘనంగా బోనాల జాతర

విశ్వంభర, ఇనుగుర్తి: మండలంలోని చిన్ననాగరంలో శ్రావణమాసం, ఆశ్లేషకార్తె లో ఊర ముత్యాలమ్మ తల్లికి అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవోపేతంగా బోనాలు పండుగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారి బోనాల పండుగకు గ్రామస్తులు బంధువులను,ఆడబిడ్డలను, మిత్రులు శ్రేయోభిలాషులను ఆహ్వానించడంతో చిన్ననాగారం సందడిగా మారింది. గ్రామపంచాయతీ పండుగకు డిజె డప్పు చప్పులను ఏర్పాటు చేసింది.శ మహిళలు బోనాలను ఎత్తుకొని చెరువు గట్టున ఉన్న ఊర ముత్యాలమ్మ ఆలయానికి తరలి వెళ్లారు. శ్రీ ముత్యాలమ్మ తల్లియే నమః అంటూ దేవాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవార్లకు చీర శారలతోపాటు బోన నైవేద్యం సమర్పించారు. పాడిపంటలతో అష్ట,ఐశ్వర్య, ఆయురా రోగ్యాలతో ప్రజలు చల్లగా ఉండాలని ముత్యాలమ్మ ను వేడుకున్నారు.అంతకుమునుపు భక్తులైన గ్రామస్తులు పొట్టేళ ్ల,కోళ్ల తో మొక్కులు చెల్లించుకున్నారు.



## పూర ముత్యాలమ్మ తల్లిని దర్శించుకున్న టీపీసీసీ వైస్ చైర్మన్

విశ్వంభర, సూర్యాపేట: జిల్లాలో బోనాల పండగ సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని శ్రీ పూర ముత్యాలమ్మ తల్లి ఆలయాన్ని టీపీసీసీ వైస్ చైర్మన్, ఓబీసీ డిపార్ట్‌మెంట్ నాయకుడు తండు శ్రీనివాస్ యాదవ్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు. ఆయన వెంట ఆలయ కమిటీ సభ్యులు సారగండ శ్రీనివాస్ (ఎస్‌ఎస్), రామాచారి, గోంద్ర సైదులు యాదవ్, మున్సిపాలిటీ సిబ్బంది ఖాజా కమరుద్దీన్, గుంటి సాయి తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## ముత్యాలమ్మ ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి



విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, ఇంద్రపాలనగరం గ్రామంలో నిర్వహించిన శ్రీ ఇంద్రపాల ముత్యాలమ్మ తల్లి ఊరేగింపు కార్యక్రమం సందర్భంగా నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో నిర్మించిన నూతన వసతి గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు బందెల రాములు, పోషబోయిన మల్లేశం, ఇంద్రపాలనగరం, బోగారం గ్రామాల సర్పంచులు గర్దాస్ విక్రమ్, కూనూరు సాయికుమార్ గౌడ్, జిల్లా నాయకులు బద్దుల రమేష్, మందడి సాగర్ రెడ్డి, ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, నాయకులు రవ్వ నరసింహ, మంటి లింగస్వామి, వరికుప్పల స్వామి, చిన్నపాక రమేష్, రాస వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొనడం జరిగింది.

## తీగల వాగు బ్రిడ్జి వద్ద రోడ్డుకు మరమ్మతులు




విశ్వంభర, శంకర్‌పల్లి: మున్సిపల్ పరిధిలోని తీగల వాగు వంతెన వద్ద రహదారికి అధికారులు మరమ్మత్తులు చేపట్టారు. గతంలో రహదారి పరిస్థితిపై ప్రచురించిన వార్తా కథనాలకు స్పందించిన అధికారులు ఈ పనులు చేపట్టడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. అయితే, రాత్రి వేళల్లో మట్టి వేసిన ప్రాంతంలో రోడ్డు వంపు ఎక్కువగా ఉండటంతో అది సరిగా కనిపించక వాహనదారులు జారిపడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో వీధి దీపాలు ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించడంతో పాటు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు.

# ముత్యాలమ్మ తల్లికి ఘనంగా బోనాల జాతర

విశ్వంభర, ఇనుగుర్తి: మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలో శ్రావణమాసం ఆశ్లేషకార్తె లో ఏటా నిర్వహించే బోనాల పండుగను ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. ఇనుగుర్తి పట్టణ సెంటర్, ఎస్సీ కాలనీ,మాల కాలనీ లలోని లోక పావని శ్రీ ముత్యాలమ్మ తల్లి కి అత్యంత భక్తి శ్రద్ధలతో బోనాల జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు.అమ్మవారికి ప్రముఖ వేద పండితులు తిరునహరి కృష్ణమాచార్యులు వేదమంత్రోచ్ఛ రణల మధ్య నిర్వహించిన జగజ్జనని శ్రీ ముత్యాలమ్మ తల్లి అర్చనలో వద్దిరాజు పెద్ద వెంకన్న ప్రభృతులు పాల్గొన్నారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారి జాతరకు గ్రామస్తులు బంధువులను,ఆడబిడ్డలను, మిత్రులు శ్రేయోభిలాషులను ఆహ్వానించడంతో ఇనుగుర్తి పట్టణమంతా సందడిగా మారింది. పోతరాజులు, శివశక్తుల పూనకాల మధ్య డీజే డప్పు చప్పుళ్ల హోరులో మహిళలు బోనాలను ఎత్తుకొని సామూహికంగా ఆలయాలకు తరలి వెళ్లారు. శ్రీ ముత్యాలమ్మ తల్లియే నమః అంటూ దేవాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవార్లకు బోనం నైవేద్యం సమర్పించారు. పాడిపంటలతో అష్ట,ఐశ్వర్య, ఆయురా రోగ్యాలతో ప్రజలు చల్లగా ఉండాలని ముత్యాలమ్మ ను వేడుకున్నారు.అంతకుమునుపు భక్తులైన గ్రామస్తులు పొట్టేళ్లు,కోళ్ల తో మొక్కులు చెల్లించుకున్నారు. ప్రశాంత వాతావరణంలో బోనాల జాతర నిర్వహించుకోవడానికి స్థానిక ఎస్సై పి.నరేష్ పోలీస్ బందోబస్తుతో పరిశీలించారు.





## ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పాదదర్శకంగా అమలుపరుస్తున్నాం

### నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు . ఆదివారం మానూర్ మండల పరిధిలోని దోసపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారురాలు అపరంజి నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ మహోత్సవానికి నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన గృహాన్ని ప్రారంభించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గూడు కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. పేదల సంక్షేమం, గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిరాదర్ దత్తు దోసపల్లి గ్రామ సర్పంచ్,స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## విశ్వహిందూ పరిషత్ పెద్ద శంకరంపేట ప్రఖండ అధ్యక్షుడిగా దాదిగారి సురేష్



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** విశ్వ హిందూ పరిషత్ పెద్ద శంకరంపేట ప్రఖండ అధ్యక్షులుగా దాదిగారి సురేష్ ను నియమించారు. జిల్లా కేంద్రమైన మెదక్ లో నిర్వహించిన విశ్వహిందూ పరిషత్ జిల్లా స్థాయి సమావేశంలో పెద్ద శంకరంపేట ప్రఖండ ( పెద్ద శంకరంపేట అల్లాదుర్గం రేగోడు మండలాలు కలిపి) నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా దాదిగారి సురేష్. ఉపాధ్యక్షులుగా బి వంశీకృష్ణ. కోటగిరి రమేష్. సెక్రటరీగా మాలే ప్రవీణ్.. జెంట్ సెక్రటరీ విలువ భవాని ప్రసాద్ పటేల్ రమేష్ పురం కిషోర్ విష్ణు చారి టి విజయ్. కందుకూరి శ్రీకాంత్ నాందేడ్ శివ నాందేడ్ సుచిత్ నాందేడ్ దుర్గయ్యలను నియమించారు.

## పెద్ద శంకరం పేట్ గ్రామ పంచాయతీ అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి




**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** పెద్దశంకరం పేట మేజర్ గ్రామ పంచాయతీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని సిపిఎం అల్లదుర్గం ఏరియా కమిటీ కే బాలయ్య డిమాండ్ చేశారు . పేట గ్రామ పంచాయతీలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని స్వయంగా గ్రామ సర్పంచ్ బహిరంగంగా ప్రకటించడం శోచనీయమన్నారు గ్రామ పంచాయతీ కార్యదర్శి అవినీతికి పాల్పడుతున్నారని సర్పంచ్ బహిరంగంగ చెప్పిన జిల్లా అధికారులు ఇప్పటి వరకు ఎందుకు స్పందించడం లేదని పేర్కొన్నారు. పంచాయతీ తీర్మానం లేకుండా అక్రమ కట్టడలకు అనుమతులు ఇవ్వడం, ఇంటి నెంబర్లు కేటాయించడం అంటే ఎన్నికైనా పాలక వర్గాన్ని దిక్కరించడమే అవుతుందని పంచాయతీ కార్యదర్శులపై జిల్లా అధికారుల పర్యావరణ లేకపోవడమే ఇలాంటి ఘటనలకు కారణం అవుతుందని అన్నారు.పంచాయతీ కార్యదర్శులు స్థానికంగానే నివాసం ఉండాలనే నిబంధనలు ఉన్నప్పటికీ జిల్లాలో ఏ ఒక్క పంచాయతీ కార్యదర్శి ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయడం లేదని ఆరోపించారు.గ్రామ సర్పంచ్ చేసిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవలను బయట పెట్టాలని, అవినీతి జరిగితే పంచాయతీ కార్యదర్శిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తుందని పేర్కొన్నారు ఈ సమావేశంలో సిపిఎం జిల్లా. కార్యవర్గ సభ్యులుకె భాగయ్య తదితరులు ఉన్నారు.

## వలిగొండ లో డ్రంక్ అండ్ డ్రైవ్

**విశ్వంభర, వలిగొండ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించిన వలిగొండ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి. ఈ సందర్భగ్న ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడిపి పోలీసులకు పట్టుబడిన వంటి ఇద్దరు వ్యక్తుల మీద కేసులు నమోదు చేసి రెండు మోటార్ సైకిల్ లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని చెప్పారు. మద్యం తాగి ఎవరైనా వాహనాలు నడిపి తద్వారా పోలీసులకు పట్టుబడితే పదివేల రూపాయలు జరిమానా లేదా జైలు శిక్ష విధిస్తారని, కాబట్టి ప్రజలందరూ కూడా చట్టానికి లోబడి నడుచుకుంటూ ఎవరు కూడా మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు.



## కాపాడే రక్షకులే భక్షకులై కబ్జాలకు యత్నం?

### 1000 గజాల గుడి, పార్కు స్థలంపై కబ్జా ఆరోపణలు తిరుమల మేడోస్, సాయికృష్ణ లేఅవుట్‌లో వివాదం




**విశ్వంభర, బోడుప్పల్:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని తిరుమల మేడోస్, సాయికృష్ణ లేఅవుట్‌లో గుడి, పార్కు కోసం కేటాయించిన సుమారు వెయ్యి గజాల స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ కాలనీవాసులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ రాపోలు రాములు ఆదివారం వివాదాస్పద స్థలాన్ని పరిశీలించి కాలనీవాసుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏళ్లుగా స్థానికులు పూజలు నిర్వహిస్తున్న మైసమ్మ గుడి స్థలంతో పాటు పార్కు కోసం కేటాయించిన భూమిపై క్రయవిక్రయాలు జరిగినట్లు ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. లేఅవుట్ పత్రాల్లో గుడి, పార్కు స్థలాలుగా స్పష్టంగా ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయనే అంశంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కాలనీవాసుల ఫిర్యాదుతో సంబంధిత అధికారుల వద్ద కేసు నమోదైనట్లు సమాచారం. అయితే విక్రేతలతో పాటు కొనుగోలుదారుల పాత్రపైనా సమగ్ర విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు. సుమారు 300 గజాల స్థలానికి సంబంధించిన లావాదేవీలను రద్దు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, మిగిలిన స్థలంపై కూడా పూర్తి స్థాయిలో విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో రాజకీయ ప్రమేయంపై వస్తున్న ఆరోపణల నిజానిజాలను కూడా దర్యాప్తులో తేల్చాలని కోరారు.

## వివాహ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం బిచ్కుంద మండల కేంద్రంలో జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంత్ రావు కుమార్తె వివాహ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి , తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ , నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## బహుజన బతుకమ్మ 2026 సమాలోచన సమావేశం విజయవంతం




**విశ్వంభర, హైదరాబాద్:** బహుజన బతుకమ్మ కమిటీ తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో బహుజన బతుకమ్మ 2026 సమాలోచన సమావేశం విజయవంతంగా నిర్వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ లక్ష్మీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బహుజన బతుకమ్మ ప్రస్థానం, ప్రజా సమస్యలపై ఉద్యమాల గురించి చర్చించారు.గత 15 సంవత్సరాలుగా బహుజన బతుకమ్మ ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్తూ, వాటిపై చర్చ జరిగేలా కృషి చేస్తున్నామని ప్రొఫెసర్ లక్ష్మీ తెలిపారు. పండుగలు కేవలం కొన్ని వర్గాలకు పరిమితం కాకుండా అందరూ కలిసి జరుపుకునేవిగా ఉండాలని అన్నారు. అరుణోదయ విమలక్క మాట్లాడుతూ బహుజన బతుకమ్మను కేవలం పండుగగా కాకుండా ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన, పర్యావరణ పరిరక్షణ, నల్లమల్ల అడవులు, యురేనియం తవ్వకాల వ్యతిరేక పోరాటం, ప్రకృతి వ్యవసాయం వంటి అనేక ప్రజా సమస్యలపై బహుజన బతుకమ్మ వేదికగా ఉద్యమాలు సాగించామని పేర్కొన్నారు. ప్రస్తుత తరం యువత ఆలోచనలను కూడా కలుపుకొని సమకాలీన సమస్యలపై ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ప్రముఖ న్యాయవాది కట్ట భగవంతరెడ్డి, రచయిత్రి కరుణ, రైతు కూలీ సంఘం నాయకుడు నాగిరెడ్డి, మన్నారం నాగరాజు, అరుణోదయ పోతుల రమేష్, టీపీటీఎఫ్ ప్రకాష్, కుల నిర్మూలన సంఘం అధ్యక్షుడు వహీద్, ఏఐఎఫ్‌టీయూ మల్లేశం, తదితర ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గిగ్ కార్మికుల సంక్షేమ బోర్డు, ఎలక్ట్రిక్ ఆటోలకు సబ్సిడీ ప్రకటించడం పై ప్రభుత్వానికి ఐ ఎన్ టి యూ సీ ధన్యవాదాలు




**విశ్వంభర, హైదరాబాద్:** గిగ్ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు ప్రకటించడం, పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ, ఎల్‌పీజీ ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చుకునేందుకు సబ్సిడీ అందించే నిర్ణయంపై ఐ ఎన్ టి యూ సీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఆదివారం నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలోఐ ఎన్ టి యూ సీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బిజ్జుల రామకృష్ణారెడ్డి, సీనియర్ జనరల్ సెక్రటరీ ఉప్పల శ్రవణ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, రీఫిట్‌మెంట్ ఎలక్ట్రిక్ ఆటోలకు సంబంధించిన జీఓ 263 ద్వారా సుమారు రూ.200 కోట్ల నిధులను కేటాయిస్తూ, జీహెచ్‌ఎంసీ పరిధిలోని అర్హులైన ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చుకునేందుకు ఒక్కో ఆటోకు రూ.1.50 లక్షల వరకు సబ్సిడీ అందించే అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ఈ మేరకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జీఓ విడుదల చేయడాన్ని స్వాగతించారు. అయితే ఆర్టీసీ ఆధ్వర్యంలో ఎలక్ట్రిక్ ఆటోలపై ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకపోయినా, కొందరు చేస్తున్న ఆరోపణలు ఆటో రంగ కార్మికులను అయోమయానికి గురిచేస్తున్నాయని విమర్శించారు. సరైన అవగాహన కల్పించకుండా కార్మికుల్లో గందరగోళం సృష్టించడాన్ని ఐ ఎన్ టి యూ సీఫెడరేషన్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. త్వరలో రవాణా శాఖ మంత్రి ఆదేశాల మేరకు ఆటోలు, క్యాబ్‌లకు నిర్దిష్ట రేటు కార్డు ప్రకటిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర సెక్రటరీ జిల్లా శ్రీనివాస్, తెలంగాణ స్టేట్ క్యాబ్ యూనియన్ అధ్యక్షుడు ఎండీ రఫీ, ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఆటో యూనియన్ అధ్యక్షుడు అశోక్‌చారి, బాలరాజు, ఆకాష్, పరమేష్, స్టీఫెన్ జోసఫ్‌తో పాటు ఐ ఎన్ టి యూ సీ ఫెడరేషన్, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇళ్లు, షట్టర్లే టార్గెట్.. పార్థీ గ్యాంగ్‌కు చెక్

### ఇద్దరు అరెస్ట్.. 11 చోరీల కేసులు ఛేదించిన పోలీసులు




**విశ్వంభర, శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో తాళం వేసిన ఇళ్లు, షట్టర్లను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న పార్థీ గ్యాంగ్‌కు చెందిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. రైస్‌మిల్ రోడ్డు సమీపంలోని తాత్కాలిక గుడిసెల వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీలకు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసుల వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన విశాల్ భగవత్ షిండే (19), కృష్ణ దండేకర్ భోంస్లే (19)లను అరెస్టు చేశారు. ఈనెల 11న ఎలవర్తి గ్రామంలోని ఓ ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు, నగదు చోరీ చేసినట్లు వారు విచారణలో అంగీకరించినట్లు తెలిపారు. గత ఆరు నెలల్లో శంకర్‌పల్లి, బీడీఎల్ భానూర్, గజ్వేల్ తదితర ప్రాంతాల్లో మొత్తం 11 చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. మహారాష్ట్ర నుంచి రైలు మార్గంలో వచ్చి నిర్మాణంలో ఉన్న భవనాల సమీపంలో తాత్కాలిక టెంట్లు ఏర్పాటు చేసుకుని, పగటిపూట తాళం వేసిన ఇళ్లు, షట్టర్లను గుర్తించి రాత్రివేళ చోరీలకు పాల్పడేవారని తెలిపారు. అరెస్టైన నిందితుల నుంచి రూ.5 వేల నగదు, అర తులం బంగారం, తాళాలు పగులగొట్టేందుకు ఉపయోగించిన ఇనుప రాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ఇన్‌స్పెక్టర్ జి. రుద్వీర్ కుమార్, ఎస్ఐపీ కె. సురేష్, ఏఎస్ఐ నాగిరెడ్డి, పోలీసు సిబ్బంది నాగభూషణం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు. ఇళ్లు ఖాళీగా ఉంచి వెళ్లేటప్పుడు విలువైన నగలు, నగదును ఇంట్లో ఉంచవద్దని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



## సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ నూతన కార్యవర్గం ఎన్నిక

**విశ్వాంభర, పెద్ద శంకరంపేట:** తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు , తెలంగాణ రాష్ట్ర ఓబిసి అధ్యక్షుడు ఆనంద్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి సహకారంతో సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ నూతన కార్యవర్గాన్ని సంగారెడ్డి జిల్లా ఓబీసీ అధ్యక్షులు కోణం విట్టల్ ఆదివారం ప్రకటించారు. సంగారెడ్డి జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులుగా ఎన్ అశోక్ పి సంగాకర్. గొల్ల ఆంజనేయులు ఆర్ శివ చందర్ అంబదాస్.. జిల్లా ప్రధాన కార్యదర్శులుగా కే శ్రీనివాస్ బి మల్లేశం.. జిల్లా కార్యదర్శులుగా సందీప్ గౌడ్ రాజ్ కుమార్ పగిడిమర్రి శ్రీకాంత్ జి రమేష్ ఎం మారయ్య.. సోషల్ మీడియా కన్వీనర్ గా 6 మల్లేశం. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కే శ్రీశైలం జె సతీష్ గౌడ్ వి రాములు కె సిద్ధిరాములు శివరాజ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.. సంగారెడ్డి జిల్లాలో భారతీయ జనతా పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## శ్రీ నల్ల పోచమ్మ దేవాలయం నూతన కమిటీ ఏర్పాటు



**విశ్వంభర, గౌలిపుర :** శ్రీశ్రీశ్రీ మహంకాళి నల్ల పోచమ్మ దేవాలయం మూరాద్ మహల్ గౌలిపురలో మారు బోనం నిర్వహించిన అనంతరం చైర్మన్ చిట్టెం శ్యామ్ రావు ఆధ్వర్యంలో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే అధ్యక్ష ఎన్నికలలో నూతన అధ్యక్షునిగా ఆవుల మణికంఠను కమిటీ సభ్యులు అంతా కలిసి ఎన్నుకున్నారు. 2024-2026 వరకు అధ్యక్ష పదవి పొందిన దొంకిని ప్రమోద్ నూతన కమిటీ సభ్యులకు స్వాగతం తెలిపారు. నూతన అధ్యక్షుడు మణికంఠ మాట్లాడుతూ అందరు సహాయ సహకారాలతో కార్యక్రమాలను విజయవంతంగా సఫలీకృతం చేయడానికి కృషి చేస్తానని, నన్ను ఎంచుకున్న కమిటీ సభ్యులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. నూతన సభ్యులు జనరల్ సెక్రటరీ బల్కి కేశవ్, బాల్త కిరణ్ కుమార్ ట్రెజరర్, ధర్పల్లి వినోద్ వైస్ ప్రెసిడెంట్, కొరిడే శ్రీకాంత్ వైస్ ప్రెసిడెంట్, కంకర్ల సత్యనారాయణ వైస్ ప్రెసిడెంట్, ఎక్కా సునీల్ వైస్ ప్రెసిడెంట్, కే మల్లికార్జున జాయింట్ సెక్రెటరీ, అఖిల్ చక్రవర్తి జాయింట్ సెక్రెటరీ, జై శ్రీకాంత్ జాయింట్ సెక్రెటరీ, శ్రీధర్ జాయింట్ సెక్రెటరీ, బాల్కా శేఖర్ జాయింట్ సెక్రెటరీ గా బాధ్యతలు స్వీకరించారు.

## స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని మోదీ ఫొటో ముద్రించాల్సిందే

### బీజేవైఎం మాజీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ కొండబత్తిని సతీష్ కుమార్



**విశ్వంభర, హుస్నాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని కాంగ్రెస్ పార్టీ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలని చూస్తోందని బీజేవైఎం మాజీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ కొండబత్తిని సతీష్ కుమార్ తీవ్రంగా మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ?పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వాటాను, సహకారాన్ని తొక్కిపెట్టి.. మొత్తం తామే ఇస్తున్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల్లో భ్రమలు కల్పిస్తోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది పేదలకు కేంద్రంలోని ప్రధాని మోదీ సర్కార్ ఉచిత బియ్యం పథకం ద్వారా అండగా నిలుస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. కేంద్రం ఇచ్చే బియ్యాన్ని దాచిపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం ప్రజలను దగా చేయడమేనని ధ్వజమెత్తారు. స్మార్ట్ రేషన్ కార్డులపై కేవలం సీఎం, మంత్రుల ఫొటోలను మాత్రమే ముద్రించడం వెనుక రాజకీయ దురుద్దేశం దాగి ఉందని సతీష్ కుమార్ ఆరోపించారు. కార్డులపై దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోను తప్పనిసరిగా ముద్రించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల విషయంలో చిల్లర రాజకీయాలు మానుకోవాలని, కేంద్ర సహకారాన్ని విస్మరించి రాజకీయ ప్రచారం చేసుకుంటే ప్రజల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వానికి తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగాలని, పబ్లిసిటీ కోసం కాకుండా ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు.ఘనంగా

## దేవదేవునికి లక్ష తులసి పూజ

**విశ్వంభర, సూర్యాపేట:** జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం బదరీ నారాయణ తిరునక్షత్రం పుట్టినరోజు పురస్కరించుకొని ఆండాళ్ గోష్ఠి భక్తబృందం ఆధ్వర్యంలో లక్ష తులసి పూజ ఘనంగా నిర్వహించారు. అష్టాక్షరి మంత్రాన్ని లోకానికి అందించిన బదరీ నారాయణుడు ఈ శ్రావణమాసంలో అవతరించాడని మోక్షాన్ని పొందగోరే వారికి అష్టాక్షరి మంత్రాన్ని అందించిన ఆ బదరీ నారాయణ స్వామి పుట్టినరోజు వేడుకలను ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పూజ అనంతరం భక్తులకు తదియారాధన అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# రాష్ట్ర స్థాయి ఉత్తమ వార్తా ఫోటోగ్రఫీ పోటీల విజేతలు





విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఫోటోజర్నలిస్టుల నైపుణ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు, వార్తా ఫోటోగ్రఫీ రంగంలో ప్రతిభను వెలికితీసేందుకు తెలంగాణ రాష్ట్ర ఫోటోజర్నలిస్టుల సంఘం (టీఎస్‌పీజేఏ) ప్రతి సంవత్సరం రాష్ట్ర స్థాయి ఉత్తమ వార్తా ఫోటోగ్రఫీ పోటీలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి ఉత్తమ వార్తా ఫోటోగ్రఫీ పోటీలు--2026 నిర్వహించినట్లు సంఘం అధ్యక్షుడు అనుమళ్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె.ఎన్. హరి తెలిపారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఉన్న టీఎస్‌పీజేఏ రాష్ట్ర కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సుమారు 102 ఎంట్రీలు, మొత్తం 306 ఛాయాచిత్రాలు పోటీలకు వచ్చినట్లు వెల్లడించారు. ప్రముఖ సంపాదకుడు దేవులపల్లి అమర్, ప్రముఖ ఛాయాచిత్రగ్రాహకుడు, నటుడు కొమ్మిడి విశ్వేందర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ ఛాయాచిత్రగ్రాహకుడు కమలా సుధాకర్ రెడ్డి జ్యూరీ సభ్యులుగా వ్యవహరించి ఉత్తమ ఛాయాచిత్రాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. పోటీల్లో ప్రథమ బహుమతి రూ.10,000ను డెక్కన్ క్రానికల్, హైదరాబాద్‌కు చెందిన కె. దుర్గారావు గెలుచుకున్నారు. ద్వితీయ బహుమతి రూ.7,000ను సాక్షి, నల్గొండకు చెందిన కె. బజరంగ్ ప్రసాద్, తృతీయ బహుమతి రూ.5,000ను ఈనాడు, సంగారెడ్డికి చెందిన పొన్న శ్రీనివాస్ గెలుచుకున్నారు. అదేవిధంగా రూ.1,000 చొప్పున 10 కన్సొలేషన్ బహుమతులకు డి. సుమన్ రెడ్డి (టైమ్స్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్), ఆవుల శ్రీనివాస్ (ఈనాడు, హైదరాబాద్), కె. రమేష్ (మన తెలంగాణ, వరంగల్), పిట్టల శ్రీధర్ (ప్రజాపక్షం, కరీంనగర్), కుంట్ల శ్రీనివాస్ (ఫ్రీలాన్స్, హైదరాబాద్), ఎం. నాగేశ్వర్ రావు (ఆంధ్రజ్యోతి, హైదరాబాద్), జె. నవీన్ (వెలుగు, హైదరాబాద్), ఆర్. రాఘవేందర్ (ఈనాడు, హైదరాబాద్), ఎం. గోపి కృష్ణ (నమస్తే తెలంగాణ, హైదరాబాద్), జి. శ్రావణ్ కుమార్ (నమస్తే తెలంగాణ, హైదరాబాద్) ఎంపికయ్యారు. 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 19న హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో రాష్ట్ర స్థాయి ఉత్తమ వార్తా చిత్రాల ప్రదర్శన ప్రారంభించనున్నట్లు అనుమళ్ల గంగాధర్, కె.ఎన్. హరి తెలిపారు. త్వరలో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.

## గాంధీనగర్ గురుకులంలో ర్యాగింగ్..

# జూనియర్లను చితకబాదిన సీనియర్లు




విశ్వంభర, కారేపల్లి: ఖమ్మం జిల్లా సింగరేణి కారేపల్లి మండల పరిధిలోని గాంధీ పురంలో గల తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, కళాశాలలలో శనివారం అర్ధరాత్రి ర్యాగింగ్ కలకలం రేపింది. ఆ పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులను ఒంటిమీద బట్టలు ఊడదీసి చితకబాదారు. స్వాతంత్ర్య దినోత్సవంను పురస్కరించుకొని పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. అయితే వాలీబాల్, ఖోఖోలో ఇంటర్మీడియట్, కబడ్డీ లలో పదవ తరగతి విద్యార్థులు గెలుపొందారు. స్వతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా గెలుపొందిన విద్యార్థులకు ఆగస్టు 15న ఉపాధ్యాయులు బహుమతులను ప్రదానోత్సవం చేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులు కబడ్డీలో గెలుపొందిన ఆనందంతో సెలబ్రేషన్స్ చేసుకున్నారు. అదంతా చూసి తట్టుకోలేని ఇంటర్మీడియట్ విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులను అర్ధరాత్రి గదిలోకి తీసుకువెళ్లి ర్యాగింగ్ చేసి చితకబాదారు. భయాందోళనకు గురైన 10వ తరగతి విద్యార్థులు స్టడీ అవర్ లో ఉన్న నైట్ డ్యూటీ ఉపాధ్యాయుడికి సమాచారం ఇచ్చారు. అంతటితో ఆగని ఇంటర్మీడియట్ విద్యార్థులు పదో తరగతి స్టూడెంట్స్ ని పరిగెత్తించి మరీ కొట్టారు. రాత్రంతా రైల్వే స్టేషన్, సమీప అటవీ ప్రాంతంలో ఉన్న 10వ తరగతి విద్యార్థులు తెల్లవారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి వివరించారు. దీంతో అక్కడికి చేరుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న కారేపల్లి పోలీసులు పాఠశాలకు చేరుకొని విచారణ చేపట్టారు. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న పాఠశాల ప్రిన్సిపల్ పై ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# రేషన్ కార్డులపై రేవంత్, ఉత్తమ్ ఫొటోలు ఎందుకు

## సునీతా లక్ష్మారెడ్డి ఆగ్రహం



విశ్వంభర, హైదరాబాద్ : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అబద్ధాలతో కూడుకున్నవని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజాధనంతో సభలు నిర్వహించి కేసీఆర్, హరీశ్‌రావుపై వ్యక్తిగత విమర్శలు చేయడం తప్ప రాష్ట్రానికి ఉపయోగపడే ఒక్క అంశాన్నీ సీఎం ప్రస్తావించలేదన్నారు. కేసీఆర్ 'అపర భగీరథుడి'లా ఇంటింటికీ తాగునీరు అందించారని తెలిపారు. మిషన్ భగీరథను నిర్వీర్యం చేసిన ఘనత రేవంత్‌రెడ్డిదేనని ఆరోపించారు. రేవంత్‌రెడ్డికి రాష్ట్ర అభివృద్ధిపై ఎలాంటి విధానం లేదని, బూతులు మాట్లాడటం తప్ప ప్రజలకు ఉపయోగపడే పని చేయడం లేదని విమర్శించారు. రేషన్ కార్డుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 6.47 లక్షల రేషన్ కార్డులు ఇచ్చినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శాసన మండలిలోనే చెప్పారని గుర్తుచేశారు. రేషన్ కార్డులపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌ల ఫొటోలు ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. సన్నబియ్యం పంపిణీ కాంగ్రెస్ ఘనత కాదని.. సన్నబియ్యానికి బ్రాండ్ అంబాసిడర్ కేసీఆర్ అని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వమే సన్నబియ్యం పంపిణీని ప్రారంభించిందన్నారు. వ్యవసాయానికి 12 గంటల కరెంటు కూడా ఇవ్వడం లేదని అధికారులే చెబుతున్నారని సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. రైతులను కంటిమీద కునుకు లేకుండా ఇబ్బంది పెడుతూ వ్యవసాయాన్ని పండుగ చేశామని ప్రభుత్వం చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. రైతు రుణమాఫీని హామీ ఇచ్చిన విధంగా అమలు చేయలేదని, కేసీఆర్ రెండేళ్లలో ఇచ్చిన రైతుబంధు కంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన రైతుభరోసా నిధులే తక్కువగా ఉన్నాయని విమర్శించారు. బోనస్‌ను బోగస్‌గా మార్చి గొప్పలు చెప్పుకుంటున్నారని, యూరి యా యాప్‌తో రైతుల కష్టాలు మరింత పెరిగాయని అన్నారు. నిరుద్యోగ యువతను సీఎం మోసం చేశారని సునీతా లక్ష్మారెడ్డి ఆరోపించారు. 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ? నిరుద్యోగ భృతి ఏమైంది? రాజీవ్ యువ వికాసం పరిస్థితి ఏంటి? అని ప్రశ్నించారు. తమ హక్కుల కోసం ప్రశ్నిస్తున్న నిరుద్యోగులను నిర్బంధిస్తున్నారని విమర్శించారు. స్కాలం "షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఇచ్చిన హామీలను కూడా సీఎం నిలబెట్టుకోలేదన్నారు. సిగాచి పరిశ్రమలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇస్తామని చెప్పి ఆ హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. సంగారెడ్డికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగత విమర్శలు చేసి వెళ్లారే తప్ప జిల్లాకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదని సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. సింగూరును ఎండబెట్టిన ఘనత రేవంత్‌రెడ్డి దేనని ఆరోపించారు.

# డల్లాస్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



విశ్వంభర, డల్లాస్: భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని డల్లాస్‌లో ఇండియా అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక వేడుకల్లో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతదేశ ప్రగతి, ప్రపంచవ్యాప్తంగా ప్రవాస భారతీయుల పాత్రపై ఆయన ప్రసంగించారు. డిజిటల్ పరివర్తనలో ముందంజ వేయడంతో పాటు అంతరిక్ష పరిశోధనలోనూ భారత్ కొత్త శిఖరాలను అధిరోహిస్తోందన్నారు. 21వ శతాబ్దాన్ని తీర్చిదిద్దడంలో భారత్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు దేశానికి గర్వకారణమని, ప్రపంచవ్యాప్తంగా భారతదేశానికి నిజమైన బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తున్నారని చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. విదేశాల్లో భారతీయ పండుగలను ఘనంగా నిర్వహించడం, పిల్లలకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేయడం, వివిధ రంగాల్లో వ్యాపార, వృత్తి పరంగా విజయాలు సాధించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా భారతదేశ స్ఫూర్తిని సజీవంగా ఉంచుతున్నారని కొనియాడారు. ప్రవాస భారతీయుల విజయాలు భారతదేశానికి గర్వకారణమని అన్నారు. అమెరికాలో భారతీయ సమాజం ఆర్థిక, సాంకేతిక, సాంస్కృతిక రంగాల్లో అందిస్తున్న సేవలను ఎంపీ అభినందించారు. భారతదేశంతో బలమైన అనుబంధాన్ని కొనసాగిస్తూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచ వ్యాప్తంగా చాటుతున్న ప్రవాస భారతీయుల పాత్రను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రవాస భారతీయులు పాల్గొన్నారు.

## పాపన్న జయంతి వేడుకలను విజయవంతం చేయండి


: దుర్గం మల్లికార్జున్ గౌడ్.



విశ్వంభర, వికారాబాద్ :ఈ నెల 18 మంగళవారం న సర్దార్ సర్వాయి పాపన్న 376వ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు, వికారాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ దుర్గం మల్లికార్జున్ గౌడ్ పిలుపునిచ్చారు. వికారాబాద్ పట్టణంలోని బీజేఆర్ చౌరస్తాలో వేడుకలు ప్రారంభమవుతాయని, 10 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అనంతరం డాక్టర్ సత్యనారాయణ గౌడ్ నివాసంలో బందెయ్య గౌడ్ రచించిన పుస్తకావిష్కరణ జరుగుతుందని పేర్కొన్నారు. ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు పల్లె లక్ష్మణ్ గౌడ్, నాగరాజ్ గౌడ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు.

## ధర్నాను విజయవంతం చేద్దాం

: అధ్యక్షుడు పెండ్యాల నగేష్



విశ్వంభర, సరూర్ నగర్ : తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పేదలకు ఆసరా కోసం కల్యాణలక్ష్మి,షాదీముబారక్ పథకాలు ప్రవేశపెట్టి రూ .1,16.000 చొప్పున వేలకోట్లు ఇస్తే ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టులో స్టే తెచ్చి వాటిని కొనసాగించకుండా ఆపివేసినందుకు నిరసనగా మాజీ మంత్రి, మహేశ్వరం శాసన సభ్యురాలు పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు ఎన్టీఆర్ నగర్ మెయిన్ రోడ్డు వద్ద సోమవారము ఉదయం 11.00 గంటలకు ధర్నా కార్యక్రమం ఉంటుంది అని ఆర్కే పురం డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ తెలిపారు. పార్టీశ్రేణులు , అభిమానులు, ప్రజలు ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## బోనం తెలంగాణ ప్రాణం: అధ్యక్షురాలు చిట్టెడి పుష్పలత రెడ్డి



విశ్వంభర, సరూర్ నగర్ : బోనం తెలంగాణ ప్రజల ప్రాణమని మహేశ్వరం నియోజకవర్గ ఆర్కే పురం డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీ అభ్యుదయ మహిళా మండలి అధ్యక్షురాలు చిట్టెడి పుష్పలత రెడ్డి అన్నారు. ఆదివారము పుష్పలత రెడ్డి ఆధ్వర్యంలో కాలనీలో బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయా లకు బోనాల పండుగ ప్రతీక అని కొనియాడారు. ప్రజలందరినీ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కాపాడాలని ఖిల్లా మైసమ్మ అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అర్చన రెడ్డి, ట్రెజరర్ కృష్ణవేణి, వైస్ ప్రెసిడెంట్ గీత రెడ్డి, జాయింట్ సెక్రెటరీ అన్నపూర్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసన్న పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## గాంధీ భవన్‌లో ఎస్ఐఆర్ పై అవగాహన సమావేశం

### పాల్గొన్న పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్



విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ, ఓటర్ల జాబితాల ప్రాముఖ్యత, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా తీసుకోవాల్సిన చర్యలు, ఓటర్లకు కల్పించాల్సిన అవగాహన తదితర అంశాలపై చర్చించారు. ఈ అవగాహన కార్యక్రమంలో తెలంగాణ ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ దశా దిశా నిర్దాశనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూప్రతి అర్హత కలిగిన పౌరుడు తన ఓటు హక్కును సక్రమంగావినియోగించుకునేలా, ఓటరు జాబితాలో తన పేరు మరియు వివరాలను పరిశీలించుకోవాలని నాయకులు సూచించారు. అర్హులైన ఓటర్లు ఎవరూ జాబితాలో తమ పేరు లేకుండా మిగిలిపోకుండా క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని సమావేశంలో సూచించారు ఈ కార్యక్రమానికి తెలంగాణ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్ తో జిల్లా కోఆర్డినేటర్లు, ఇన్చార్జులు, వివిధ కార్పొరేట్ చైర్మన్ లు పాల్గొన్నారు.

## చేపూరి శంకర్ కు జాతీయ సమైక్యత పురస్కారం




విశ్వంభర, హైదరాబాద్ : మదర్ థెరిస్సా చారిటబుల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు సామాజిక కార్యకర్త చేపూరి శంకర్ కు స్వరమాధురి జాతీయ సమైక్యత పురస్కార అవార్డు శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనచారి చేతుల మీదుగా అందుకున్నారు. 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని స్వర మాధురి సాహితి సాంస్కృతిక సేవా సంస్థ 10వ వార్షికోత్సవం సందర్భంగా చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభలో స్వర నృత్య వేడుకలో భాగంగా వివిధ రంగాలలో సేవలను అందించిన వారికి స్వర మాధురి పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి హాజరై అవార్డు గ్రహీతలకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్వరమాధురి వ్యవస్థాపక అధ్యక్షురాలు సాయి పావని, ఏలె మహేష్, చేపూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో సామిడి గోపాల్ రెడ్డి



విశ్వంభర, మీర్ పెట్ : ప్రశాంతిహిల్స్ డివిజన్ 58 లో శివాజీ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమం లో టి పీసీసీ తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యూత్ సెక్రటరీ చరణ్ , ఇందిరమ్మ కమిటీ సభ్యులు ధరవత్ స్వామినాయక్, టిట్ల కృష్ణ, బాలాపూర్ మండల్ వైస్ ప్రెసిడెంట్ వరికుప్పల శివ, మాదరి శ్రీనివాస్, లక్ష్మా చారి, దేరింగుల వంశీ ,మట్ట సత్య నారాయణ. సార్ల రవి, కేతావత్ చిన్న, మూడవత్ లోకేష్ ,చెర్రీ , బస్తీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఏలె మహేష్ నేత కు కళా పాత్రికేయ పురస్కారం

### సిరికొండ మధుసూదనచారి చేతులమీదుగా అవార్డు అందజేత



విశ్వంభర, హైదరాబాద్ : ప్రముఖ వీ6 న్యూస్ ఛానల్ , విశ్వంభర దినపత్రికల సీనియర్ కరస్పాండెంట్ ఏలె మహేష్ నేతకు స్వరమాధురి కళా పాత్రికేయ పురస్కారం శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనచారి చేతుల మీదుగా అందుకున్నారు. 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని స్వర మాధురి సాహితి సాంస్కృతిక సేవా సంస్థ 10వ వార్షికోత్సవం సందర్భంగా చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభలో స్వర నృత్య వేడుకలో భాగంగా వివిధ రంగాలలో సేవలను అందించిన వారికి స్వర మాధురి పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి హాజరై అవార్డు గ్రహీతలకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రజలకు, ప్రభుత్వాలకు వారధిగా, నిరంతరం అలుపెరుగనిపోరాటం చేస్తూ ఎక్కడ కూడ విశ్రమించకుండా ఇరువైనాలుగు గంటలు పని చేస్తున్న రియల్ వారియర్స్ జర్నలిస్ట్ లు అని వారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్వరమాధురి వ్యవస్థాపక అధ్యక్షురాలు సాయి పావని, చేపూరి శంకర్, చేపూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

# గిగ్ కార్మికుల సంక్షేమ బోర్డు, ఎలక్ట్రిక్ ఆటో సబ్సిడీపై ఐఎన్‌టీయూసీ హర్షం




విశ్వంభర, హైదరాబాద్: గిగ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటును ప్రకటించడంతో పాటు, ఎలక్ట్రిక్ ఆటోలకు సబ్సిడీ అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బిజ్జుల రామకృష్ణారెడ్డి, జనరల్ సెక్రటరీ ఉప్పల శ్రవణ్ కుమార్ గుప్తా హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 263 జీవో ద్వారా జీహెచ్ఎంసీ పరిధిలో డీజిల్, పెట్రోల్, సీఎన్‌జీ, ఎల్‌పీజీ ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చుకునేందుకు సుమారు రూ.200 కోట్లు కేటాయించడంతో పాటు, ఒక్కో ఆటోకు రూ.1.50 లక్షల సబ్సిడీ అందించే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయం ఆటో కార్మికులకు ఎంతో ప్రయోజనకరమని పేర్కొ న్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి జిల్లా శ్రీనివాస్, తెలంగాణ స్టేట్ క్యాబ్ యూనియన్ అధ్యక్షుడు రఫీ, ఎల్బీనగర్ నియోజకవర్గ ఆటో యూనియన్ అధ్యక్షుడు అశోక్ చారి, బాలరాజు, ఆకాష్, పరమేష్, స్టీఫెన్, జోసఫ్ పాల్గొన్నారు.

# గోదావరి జలాలు అందించాలని బీఆర్ఎస్ ధర్నా



విశ్వంభర, బచ్చన్నపేట : వరంగల్ జిల్లా బచ్చన్నపేట మండలానికి గోదావరి జలాలను వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం రైతులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, పెట్టుబడులు పెట్టిన రైతులకు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలపై ఆధారపడి వ్యవసాయం చేయడం కష్టంగా మారిందని, గోదావరి జలాలు అందితే మండలంలోని వేలాది ఎకరాలకు సాగునీటి భరోసా కలుగుతుందని తెలిపారు. నీటి కోసం ఎదురుచూస్తూ రోజులు గడుస్తున్నా అధికారులు స్పష్టమైన చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. నీరు వస్తేనే పంటలకు భరోసా బచ్చన్నపేట మండల రైతాంగానికి గోదావరి జలాలు అత్యంత కీలకమని నాయకులు పేర్కొన్నారు. నీటి మళ్లింపు, సరఫరాలో ఏర్పడుతున్న సమస్యలను పరిష్కరించి చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా చూడాలని డిమాండ్ చేశారు. మండలానికి గోదావరి జలాలు రాకుండా అడ్డుకుంటున్న వ్యక్తులకు కొందరు ఇరిగేషన్ అధికారులు వంతపాడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు సర్పంచుల ఫోరం జిల్లా మాజీ ఉపాధ్యక్షులు గంగం సతీష్‌రెడ్డి , ఫోరం మండల అధ్యక్షుడు ఫిరోజ్ ఆరోపించారు. గోదావరి జలాల కోసం చేపట్టిన ధర్నాకు రైతులు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో బచ్చన్నపేట ప్రధాన రహదారిపై భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. ధర్నాలో సర్పంచులు మదికుంట రాధ, జిల్లాల భాస్కర్‌రెడ్డి, మహమ్మద్ ఆజాం, ఆరే రవికుమార్, పోతుల వెంకటేష్, కోడూరి స్వర్ణలత, శివకుమార్, పెరబోయిన కళ్యాణి, పరుశురాములు, నూకల కల్పన, రాజిరెడ్డి, నేల కవిత, మురళి, బచ్చన్నపేట ఉపసర్పంచ్ బైరి రజిత-వెంకటేష్ మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దూడల కనకయ్య, మాజీ కోఆప్షన్ సభ్యుడు షబ్బీర్, బీఆర్ఎస్ నాయకులు , రైతులు పాల్గొన్నారు.

# అభద్రత భావనలో రేవంత్ రెడ్డి : మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆరోపణ



విశ్వంభర, జగిత్యాల : డిజిటల్ రేషన్ కార్డుపై బొమ్మ ఉన్నా, లేకున్నా కాంగ్రెస్ రెండు సంవత్సరాలు ప్రభుత్వంలో ఉంటుంది. సీఎంగా రేవంత్ రెడ్డి ఉంటాడో, లేదో అది మాత్రం అధిష్టానం చేతులలో ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి అన్నారు. రేవంత్ అభద్రత భావనలో ఉన్నాడని ఆరోపించారు. ఆదివారం రాయికల్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులపై రేవంత్ రెడ్డి బొమ్మ ఎందుకని ప్రశ్నించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించేందుకు కుట్ర చేస్తుందని, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయకుండా ఆర్భాటాలకే అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని, పేర్కొన్నారు. రైతు బీమాను నిలిపివేయడం , కాళేశ్వరం ప్రాజెక్టు పనుల పునరుద్ధరణ చేపట్టకపోవడాన్ని గమనిస్తే కేసీఆర్ పథకాలను తొలగించే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 33 మాసాలు గడుస్తున్న ఇప్పటివరకు మహిళ లక్ష్మీ పథకం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఆటో కార్మికులకు నెలకు వెయ్యి రూపాయలు ఇస్తామన్న పథకాలు అమలు చేయడం లేదని వివరించారు. షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మీ పథకాలను ప్రభుత్వ నిలిపివేసే కుట్ర చేస్తుందని అన్నారు.

# బీసీ కులగణనపై మాట మార్చిన మోదీ

## కేంద్రం నమ్మించి మోసం చేస్తోంది: జాజుల శ్రీనివాస్‌గౌడ్



విశ్వంభర, హైదరాబాద్ : బీసీ కులగణన విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట మార్చి బీసీలను మోసం చేస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. బీసీ కులాల లెక్కలను శాస్త్రీయంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను వెంటనే సవరించి బీసీ కులగణనకు స్పష్టమైన విధానం ప్రకటించాలని కోరారు. ఏప్రిల్ 1, 2025న ఢిల్లీలో జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో తదుపరి జనగణనలో బీసీ కులగణన చేపడతామని నిర్ణయించి, ప్రధాని మోదీ స్వయంగా ప్రకటించారని శ్రీనివాస్‌గౌడ్ గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న జనగణనలో బీసీల కులాల వివరాలను సేకరించడంపై కేంద్రం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని విమర్శించారు. ఏప్రిల్ 2026 నుంచి మొదటి దశ జనగణనలో కుటుంబాల లెక్కింపు చేపట్టిన సమయంలో ఓబీసీ కుటుంబాలను కూడా లెక్కించాలని బీసీ సంఘాలు డిమాండ్ చేసినా కేంద్రం పట్టించుకోలేదని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలతోపాటు ఓబీసీ కుటుంబాల వివరాలను కూడా సేకరించాలని ప్రతిపక్షాలు పార్లమెంటులో డిమాండ్ చేసినప్పుడు రెండో దశలో బీసీ కులగణన చేపడతామని కేంద్రం హామీ ఇచ్చిందని తెలిపారు. అయితే ఆగస్టు 14న కేంద్రం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో 40 ప్రశ్నలు పొందుపరిచినా.. ఎస్సీ, ఎస్టీలకు చెందిన కులం వివరాలు అడిగే విధానం ఉన్నప్పటికీ ఓబీసీలకు సంబంధించి 'మీరు ఓబీసీనా? అయితే ఏ కులం?' అనే ప్రశ్నను చేర్చలేదని ఆయన పేర్కొన్నారు. బీసీ జాబితాను ప్రకటించకుండా, ప్రతి కులానికి ప్రత్యేకమైన యూనిక్ నంబర్ కేటాయించకుండా బీసీ కులాల లెక్కలను ఏ విధంగా సేకరిస్తారో కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణ, బిహార్‌లో జరిగిన కులగణన విధానాలను కేంద్రం నమూనాగా తీసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఇతర అగ్రకులాల జాబితాలను విడుదల చేసి.. ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ కేటాయించి శాస్త్రీయ పద్ధతిలో కులగణన నిర్వహించాలని సూచించారు. బీసీ కులగణన చేపట్టడం బీజేపీ ప్రభుత్వానికి ఇష్టం లేదని శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. మండల్ ఉద్యమం నుంచి ప్రస్తుత కులగణన వరకు బీసీల పట్ల బీజేపీ వ్యతిరేక వైఖరిని అవలంబిస్తోందని విమర్శించారు. కేంద్రం తక్షణమే గెజిట్ నోటిఫికేషన్‌ను సవరించకపోతే దేశవ్యాప్తంగా బీసీలతో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిపై చర్చించేందుకు వచ్చేవారం ఢిల్లీలో అఖిలపక్ష పార్టీలతో పాటు ఓబీసీ సంఘాలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

# ఖమ్మంలో అరాచకాలకు మంత్రి తుమ్మల ప్రోత్సాహం

## మాజీ మంత్రి పువ్వాడ



విశ్వంభర, ఖమ్మం : నియోజకవర్గంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అరాచకాలను ప్రోత్సహిస్తున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విమర్శించారు. గతంలో తనపై 'కాశీం రజ్వీ' అంటూ తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తులు ప్రస్తుతం మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ఆయన కుమారుడి వెంట ఉంటూ ఇసుక, మట్టి, భూ అక్రమాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఖమ్మం నగర ఖానాపురం హవేలి పరిధి బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సమావేశం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పువ్వాడ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఖమ్మం అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. ఖమ్మం అభివృద్ధికి తుమ్మల నాగేశ్వరరావు చెప్పుకునే విధంగా ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఎన్నడూ 'జై తెలంగాణ' అనని తుమ్మలను కేసీఆర్ మంత్రిని చేశారని ఆయన చేసిన అభివృద్ధి ఏమి లేదన్నారు. తాను ఖమ్మం నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని, అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని స్పష్టం చేశారు. పాత కాంగ్రెస్ కంటే కొసరు కొత్త కాంగ్రెస్ నాయకులే ఎక్కువ హడావుడి చేస్తున్నారని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆరోపించారు. నిర్మాణం పూర్తయిన ఏడాదికే కాలువ సీసీ లైనింగ్ కూలిపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. ప్రజాధనంతో చేపట్టిన ఇలాంటి భారీ ప్రాజెక్టుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. మున్నేరుపై తీగల వంతెన, రక్షణ గోడలు, ఇంజినీరింగ్ కాలేజీ నిర్మాణాలకు కేసీఆర్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పువ్వాడ తెలిపారు.

# బీఆర్ఎస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు సహించం.. కాంగ్రెస్‌కు హెచ్చరిక

విశ్వంభర, గుండుమాల్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. నారాయణపేట్ జిల్లా గుండుమాల్ మండల కేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు నిర్వహించిన విలేకరుల సమావేశం లో మాట్లాడారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బొంరాస్‌పేట్ కాంగ్రెస్ నాయకుల అసత్య ప్రచారాలు ఎవరూ కూడా నమ్మడం లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన నమస్తే తెలంగాణ పత్రికపై కొందరు కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. నిజాలను ప్రజల ముందుకు తీసుకువచ్చిన విషయాన్ని జీర్ణించుకోలేక విషప్రచారం చేయడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వీరారం తిరుపతి, మల్లేష్ యాదవ్, విజయ్, షహీద్, బాలప్ప, పాల్గొన్నారు.



## ములుగు-పరకాల పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం

విశ్వంభర, తొర్రూరు : ఉమ్మడి వరంగల్ జిల్లా ములుగు, పరకాల నియోజకవర్గాల పర్యటనకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఘన స్వాగతం పలికారు. హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీఎంతో కొద్దిసేపు మర్యాదపూర్వకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఇరువురు నేతలు మాట్లాడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బండ్ల గణేష్ కూతురు వివాహానికి హాజరైన కేటీఆర్



విశ్వంభర, హైదరాబాద్ : హైదరాబాద్‌లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రముఖ టాలీవుడ్ ప్రొడ్యూసర్, యాక్టర్ బండ్ల గణేష్ కూతురు జనని వివాహం సూర్యతేజతో జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ వివాహ వేడుకకు ఇరు కుటుంబాలకు చెందిన బంధువులు, స్నేహితులతోపాటు సినీ, రాజకీయ, వ్యాపార రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. సంప్రదాయబద్ధంగా వేదమంత్రాల నడుమ వైభవంగా జరుగుతున్నజనని, సూర్యతేజ వెడ్డింగ్ ఈవెంట్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ నూతన వధూవరులను ఆశీర్వదించారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితోపాటు పలువురు నేతలున్నారు.

## భారతీయ మజ్దూర్ సంఘ్ మహా ధర్నాను విజయవంతం చేయాలి



విశ్వంభర, హైదరాబాద్: కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఆధ్వర్యంలో ఆగస్టు 17న దేశవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్న మహా నిరసన కార్యక్రమాన్ని విద్యుత్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అఖిల భారత విద్యుత్ మజ్దూర్ మహా సంఘ్ నేషనల్ సెక్రటరీ రవీందర్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ పోరాటం ఏ ఒక్కరి కోసం కాదని, కార్మికుల హక్కులు, వారి కుటుంబాల భద్రత, సామాజిక భద్రత కోసం చేపడుతున్న ఉద్యమమని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి సంబంధించి పలు కీలక డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని ఆయన కోరారు. ఈఎస్ఐసీ పరిమితిని ప్రస్తుత రూ.21,000 నుంచి రూ.42,000కు పెంచాలని డిమాండ్ చేశారు. ఈపీఎస్ కనీస పెన్షన్‌ను రూ.1,000 నుంచి రూ.7,500కు పెంచడంతో పాటు పెన్షన్‌కు డీఏను అనుసంధానం చేయాలని కోరారు. ఈపీఎఫ్ వేతన పరిమితిని ప్రస్తుత రూ.15,000 నుంచి రూ.30,000కు పెంచాలని, దేశవ్యాప్తంగా ఒకే విధమైన కనీస వేతన విధానాన్ని అమలు చేసి, పెరుగుతున్న జీవన వ్యయాలకు అనుగుణంగా కనీస వేతనాన్ని నెలకు రూ.30,000గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అలాగే బోనస్ అర్హత వేతన పరిమితిని రూ.21,000 నుంచి రూ.42,000కు పెంచాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న మహా నిరసన కార్యక్రమంలో విద్యుత్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రవీందర్ యాదవ్ కోరారు.

## మద్యానికి బానిసై.. ఆ మత్తులోనే ఉరేసుకున్నాడు..!


విశ్వంభర, కుభీర్ : తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి మద్యం మత్తులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని మలేగాంవ్ గ్రామంలో చోటు చేసుకుంది విషాదకరమైన ఘటన. మృతుడిని కుభీర్ మండలం మాలేగాం గ్రామానికి చెందిన పుల్లోల్ల భోజన్న(39)గా పోలీసులు గుర్తించారు.

## మెట్‌పల్లి కార్టూనిస్టుకు బాచి ప్రత్యేక అవార్డు



విశ్వంభర, మెట్‌పల్లి : ఆంధ్రప్రదేశ్ కార్టూనిస్టుల సంఘం ( ఆకాసం ) ఆధ్వర్యంలో నిర్వహించిన బాచి అవార్డు కార్టూన్ పోటీల్లో మెట్‌పల్లి కార్టూనిస్టు వాసం నాగరాజు గీసిన చిత్రానికి ప్రత్యేక విభాగంలో బాచి అవార్డు దక్కింది. ప్రతి యేట ఆంధ్రప్రదేశ్ కార్టూనిస్టుల సంఘ అధ్యక్షుడు అన్నం శ్రీధర్ బాచి తల్లి భాగ్యవతి స్మారకార్థం బాచి అవార్డు కార్టూన్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ యేడు బాచి అవార్డు కార్టూన్ పోటీలకు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 500లకు పైగా కార్టూన్లు వచ్చాయి. ఇందులో 13 కార్టూన్లను ఎంపిక చేయగా తెలంగాణ రాష్ట్రం నుంచి జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణానికి చెందిన వాసం నాగరాజు కార్టూన్‌కు ప్రోత్సాహక బాచి అవార్డు ప్రత్యేక బహుమతి దక్కింది. ఈ మేరకు విజయవాడలోని బాలోత్సవ భవనంలో బార్ కౌన్సిల్ సభ్యులు, ఏపీ హైకోర్టు న్యాయవాది కృష్ణారెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు కార్టూనిస్టు నాగరాజు తెలిపారు. నాగరాజు ప్రత్యేక బహుమతి పొందడం పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పోటెత్తిన భక్తులు..శ్రీశైలంలో విరామ బ్రేక్ దర్శనాలు నిలుపుదల..!



విశ్వంభర, శ్రీశైలం : శ్రీశైలానికి భక్తులు పోటెత్తారు. వారాంతపు సెలవులు రావడంతో స్వామి వారిని దర్శించుకునేందుకు భారీ తరలి వచ్చారు. భక్తుల రద్దీ కారణంగా అధికారులు ఆదివారం విరామ బ్రేక్ దర్శనాలు నిలుపుదల చేశారు. సిఫారసు లేఖలతో వచ్చే వారికి కూడా శ్రీ స్వామి అమ్మవారి అలంకార దర్శనం మాత్రమే అనుమతిస్తున్నారు. ఇప్పటికే మనమిత్ర,వాట్సాప్ ఆన్లైన్లో,స్పర్శ దర్శనం టికెట్లు పొందిన వారికి నిర్దిష్ట వేళల్లో స్పర్శ దర్శనానికి అనుమతిని స్తున్నారు. క్యూలైన్లో సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా చూసేందుకే స్పర్శ దర్శనం రద్దు చేస్త కీలక నిర్ణయం తీసుకున్న దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు,ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. అలాగే భక్తుల రద్దీ దృష్ట్యా శని,ఆది, సోమవారాలలో ఆర్జిత అభిషేకాలు, కుంకుమార్చనలు నిలుపుదల చేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానికి సుమారు 4 గంటల సమయం పడుతుంది. కాగా, శ్రీశైలంమల్లికార్జున స్వామి వారి ఆలయానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు.దీంతో ఆలయానికి వెళ్లే ఘాట్ రోడ్డులో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

### : ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు




విశ్వంభర, మంచిర్యాల: ప్రభుత్వ పాఠశాలలో చదు వుతున్న విద్యార్థులకు అల్పాహారంతో పాటు నాణ్యమైన భోజనం అందించేం దుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు అన్నారు. ఆదివారం మంచిర్యాల పట్టణం కాలేజీరోడ్డులో ఏర్పాటు చే స్తున్న కేంద్రీకృత వంటశాల పనులను ఆయన పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజలకు సంక్షేమ ఫ లాలు అందుతున్నాయన్నారు. విద్యార్థులకు అల్పాహారంతో పాటు నాణ్య మై న భోజన వసతి కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. దసరా నుంచి అల్పాహారం ఇక్కడి నుంచే పంపిణీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా అధికారులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మేయర్ మధూకర్, నాయకులు గడ్డం త్రిమూర్తి, సయ్యద్ షాహిద్ అలీ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## భవనం పైనుంచి దూకి వైద్యవిద్యార్థి ఆత్మహత్య



విశ్వంభర, ఉప్పల్: నగరంలోని ఉప్పల్ పీఎస్ పరిధిలో వైద్యవిద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. రామంతాపూర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి దూకి కొల్కూరి భరద్వాజ్ (18) బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతడు ఉస్మానియా వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రహమత్‌నగర్‌లో స్ట్రీట్ నంబర్లకు శాశ్వత పరిష్కారం



విశ్వంభర, హైదరాబాద్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గం, రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని రహమత్‌నగర్ కాలనీల్లో దాదాపు దశాబ్ద కాలంగా స్ట్రీట్ నంబర్లు లేకపోవడంతో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ముఖ్యంగా చిరునామాల గుర్తింపు, పోస్టల్ సేవలు, అత్యవసర సేవలు, గూగుల్ మ్యాప్స్‌లో లొకేషన్ గుర్తింపు వంటి అంశాల్లో సమస్యలు ఎదురవుతు న్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా స్ట్రీట్ నంబర్ల క్రమబద్ధీకరణకు సంబంధించిన డ్రాఫ్ట్‌ను ఈరోజు విడుదల చేయడం జరిగింది. సీనియర్ నాయకులు, సీనియర్ సిటిజన్లు , స్థానిక పెద్దల సమక్షంలో ఈ డ్రాఫ్ట్‌ను విడుదల చేసి, ప్రజల సూచనలు, సలహాలు,అభిప్రాయాలను కోరడం జరిగింది. ప్రస్తుతం రహమత్‌నగర్‌లో స్ట్రీట్ నంబర్ 1 నుంచి స్ట్రీట్ నంబర్ 9 వరకు, అవసరమైన చోట్ల సబ్-నంబర్లతో సహా ప్రతిపాదించడం జరిగింది. స్థానిక ప్రజలు ఈ డ్రాఫ్ట్‌ను పరిశీలించి తమకు సంబంధించిన సూచనలు, మార్పులు లేదా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరుతున్నాము.ప్రజల నుంచి వచ్చే సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని సుమారు మూడు వారాల్లో తుది డ్రాఫ్ట్‌ను సిద్ధం చేసి, సంబంధిత రికార్డులు గూగుల్ మప్స్ లో కూడా స్ట్రీట్ నంబర్లను అప్‌డేట్ చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. తద్వారా ప్రతి వీధికి స్పష్టమైన నంబర్ ఉండి, ప్రజలకు చిరునామా గుర్తింపు మరింత సులభతరం కానుంది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, సీనియర్ సిటిజన్లు మల్లేశం, బుచ్చయ్య, సత్యనారాయణ, నాగరాజు తదితర స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

## మహేశ్వరంలో డిజిటల్ ప్రింటింగ్ ప్రెస్ ప్రారంభం



విశ్వంభర, మహేశ్వరం: మహేశ్వ రం మండల కేంద్రంలో ఆర్యన్ డిజిటల్ ప్రింటింగ్ ప్రెస్‌ను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించిన ఆమె.. వినియోగ దారులతో మర్యాదగా వ్యవహ రిస్తూ, ఆర్డర్లను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. మారుతున్న సాంకేతికతకు అనుగు ణంగా ప్రింటింగ్ రంగంలో వేగం, నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఏఐతో డిజైనింగ్ పనులు సులభంగా, వేగంగా పూర్తవుతున్నాయని తెలిపారు. వినియోగదారుల అవసరా లకు అనుగుణంగా సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షిం చారు. మహేశ్వరం మాజీ సర్పంచ్ స్వర్ణగంటి ఆనందం కుమారుడు స్వర్ణగంటి పోశెట్టి ఈ ప్రింటింగ్ ప్రెస్‌ను ఏర్పాటు చేశారు. బ్యానర్లు, డిజిటల్ పోస్టర్లు, ఫ్లెక్సీలు, ఇతర ప్రింటింగ్ సేవలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# విశాఖ విమానాశ్రయం సేవలు సమాప్తం

## నేటి నుంచి భోగాపురం ఎయిర్ పోర్టు నుంచి విమాన రాకపోకలు ప్రారంభం




విశ్వంభర, ఏపీ బ్యూరో: ఆదివారం అర్ధరాత్రి నుంచి విశాఖ విమానాశ్రయం సేవలు సమాప్తమయ్యాయి. విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఆగస్టు 17 నుంచి విమాన రాకపోకలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి షెడ్యూల్ విమానాలను నిలిపేస్తున్నట్లు పౌరవిమానయానశాఖ ఇప్పటికే ప్రకటించింది. 30 ఏళ్లపాటు విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ (ఐఎన్ఎస్ డేగ) సివిల్ ఎన్‌క్లేవ్ నుంచి షెడ్యూల్డ్ కమర్షియల్ విమానాల రాకపోకలను నిలిపేస్తున్నట్లు తెలిపింది. జాతీయ అత్యవసర పరిస్థితుల్లో ఈ నిబంధనకు మినహాయింపు ఉంటుందని పేర్కొంది. భారతీయ వాయుసేన, సాయుధ దళాలు, పోలీసు విమానాలు, ప్రభుత్వ అతిథులు రాకపోకలు సాగించే విమానాలు, లీజ్, వీఐపీ ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఇక్కడి నుంచి నడుస్తాయని.. నాన్‌షెడ్యూల్డ్ వాణిజ్య కార్యకలాపాలూ కొనసాగుతాయని పేర్కొంది.

ఇప్పటి వరకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు ఉన్న అంతర్జా తీయ ట్రావెల్‌కోడ్ 'వీటీజెడ్' ఆగస్టు 17 అర్ధరాత్రి 00:01 గంటల నుంచి అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి బదిలీ అవుతుందని కేంద్రం తెలిపింది.

**తొలి విమానం దేశీయమే..**

వాస్తవానికి భోగాపురం నుంచి సింగపూర్‌కు తొలి విమానం ఈనెల 16న బయలు దేరుతుందని అనుకున్నారు. కానీ, ఈనెల 17న ఉదయం సర్వీసులు ప్రారంభిం చాలని నిర్ణయించారు. ఇప్పటికే భోగాపురం నుంచి హైదరాబాద్, ఢిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా, తిరుపతికి ఇండిగో సంస్థ తొలి రోజు 31 సర్వీసులు నడపడానికి ప్రణాళిక రూపొందించింది. భోగాపురంలోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలపై విమానయాన సంస్థలు ఒక్కొక్క టిగా తమ షెడ్యూళ్లను విడుదల చేస్తున్నాయి. ఈ నెల 16 అర్ధరాత్రి నుంచి విశాఖ ఎయిర్‌పోర్ట్ సేవలు రద్దు కానుండగా.. అక్కడి నుంచి సేవలందించే విమానాలన్నీ భోగాపురం నుంచి వెళ్లనున్నాయి.

**బయలుదేరే సర్వీసులివే..**

భోగాపురం నుంచి హైదరాబాద్‌కు ఈ నెల 17న ఉదయం 8.55, 10.40, మధ్యాహ్నం ఒంటిగంట, సాయంత్రం 4.25, రాత్రి 7.20, 8.40, 9.20 గంటలకు బయలుదేరనున్నాయి. ఢిల్లీకి ఉదయం 8.20, రాత్రి 10.45, బెంగళూరుకు మధ్యాహ్నం 2.55, రాత్రి 9.10, చెన్నైకి మధ్యాహ్నం 12.15, సాయంత్రం 6.35, కోల్‌కతాకు రాత్రి 7.50, ముంబయికి మధ్యాహ్నం 3.05, తిరుపతికి మధ్యాహ్నం 1.50 గంటలకు విమానాలు ప్రారంభమవు తాయని పేర్కొంది.

# దేశం మెచ్చిన ఏపీ ఏఐ ఏజెంట్ ..నెలకు రూ.600-750 కోట్ల వరకు రాబడి



విశ్వంభర, ఏపీ బ్యూరో: రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో కృత్రిమ మేధ (ఏఐ) అద్భుతాలు సృష్టిస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో పన్నుల వసూళ్లలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. సాధారణంగా ఆరు నుంచి ఎనిమిది వారాలు పట్టే పని ఇప్పుడు కేవలం రెండు, మూడు గంటల్లోనే పూర్తవుతోంది. ఈ సరికొత్త విధానంతో ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని సైతం విశేషంగా ఆకర్షించింది. ఏఐ సాయంతో డేటా విశ్లేషణ, పన్నుల రిటర్న్?ల పరిశీలన, ఆడిట్, తనిఖీలు సులభంగా మారుతున్నాయి .ఏపీ ప్రవేశపెట్టిన ఏఐ ఆధారిత పన్నుల వసూళ్ల వ్యవస్థపై కేంద్ర ప్రభుత్వం ఆసక్తి చూపుతోంది. ఈ మేరకు కేంద్ర జీఎస్టీ కౌన్సిల్ అదనపు కార్యదర్శి పంకజ్‌కుమార్ సింగ్, సంయుక్త కార్యదర్శి డి.పి.మిశ్రా నేతృత్వంలోని బృందం ఇటీవల రాష్ట్రానికి వచ్చింది. రెండు రోజుల పాటు ఈ వ్యవస్థ పనితీరును వారు ప్రత్యక్షంగా పరిశీలించారు. కేంద్ర స్థాయిలోనూ దీన్ని అమలు చేసేందుకు రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో కేంద్ర బృందం నిత్యం సంప్రదింపులు జరుపుతోంది. కృత్రిమ మేధకు, మానవ మేధను ముడివేసి ప్రతి నెలా రూ.600-750 కోట్ల మేర రాబడి పెంచగలిగినట్లు రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ ఎ.బాబు ఈనాడు- ఈటీవీ భారత్‌కు తెలిపారు. ఈ వ్యవస్థకు సంబంధించి ఆయన పలు విషయాలు వెల్లడించారు.

**వివరాలు ఈ విధంగా ఉన్నాయి..**

- ఏపీ వాణిజ్య పన్నుల శాఖ ప్రత్యేకంగా జీఎస్టీ చట్టాలకు, ఈ శాఖ కార్యకలాపాలకు అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్? ఏజెంట్‌ను తయారు చేసుకుంది. కేంద్ర ప్రభుత్వ మేఘనాథ్ విధానంలో భాగంగా ఈ సమాచారం ఎక్కడా బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. రాష్ట్ర జీఎస్టీ, కేంద్ర జీఎస్టీ చట్టం కింద ఉన్న ప్రొసీజర్‌లు, షోకాజ్ నోటీసులు, సమాధానాలు తీసుకోవడం వంటివి మొత్తం 12- 13 దశలు ఉన్నాయి. ఇవన్నీ కృత్రిమ మేధ ప్రాసెస్‌తో అనుసంధానం చేశాం.
- లీగల్ ఏఐ ఏజెంట్‌ను తయారు చేసుకున్నాం. ఇప్పుడు రాష్ట్ర హైకోర్టు జీఎస్టీ అప్పిలేట్ అథారిటీ వంటి చోట పనులు సులభమయ్యాయి. ఒక కేసును విశ్లేషించి సూత్రీకరించే పని సులువుగా మారింది. ఓ పద్ధతి ప్రకారం డాక్యుమెంటేషన్ కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చేస్తోంది. కోర్టుల్లో కేసు సమర్పణ చాలా సులువైంది.
- ఏపీలో ఐదు లక్షల మంది పన్ను చెల్లింపుదారులున్నారు. మా ప్రత్యేక ఏఐ వ్యవస్థతో 25,000ల మంది పన్ను చెల్లించాల్సిన వారిని కొత్తగా గుర్తించాం. ప్రతినెలా వీరు ఫైల్ చేసే రిటర్న్?లను ఇప్పుడు కొద్ది గంటల్లోనే పరిశీలించి తప్పొప్పులు గుర్తించి, సరైన పన్ను వసూలు చేయగలుగుతున్నాం.
- ఏపీలో ప్రభుత్వ ఆధ్వర్యంలో అనేక ప్రాజెక్టుల నిర్మాణాలు ఊపందుకున్నాయి. అమరావతి, పోలవరం, నేషనల్ హైవేస్?, రైల్వేలకు సంబంధించి మొత్తం 140 ప్రాజెక్టులను గుర్తించి ట్రాక్ చేస్తున్నాం. వారికి చెల్లించే బిల్లు మొత్తాల ఆధారంగా రాష్ట్రానికి రావాల్సిన రాబడిని ట్రాక్ చేస్తున్నాం.
- ఒక అధికారి డాక్యుమెంటేషన్, విశ్లేషణకు సమయం కేటాయిస్తే ఎక్కువ పనులు చేయలేరు. ఆ రెండూ కృత్రిమ మేధ సాయంతో చేసి మానవ మేధస్సును అవసరమైన చోట ఉపయోగిస్తే అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ పాలన సులభమవుతుంది. అన్ని ప్రభుత్వ శాఖలూ ఇలా ఏఐ ఏజెంట్‌ను సిద్ధం చేసుకోవచ్చు.

# కాల్వలోకి దూసుకెళ్లిన కారు.. నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థుల మృతి



విశ్వంభర, తణుకు: పశ్చిమగోదావరి జిల్లాలో ఆదివారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కాల్వలోకి కారు దూసుకెళ్లిన ఘటనలో నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతిచెందగా.. ఒకరు గల్లంతయ్యారు. వివరాల్లోకి వెళితే.. ఇరగవరం మండలం అయితంపూడి లాకుల సమీపంలో ఆదివారం ఉదయం అదుపు తప్పిన కారు నరసాపురం పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు గల్లంతయ్యారు. ఆదివారం సాయంత్రానికి నలుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మరొకరి కోసం గాలిస్తున్నారు. ఈ ప్రమాదంలో కోనసీమ జిల్లా మలికిపురం మండలం మోరికి చెందిన పోతుల లక్ష్మీభానువికాస్ (18), నాగిరెడ్డి దుష్యంత్ సాయి(18), చెరుకూరి రాజారాం చరణ్ (16), అమలాపురంలోని చాకూరుకి చెందిన నాగాబత్తుల సాయిసూర్యతేజ (19), పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు సమీపంలోని చింతపర్రుకి చెందిన వీరమల్లు సాయి వెంకటకిరణ్ (18) గల్లంతయ్యారు. ఆచంట మండలం వల్లూరుకి చెందిన మట్టా సంతోష్ ప్రాణాలతో బయటపడ్డాడు. వీరంతా పెరవలిలో వివాహ వేడుకకు హాజరై తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురయ్యారు. పెరవలి నుంచి నరసాపురం బయలుదేరగా మార్గంమధ్యలోని ఓగిడిలో స్నేహితుడిని కలిశారు. అక్కడి నుంచి అయితంపూడి మీదుగా వెళ్తుండగా నరసాపురం వైపు తిరిగే క్రమంలో లాకుల వద్ద కారు అదుపు తప్పి ఎదుట పంట కాలువలోకి దూసుకెళ్లింది. శనివారం అర్ధరాత్రి దాటాక 2 గంటల సమయంలో వర్షం పడుతుండగా ప్రయాణ సమయంలో ఎదురుగా ఉన్న కాలువను గమనించకపోవడంతో కారు నేరుగా కాలువలోకి దూసుకెళ్లిందని స్థానికులు చెబుతున్నారు. ప్రమాద సమయంలో కాలువలో నీటి ఉద్ధృతి ఎక్కువగా ఉండటంతో ప్రవాహ వేగానికి కారు సుమారు 100 మీటర్ల దూరం కొట్టుకుపోయింది. సంతోష్ చెట్టు కొమ్మను పట్టుకోవడంతో స్థానికులు కాపాడారు. హుటాహుటిన పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాలింపు చర్యల్లో భాగంగా అయితంపూడి లాకుల వద్ద భానువికాస్, మరికొంతదూరంలో సాయివెంకటకిరణ్, నెగ్గిపూడి లాకుల వద్ద దుష్యంత్ సాయి, మార్టేరు సమీపంలో సాయిసూర్యతేజ మృతదేహాలు దొరికాయి. రాజారాం చరణ్ ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది. చరణ్ మినహా మిగిలిన వారంతా నరసాపురంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్నారు. అందరూ 20ఏళ్లలోపు యువకులే కావడంతో ఇరు జిల్లాల్లోనూ విషాదచాయలు అలుముకున్నాయి.

# పార్లమెంట్‌ను అణచివేసి రబ్బర్ స్టాంప్‌గా మార్చలేరు..

విశ్వంభర, నేషనల్ బ్యూరో: లోక్‌సభ సమావేశాల్లో నీట్-యూజీ 2026 పరీక్షా అక్రమాలు, విద్యార్థుల ఆందోళనలపై లేవనెత్తిన మూడు సెట్ల ప్రశ్నలను కేంద్ర ప్రభుత్వ సిఫార్సుతో తిరస్కరించడంపై కాక్రోచ్ జనతా పార్టీ కో-కన్వీనర్ సౌరవ్ దాస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పాలనలో 'ప్రశ్నోత్తరాల సమయం' అత్యంత కీలకమైనదని, దీనిని అడ్డుకోవడం ద్వారా కార్యనిర్వాహక వర్గాన్ని ప్రజల నిఘా నుంచి ప్రభుత్వం రక్షిస్తోందని ఆయన విమర్శించారు. అనేక వారాల పాటు సాగిన నిరసనల్లో పోలీసుల చర్యల గురించి హోం మంత్రి అమిత్ షా పార్లమెంటును ఉద్దేశించి నేరుగా ఎందుకు మాట్లాడలేదని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్? వేదికగా ఆయన పోస్ట్ చేశారు. నీట్-యూజీ 2026 అభ్యర్థులకు రీఫండ్‌లు, పేపర్ లీక్ ఆందోళనలు, ఢిల్లీలో నిరసనకారులకు నీరు వంటి ప్రాథమిక సౌకర్యాలను నిరాకరించడం, శాంతియుత ప్రదర్శనల పట్ల ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలను ఎంపీ అడిగారు. అయితే, రూల్ 41(2) కింద అనేక నిబంధనలను ఉటంకిస్తూ ప్రశ్నలను పార్లమెంటరీ అధికారులు తిరస్కరించారు. "పార్లమెంటును ఏయే అంశాలపై సమాధానాలు కోరారో మీరే చూడండి. 1. నీట్-యూజీ 2026 దరఖాస్తు ఫీజుల రీఫండ్ 2. ప్రభుత్వంపై పెరుగుతున్న ప్రజా అపనమ్మకం 3. ఢిల్లీలో సీజేపీ నిరసనకారులకు తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలను నిరాకరించడం 4. నిరసన చేస్తున్న విద్యార్థులు, యువతపై ప్రభుత్వ వైఖరి 5. విద్యార్థుల సంక్షేమం, పేపర్ లీక్‌లు, విద్యా సంస్కరణలు 6. శాంతియుత నిరసన తెలిపే తమ ప్రాథమిక హక్కును వినియోగించుకుంటున్న పౌరుల పట్ల వైఖరి. అయితే, ఈ ప్రశ్నలను రూల్ 41(2) వివిధ క్లాజులను ఉటంకిస్తూ తిరస్కరించారు" అని సీజేపీ నేత సౌరవ్ దాస్ అన్నారు. ఇలా ప్రజాస్వామ్య సంస్థలు సభలో ప్రజల సమస్యలను పరిష్కరించడానికి నిరాకరించిన ప్పుడు, పౌరులకు తమ నిరసనలను వీధుల్లోకి తీసుకువెళ్లడం తప్ప మరో మార్గం ఉండదని సౌరవ్ దాస్ అభిప్రాయపడ్డారు. ఎంపీలను ప్రశ్నలు అడగకుండా అడ్డుకోవడం, ప్రభుత్వం- ప్రజల మధ్య వారధిగా పార్లమెంట్ పోషిస్తున్న పాత్రను బలహీనపరుస్తుందన్నారు. అపారమైన ప్రజా అధికారాన్ని కలిగి ఉన్న మంత్రులు ప్రజలచే ఎన్నికైన ప్రతినిధులకు జవాబు చెప్పాల్సి ఉంటుంది కాబట్టే ప్రశ్నోత్తరాల సమయం ఉంది. లేకపోతే, ప్రజలు రోడ్లపైకి రావాల్సి వస్తుంది. మీరు పార్లమెంట్‌ను అణచివేసి మీ అసంపూర్ణ విధానాలకు దానిని రబ్బర్ స్టాంప్‌గా మార్చలేరు. యువతను విస్మరించలేరు. ఇది మా దృష్టిలో భారతదేశం కాదని అన్నారు.

## ఆషాడం అల్లుడికి.. అడుగుకో బహుమతి!



విశ్వంభర, నర్సీపట్నం: అత్తారింటికి వెళ్లిన ఆషాఢం అల్లుడికి అరుదైన ఆతిథ్యం లభించింది. ఇంటి గేటు నుంచి ఇంట్లోకి వెళ్లే వరకు ఒక్కో అడుగుకు ఒక్కో బహుమతి ఇచ్చి.. అత్తమామలు అబ్బురపరిచారు. ఆషాఢ మాసం ముగియడంతో కొత్త అల్లుడు శ్రీహర్ష నర్సీపట్నంలోని తన అత్తవారింటికి వెళ్లాడు. అత్తమామలు రమేశ్‌కుమార్, కళావతి ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇంట్లోకి వెళ్లేవరకు.. వెండితో చేసిన దేవతా మూర్తులు, ఛార్జింగ్ ఫ్యాన్, పెన్ను, సెంటు సీసా, పర్సు ఇలా అడుగుకో బహుమతి చొప్పున అందించారు. ఆ తర్వాత అల్పాహా రానికి ఆహ్వానించి, కళ్లకు గంతలు కట్టి.. టేబుల్ దగ్గరికి తీసుకెళ్లారు. ఇడ్లీ, దోశ, ఉప్మా, మిఠాయిలు ఇలా 100 రకాల ఆహార పదార్థాలను టేబుల్‌పై అమర్చి అల్లుడిని ఆశ్చర్యపరిచారు. హర్ష భార్య నవ్యతోపాటు అత్తమామలు కొసరికొసరి తినిపించారు. ఆ ఇంట సందడి వాతావరణం నెలకొంది.

## అస్సాం సీఎంకు బెదిరింపు.. నిందితుడి అరెస్టు

విశ్వంభర,నేషనల్ బ్యూరో:రూ.కోటి ఇస్తే అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మను హత్య చేస్తానని సామాజిక మాధ్యమంలో బెదిరించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. గువాహటిలోని ఖానాపారా వెటర్నరీ అండ్ అగ్రికల్చరల్ మైదానంలో సీఎం హిమంత బిశ్వ శర్మ శుక్రవారం మాట్లాడారు. ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం అవుతుండగా.. లైవ్ చాట్ సెక్షన్‌లో సదరు వ్యక్తి ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అతడితోపాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.

## బీజేపీ ఉపాధ్యక్ష పదవికి నటుడు దేవన్ రాజీనామా



విశ్వంభర, నేషనల్ బ్యూరో: బీజేపీ కేరళ ఉపాధ్యక్ష పదవికి నటుడు ఎస్.దేవన్ రాజీనామా చేశారు. అదేవిధంగా పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని వదులుకుంటున్నట్లు చెప్పారు. అలప్పుళలోని ఓ ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. ప్రసంగం ముగింపు సమయంలో రాజీనామా విషయాన్ని ప్రకటించారు. తన నిర్ణయానికి సరైన వేదిక ఇదేనని భావిస్తున్నానని చెప్పారు. రాష్ట్రానికి చెందిన పలువురు భాజపా నేతలు ఆ వేదికపై ఉన్న సమయంలోనే దేవన్ ఈ విషయాన్ని వెల్లడించారు. 'కేరళ పీపుల్స్ పార్టీ' ఏర్పాటుతో రాజకీయాల్లోకి ప్రవేశించిన దేవన్.. 2020లో దీనిపేరును 'నవ కేరళ పీపుల్స్ పార్టీ'గా మార్చారు. 2021లో అమిత్ షాతో భేటీ అయిన వెంటనే తన పార్టీని భాజపాలో విలీనం చేశారు. ఆ తర్వాత పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. అనంతరం పార్టీలో క్రియాశీలంగా వ్యవహరించారు. ఈ క్రమంలో రెండు సార్లు ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. శ్రీ నారాయణ గురు ఆదర్శాలను ప్రతిబింబించే రాజకీయాలనే తాను ఊహించుకున్నానని, ఐదేళ్లు పనిచేసినా దానిని సాధించలేకపోయానని దేవన్ అన్నారు. కొంతకాలంగా దీనిపైనే ఆలోచన చేశానని, చివరకు ఆత్మపరిశీలన చేసుకున్న తర్వాత రాజీనామా నిర్ణయం తీసుకున్నానని చెప్పారు.

## యూజీసీ-నెట్.. మూడు సబ్జెక్టులకు మళ్లీ పరీక్ష



విశ్వంభర, నేషనల్ బ్యూరో: జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ , అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులతోపాటు పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ల కోసం యూజీసీ-నెట్ ప్రవేశ పరీక్షలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జూన్‌లో నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే, కొన్ని సబ్జెక్టుల్లో తప్పులు దొర్లినట్లు ఫిర్యాదులు రావడంతో సమీక్షించిన ఎన్‌టీఏ.. ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్టులకు మళ్లీ పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించింది. ఇంగ్లిష్ పేపర్‌ను సెప్టెంబర్ 9న షిఫ్ట్-1 (ఉదయం 9- మధ్యాహ్నం 12 వరకు)లో, కామర్స్ పేపర్‌ను అదే రోజు షిఫ్ట్-2 (మధ్యాహ్నం 3- సాయంత్రం 6 వరకు)లో పరీక్ష నిర్వహించనున్నారు. సోషియాలజీ పరీక్షను సెప్టెంబర్ 10వ తేదీ ఉదయం 9 గంటలకు నిర్వహిస్తామని ఎన్‌టీఏ ప్రకటించింది. మరోవైపు జూన్ 22 నుంచి 30వ తేదీ వరకు 87 సబ్జెక్టులకు పరీక్ష నిర్వహించగా.. వీటిలో 84 సబ్జెక్టులకు ప్రొవిజినల్ ఆన్సర్ 'కీ'లు, అభ్యర్థుల రెస్పాన్స్ కాపీలను ప్రస్తుతం అందుబాటులో ఉంచింది.

## నవంబరు నెల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటా 18న విడుదల



విశ్వంభర, తిరుమల: నవంబరులో జరిగే శ్రీవారి ఆర్జిత సేవలైన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాద పద్మారాధన సేవల కోటాను ఈ నెల 18న ఉదయం పది గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఈ నెల 20న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఎంపికైన భక్తులు 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం లోపు సొమ్ము చెల్లించి లక్కీడిప్ టికెట్లు పొందాల్సి ఉంటుంది. ఈ నెల 21న కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, సాలకట్ల పవిత్రోత్సవాల టికెట్లను ఉదయం 10 గంటలకు, వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనున్నారు. 24న ఉదయం పది గంటలకు అంగప్రదక్షిణం, ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శన కోటా, మధ్యాహ్నం మూడు గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను విడుదల చేస్తారు. 25న ఉదయం పది గంటలకు ప్రత్యేక ప్రవేశదర్శనం రూ.300 టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో అద్దె గదుల బుకింగ్ కోటాను విడుదల చేస్తారు. ష్ట్రజూం:ౌ/సవఝుర్ష్ణుఖుఎం.ఖజూ.స్త్రశీజ.ఱఅ/ వెబ్‌సైట్‌లో సేవా టికెట్లను బుక్ చేసుకోవాలని టీటీడీ సూచించింది.

## పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్నే నిర్వీర్యం చేసే ప్రయత్నం

### విపక్షాల తీరుపై రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ ఆగ్రహం



విశ్వంభర, నేషనల్ బ్యూరో: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో జరిగిన గందరగోళం, నినాదాలు, వాయిదాలపై రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సభా కార్యకలాపాలను పదేపదే అడ్డుకోవడం వల్ల పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విపక్షాల నిరసనలు కేవలం సభా కార్యక్రమాలను అడ్డుకోవడానికే పరిమితం కాకుండా, పార్లమెంటరీ వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీసే స్థాయికి చేరాయని వ్యాఖ్యనించారు. ఏఎన్?ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో హరివంశ్ పలు అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. పేపర్ లీకులు ఇప్పటివి కావు' నీట్- యూజీ పేపర్ లీక్? అంశం గురించి జరిగిన విద్యార్థుల ఆందోళనపైనా కూడా హరివంశ్ స్పందించారు. 'పరీక్షల్లో పేపర్ లీకులు, అక్రమాలకు సంబంధించిన సమస్య కొత్తది కాదు. దశాబ్దాలుగా ఈ సమస్య కొనసాగుతోంది. 25 నుంచి 30 ఏళ్లుగా, అంతకంటే ముందునుంచే పరీక్షల్లో అక్రమాలు, పేపర్? లీకుల సమస్యలు ఉన్నాయి. పరీక్షల్లో అక్రమాలను అరికట్టేందుకు ప్రయత్నించినందుకు ఉత్తర్‌ప్రదేశ్‌లో గతంలో ఓ ప్రభుత్వం కూలిపోయింది. విద్యార్థుల ఆవేదనను అందరూ అర్థం చేస్తున్నారు. అందుకే వారి డిమాండ్ల విషయంలో ప్రభుత్వం సున్నితంగా స్పందించి చర్యలు తీసుకుంది. అయితే ఆందోళనల్లో కొందరు చేసిన అనుచిత వ్యాఖ్యలు, నినాదాలు తనను తీవ్రంగా బాధించాయి. ప్రధాని నరేంద్ర మోదీపై వ్యక్తిగతంగా దూషణలకు దిగడం దేశానికి మంచిది కాదు. విద్యార్థుల కేవలం విద్యా వ్యవస్థకే పరిమితం కాకుండా, రాష్ట్రాల్లో పాలనా వ్యవస్థకు సంబంధించిన సంస్కరణల అవసరాన్ని కూడా పరిశీలించాలి' అని హరివంశ్ సూచించారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంపైనా హరివంశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. డీలిమిటేషన్ రాజ్యాంగం నిర్దేశించిన ప్రక్రియ అని పేర్కొన్నారు. దానిని నిరవధికంగా వాయిదా వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నామని చెబుతున్నవారని, అందులో నిర్దేశించిన ప్రక్రియను కూడా పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. పునర్విభజనపై భిన్నాభిప్రాయాలు ఉంటే అన్ని పార్టీలు కలిసి కొత్త రాజ్యాంగ నిబంధన తీసుకురావడంపై చర్చించాలని సూచించారు. కానీ ఇప్పటికే రాజ్యాంగంలో ఉన్న ప్రక్రియను పదేపదే వాయిదా వేయడం సరికాదన్నారు. గత దశాబ్దంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని హరివంశ్ పేర్కొన్నారు. 2014 తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందిందని, మౌలిక వసతుల్లోనూ భారీ మార్పులు వచ్చాయని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా రెండు ప్రధాన సంక్షోభాలు ఎదురైనా భారత్ అభివృద్ధి కొనసాగిందని తెలిపారు. దేశం వేగంగా పురోగమిస్తుండటాన్ని ప్రపంచంలోని అనేక దేశాలు గమనిస్తున్నాయని వ్యాఖ్యానించారు. అదే సమయంలో ప్రభుత్వం తన హామీలను నెరవేర్చడంలో విఫలమైతే ప్రజల ముందు దాన్ని ప్రశ్నించాల్సిన బాధ్యత విపక్షాలదేనని హరివంశ్ గుర్తుచేశారు. అయితే ఆ బాధ్యతను విపక్షాలు సమర్థంగా నిర్వర్తిస్తున్నాయా? అని ప్రశ్నించారు. తన వ్యాఖ్యలు ఏదైనా రాజకీయ పక్షానికి అనుకూలంగా చేసినవి కావని హరివంశ్ స్పష్టం చేశారు.

## వస్త్ర దుకాణంలో రూ.16 ఆఫర్.. జనం పోటెత్తడంతో తొక్కిసలాట

విశ్వంభర, ఉత్తరప్రదేశ్ లోని కాన్పూర్ నగరం లో ఓ వస్త్ర దుకాణదారుడు తన కుమారుడి జన్మదినం సందర్భంగా ప్రకటించిన రూ.16 కే దుస్తుల ఆఫర్ ఉద్రిక్తతకు దారితీసింది. సోషల్ మీడియా లో వైరల్ అయిన ఈ ప్రకటనను చూసి నాలుగు వేల మందికిపైగా జనం ఒక్కసారిగా దుకాణం వద్దకు పోటెత్తడంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ తొక్కిసలాటలో పలువురికి గాయాలయ్యాయి. అన్వర్గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆలమ్ మార్కెట్‌లో రయీస్ ఆలం అనే వ్యక్తి వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆగస్టు 15న తన కుమారుడి పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో ఒక వీడియోను పోస్ట్ చేశాడు. కేవలం 16 నిమిషాల వ్యవధిలో ఎవరైనా సరే కేవలం 16 రూపాయలకే సూట్లు, జీన్సులు, షర్టులు వంటి రెడీమేడ్ దుస్తులు కొనుగోలు చేయవచ్చని ఆ వీడియోలో పేర్కొన్నాడు. ఈ ప్రకటన క్షణాల్లో వైరల్ కావడంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది జనం దుకాణం ముందు బారులు తీరారు. ఆఫర్‌ను దక్కించుకునేందుకు జనం ఒక్కసారిగా ముందుకు తోసుకురావడంతో తొక్కిసలాట వాతావరణం ఏర్పడింది.

# చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్.. ఆస్ట్రేలియాపై ఘన విజయం



**విశ్వంభర, స్పోర్ట్స్:** బంగ్లాదేశ్ చరిత్ర సృష్టించుకుంది. ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి టెస్టు విజయాన్ని రుచి చూసింది. డార్విన్ వేదికగా జరిగిన మొదటి టెస్టులో ఆసీస్‌పై బంగ్లాదేశ్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కేవలం 57 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ ఏమాత్రం కంగారు పడలేదు. ఒక్క వికెట్‌ను మాత్రమే కోల్పోయి టార్గెట్‌ను ఛేదించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 198 పరుగులకు కుప్పకూలగా.. బంగ్లాదేశ్ 426 పరుగులు చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ 284 పరుగులకే ఆలౌట్ అయింది.

**గ్రీన్ పోరాటం సరిపోలేదు..**

ఓవర్ నైట్ 161/4 స్కోరుతో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన ఆస్ట్రేలియాను మెహిదీ హసన్ (5/66) దెబ్బ కొట్టాడు. అలెక్స్ కేరీ (30)ను ఔట్ చేసి వికెట్ల పతనానికి నాంది పలికాడు. బ్యూ వెబ్‌స్టర్ (5), పాట్ కమిన్స్ (8) త్వరగా పెవిలియన్‌కు చేరారు. మరోవైపు కామెరూన్ గ్రీన్ మాత్రం క్రీజ్‌లో పాతుకుపోయాడు. ఈ క్రమంలో సెంచరీని పూర్తి చేసుకున్నాడు. మిచెల్ స్టార్క్ (18), నాథన్ లయన్ (15)తో కలిసి విలువైన పరుగులు జోడించిన గ్రీన్‌ను హసన్ (3/56) బౌల్డ్ చేశాడు. దీంతో గ్రీన్ తొమ్మిదో వికెట్‌గా పెవిలియన్‌కు చేరాడు. అప్పటికి ఆస్ట్రేలియా ఆధిక్యం 50 పరుగులు మాత్రమే దాటింది. ఆ తర్వాత నాథన్ ఔట్ కావడంతో బంగ్లా ముందు ఆసీస్ 57 పరుగులను మాత్రమే లక్ష్యంగా నిర్దేశించింది.

**రెండో ఓవర్‌లోనే వికెట్ పడినా..**

ఆస్ట్రేలియా నిర్దేశించిన లక్ష్యం స్వల్పమే. కానీ, ఎలాంటి పరిస్థితులనైనా తమకు అనుకూలంగా మార్చుకొనే ఆసీస్ బౌలింగ్ ఎటాక్‌ను కాచుకోవడం బంగ్లాదేశ్‌కు సవాలే. రెండో ఓవర్‌లోనే తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో తన్జిద్ (0)ని హేజిల్‌వుడ్ డకౌట్ చేశాడు. ఆస్ట్రేలియా ఏదైనా సంచలనం చేస్తుందా? అనే అనుమానం వచ్చింది. కానీ, మరో ఓపెనర్ షాద్మన్ ఇస్లామ్ (25లి), మోమినల్ హక్ (30లి) ఆసీస్ బౌలర్లకు అవకాశం ఇవ్వలేదు. మరో వికెట్ పడనీయకుండా బంగ్లాకు చరిత్రాత్మక విజయాన్ని అందించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఫాస్ట్ బౌలర్ హసన్ మహ్మూద్ (9 వికెట్లు, 14 పరుగులు) నిలిచాడు. ఇప్పుడీ మ్యాచ్‌తో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ టేబుల్‌లో స్థానాలేమీ మారలేదు. ఆస్ట్రేలియా (77.78 శాతం), దక్షిణాఫ్రికా (75 శాతం) టాప్ 2లోనే ఉన్నాయి. కానీ, గతంతో పోలిస్తే ఆసీస్ పర్సంటేజీ కాస్త తగ్గింది. నాలుగో స్థానంలో ఉన్న బంగ్లాదేశ్ (66.67 శాతం) తన పర్సంటేజీని కొద్దిగా పెంచుకుంది. మూడో స్థానంలో న్యూజిలాండ్ (72.22), ఐదో స్థానంలో భారత్ (48.15) ఉన్నాయి.

**మరికొన్ని విశేషాలు..**

భారత్ చేతిలో కాకుండా ఇతర ఆసియా టీముల్లో ఆస్ట్రేలియా ఓడిపోవడం 1995 తర్వాత ఇదే తొలిసారి.

సేనా (దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా)పై బంగ్లాదేశ్‌కు ఇది రెండో టెస్టు విజయం. ఆస్ట్రేలియాతో అక్కడి గడ్డపై మూడు మ్యాచుల్లో బంగ్లాకిదే తొలి గెలుపు. ఓవరాల్‌గా ఆసీస్‌పై ఆడిన ఏడు టెస్టుల్లో రెండో విజయం. చివరిసారిగా 2017లో మిర్పూర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో బంగ్లా గెలిచింది. ఆస్ట్రేలియా గడ్డపై తక్కువ టెస్టుల్లోనే విజయం సాధించిన తొలి ఆసియా జట్టు బంగ్లాదేశ్. కేవలం మూడు మ్యాచుల్లోనే విజయం సాధించింది. పాకిస్థాన్ (7), భారత్ (12) వెనక్కి నెట్టింది. ఇక 15 టెస్టులు ఆడిన శ్రీలంకకు ఇప్పటి వరకు విజయం రాలేదు.



## 1500మీ రన్.. పర్సనల్ బెస్ట్‌తో దూసుకెళ్లిన అంకిత దయాని

**విశ్వంభర, స్పోర్ట్స్:** ఆసియా గేమ్స్ సమీపిస్తోన్న వేళ భారత అథ్లెట్ అంకిత దయాని అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. స్టంప్‌టౌన్ ట్విలైట్ వేదికగా 1500మీ రన్‌లో తన కెరీర్‌లోనే అత్యుత్తమ టైమింగ్‌ను నమోదు చేసింది. గతం కంటే ఐదు సెకన్ల ముందే రేస్‌ను పూర్తి చేయడం గమనార్హం. అయితే, స్టంప్‌టౌన్ ట్విలైట్ రేసులో రెండో స్థానం వరించింది. తన రేసును 4:06.75 నిమిషాల్లో పూర్తి చేసింది. అగ్రస్థానం సాధించిన కార్మెన్ అల్డెర్ (4:06.40) కంటే దయాని టైమింగ్ కాస్త మాత్రమే తక్కువ. భారత అథ్లెట్ ఇంత ఫాస్ట్‌గా రేసును ముగించడం ఇదే తొలిసారి. ఇక ఆమె కెరీర్ బెస్ట్ 4:12.28 నిమిషాలు. ఇంతకుముందు ఎప్పుడూ 4:10 నిమిషాల్లో రేసును ముగించని దయాని బెస్ట్ రన్‌తో ఆశ్చర్యపరిచింది. దీంతో రాబోయే ఆసియా గేమ్స్‌లో 1500మీ, 3000 మీ స్టీపుల్‌చేజ్‌లో పతకాలు సాధిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.

## హాకీ ప్రపంచ కప్.. భారత్, చైనా మ్యాచ్ డ్రా




**విశ్వంభర, నెదర్లాండ్స్:** మహిళల హాకీ ప్రపంచకప్‌ను భారత్ డ్రాతో మొదలుపెట్టింది. ఆదివారం పూల్-డిలో బలమైన చైనాతో జరిగిన మ్యాచ్‌ను సలీమా బృందం 2-2తో డ్రా చేసుకుంది. భారత్ తరఫున నవనీత్ కౌర్ (8వ నిమిషం) తొలి గోల్ చేసింది. తొలి క్వార్టర్ ముగుస్తుందనగా చైనా స్కోరును సమం చేసింది. జాంగ్ యింగ్ 14వ నిమిషంలో పెనాల్టీ స్ట్రోక్ ద్వారా గోల్ చేయడంతో స్కోరు సమం అయింది. రెండో క్వార్టర్‌లో పెనాల్టీ కార్నర్‌ను దీపిక (26వ నిమిషం) గోల్‌గా మలవడంతో భారత్ తిరిగి ఆధిక్యంలోకి వెళ్లింది. చైనా క్రీడాకారిణి మా నింగ్ 39వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌తో గోల్ చేయడంతో స్కోరు మళ్లీ సమం అయింది. చివరి క్వార్టర్‌లో ఇరుజట్లు గోల్ చేయలేకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. మంగళవారం దక్షిణాఫ్రికాతో భారత్ తలపడనుంది.

## గాంధీ జయంతి రోజున వరల్డ్ కప్-2027 షురూ?



**విశ్వంభర, స్పోర్ట్స్ :** వచ్చే ఏడాది జరగబోయే వన్డే వరల్డ్ కప్-2027ను గాంధీ జయంతి రోజైన అక్టోబర్ 2న ప్రారంభించాలని ఐసీసీ ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ ఐసీసీ టోర్నీకి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. శాంతి, అహింస సిద్ధాంతాలను ప్రపంచానికి చాటిన గాంధీకి నివాళిగా అక్టోబర్ 2న వరల్డ్ కప్‌ను ప్రారంభించాలని ఐసీసీ భావిస్తున్నట్టు తెలుస్తోంది. దక్షిణాఫ్రికాతో గాంధీకి ఉన్న బలమైన సంబంధాలు కూడా మరో కారణం. 21 ఏళ్లపాటు ఆయన సౌతాఫ్రికాలో ఉన్నారు. ఇటీవల కాలంలో పలు దేశాల మధ్య యుద్ధాలు, విద్వేషం ఎక్కువవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో శాంతి, అహింస సందేశాన్ని ప్రపంచకప్ ద్వారా అందవ్వడం గాంధీకి అసలైన నివాళి అని ఐసీసీ భావిస్తుంది. అందుకే గాంధీ జయంతి రోజున ప్రపంచకప్‌ను మొదలుపెట్టాలని ప్రణాళికలు రూపొందిస్తుంది. ఇప్పటివరకు వరల్డ్ కప్ షెడ్యూల్ ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. అక్టోబర్ 8 నుంచి వరల్డ్ కప్ ప్రారంభించాలని ఐసీసీ మొదట అనుకున్నట్టు తెలిసింది. కానీ ప్రణాళికల్లో కొన్ని మార్పులు జరిగినట్టు సమాచారం. నవంబర్ 21న ఫైనల్ నిర్వహించనున్నట్టు తెలుస్తోంది.

## బంగ్లా చేతిలో సొంత గడ్డపై ఓటమి.. అత్యంత అవమానకరం



**విశ్వంభర,స్పోర్ట్స్:** బంగ్లాదేశ్ చేతిలో తమ జట్టు ఓడిపోయిందనే నిజాన్ని ఆస్ట్రేలియా మాజీలు ఇంకా నమ్మడం లేదంట. అదీనూ సొంత గడ్డపై కావడంతో తట్టులేకపోతున్నారు. దీంతో ప్యాట్ కమిన్స్ జట్టుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తమ టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యంత ఘోర పరాభవం ఇదేనని వ్యాఖ్యానించారు.

- "ఇది అత్యంత అవమానకరమైన ఓటమి. ఓపెనింగ్, వన్‌డౌన్‌లో కొత్త వారిని తీసుకొస్తే ప్రయోజనం ఉంటుందని ముందే చెప్పా. సాధారణంగా జట్టులో ఏవైనా మార్పులు చేయాలని చెప్పేవారిలో నేను చివరిగా ఉంటా. ఓ కెప్టెన్‌గా లేదా ఓ ప్లేయర్‌గా అయినాసరే జట్టంతా కలిసి కట్టుగా ఉండాలని కోరుకుంటా. పరిస్థితి చాలా క్లిష్టంగా మారితేనే టీమ్ నుంచి ఒకరిని తొలగించాలని నేను చెబుతా. అందుకు తగిన ఎవిడెన్స్ ఉంటేనే సూచన చేస్తా" **- రికీ పాంటింగ్**
- "అవును. ఆసీస్ క్రికెట్ చరిత్రలో ఇదే అతిపెద్ద పరాభవం. మూడేళ్ల కిందట అనుకుంటా విండీస్ చేతిలో ఓడిపోయాం. అదీనూ నిరాశ కలిగించిన మ్యాచ్. కానీ, ఈసారి మాత్రం అంతకుమించిన చెత్త ఫలితం చవిచూశాం. బంగ్లా టాప్ బౌలర్లు నహిద్ రాణా, షోరిఫుల్ ఇస్లామ్ లేకపోయినా ఆస్ట్రేలియా బ్యాటర్లు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు" - మార్క్ వా
- "ట్రావిస్ హెడ్‌కు ఓపెనింగ్ పొజిషన్ సరికాదు. నంబర్ 5లోనే బాగా రాణించగలడు. అలెక్స్ కేరీకి ఆ ప్లేస్ నప్పదు. ఇప్పుడీ ఫలితం షాక్‌కు గురిచేసింది. మనం ఎందుకు ఇలాంటి స్థితికి చేరుకున్నాం? ఆస్ట్రేలియన్ క్రికెట్ బలమైంది. కంగారు పడాల్సిన అవసరం లేదు. కానీ, జట్టు ఎంపికపై దృష్టిపెట్టాలి. సామ్ కొన్‌స్టాస్ వంటి ప్రతిభావంతుడిని పక్కన పెట్టాల్సిన అవసరం ఏముంది?" **- మాథ్యూ హేడెన్**

## జిమ్ ఫిట్‌నెస్ కాదు.. మ్యాచ్ కోసం ఫిట్‌గా ఉండాలి: గావస్కర్



**విశ్వంభర, స్పోర్ట్స్:** జస్‌ప్రీత్ బుమ్రా, సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా.. ఇదీ గాయాలతో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ బాట పట్టిన భారత క్రికెటర్లు. ఇంజూరీ మేనేజ్‌మెంట్‌పై తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, సీవోఈపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫిజియోలు ఇలా వార్తల్లో నిలవడం బాధాకరమని తెలిపారు. అలాగే ప్లేయర్ల ట్రైనింగ్ రొటీన్స్‌ను మార్చాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. "జస్‌ప్రీత్ బుమ్రాకి మోకాలి గాయం ఉంది. మిగతా ప్లేయర్లలో చాలా మందిలో కండరాలు పట్టేయడం చూస్తున్నాం. వారికి ఇస్తున్న ట్రైనింగ్‌లో ఏదో పొరపాటు ఉందనిపిస్తోంది. అందుకే పదేపదే గాయాలు తిరగబెడుతున్నాయి. భారత్ జట్టుకు ఆడుతున్నప్పుడే గాయపడుతున్నారు. దురదృష్టవశాత్తూ బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫిజియోలను బ్లేమ్ చేయాల్సిన పరిస్థితి ఎదురైంది. మరీ ముఖ్యంగా బయోమెకానిక్స్ పేరుతో నెట్స్‌లో బౌలర్లను పరిమిత సంఖ్యలోనే బంతులు వేయాలనే విధానం సందేహాస్పదంగా మారింది. ఐపీఎల్‌లోనూ కొందరు విదేశీ ఫిజియోలు నెట్స్‌లో 20 బంతులు కంటే ఎక్కువ వేయనివ్వకుండా చూస్తారని తెలిసింది. టీ20ల్లో బౌలర్ కనీసం 24 బంతులు విసరాలి. కానీ, నెట్స్‌లో అంతకంటే తక్కువ బంతులు ప్రాక్టీస్ చేయడం వల్ల ఏం ప్రయోజనం?" అని గావస్కర్ ప్రశ్నించారు. "గాయాలు ఎందుకు పునరావృతం అవుతున్నాయనేది తెలుసుకోవాలి. అందుకు పరిష్కారం కనుగొనాలి. జిమ్ ఫిట్‌నెస్ కంటే మ్యాచ్ ఫిట్‌నెస్ ముఖ్యం. అయితే, నేను ఫిట్‌నెస్ విషయంలో భిన్నమైన అభిప్రాయాలున్న తరానికి చెందినవాడిని కావచ్చు కానీ.. మ్యాచ్ ముఖ్యమని భావిస్తా" అని సునీల్ గావస్కర్ స్పష్టం చేశారు. ఇప్పటికే ఆటగాళ్ల గాయాలపై సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫిజియోల నుంచి బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వివరణ అడిగారు.

## బ్యాటింగ్‌లో మా ప్లాన్ అదే.. ఆ ఇద్దరి సపోర్ట్‌తో ఫామ్‌లోకి: జురెల్




**విశ్వంభర, స్పోర్ట్స్:** గత ఏడు ఇన్నింగ్స్‌ల్లో ఒక్క అర్ధ శతకం కూడా చేయలేకపోయిన భారత బ్యాటర్ ధ్రువ్ జురెల్ మళ్లీ ఫామ్ అందుకున్నాడు. శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో మొదటి ఇన్నింగ్స్‌లో జురెల్ (51; 68 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకంతో రాణించాడు. ఫామ్‌లో లేకున్నా తాను ఎలాంటి ఒత్తిడికి లోను కాలేదని జురెల్ అన్నాడు. ఫామ్ కోల్పోయిన ఈ దశలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తనకు మద్దతుగా నిలిచి ఆత్మవిశ్వాసం నింపారని తెలిపాడు. లంకతో మ్యాచ్‌లో రెండో రోజు ఆట ముగిసిన అనంతరం ధ్రువ్ విలేకరులతో మాట్లాడాడు. "నిజాయతీగా చెప్పాలంటే ఫామ్‌లో లేకున్నా నాపై ఎలాంటి ఒత్తిడీ లేదు. భారత్‌కు ప్రాతినిధ్యం వహించే అవకాశం లభించినందుకు ఎంతో కృతజ్ఞుడిని. ఆ గౌరవం కోసమే ఆడతాను. కెప్టెన్, హెడ్ కోచ్‌తో మాట్లాడినప్పుడల్లా వారు పరిస్థితులను వివరించి ఏం చేయాలో చెబుతుంటారు. అందుకు తగ్గట్టుగా ఆడాలని సూచిస్తారు. బ్యాటింగ్‌కు వెళ్లే ముందు నేను ఎలాంటి వ్యక్తిగత మైలురాళ్ల గురించి ఆలోచించను. కేవలం మైదానంలోకి వెళ్లి జట్టుకు ఏం అవసరమో అదే చేస్తాను. మేం 10 రోజుల ముందే ఇక్కడికి వచ్చాం. కొలంబోలో ప్రాక్టీస్ చేశాం. అంతకుముందు 'ఇండియా ఎ' తరఫున ఆడాం. ఇలాంటి పిచ్‌లపై సాధ్యమైనంత ఎక్కువగా బ్యాటింగ్ చేయడంపైనే నా దృష్టి ఉంది. దీని వల్ల నా బ్యాటింగ్ మెరుగుపడటమేకాక ఇక్కడి వాతావరణం, పరిస్థితులపై అవగాహన వస్తుంది. వర్షం కారణంగా ఔట్ ఫీల్డ్ తడిగా మారింది. చాలా ఓవర్లు నష్టపోయాం. అయినప్పటికీ నిలకడగా ఆడుతూ సాధ్యమైనన్ని ఎక్కువ పరుగులు చేయడం, లోయర్ ఆర్డర్‌లో మంచి భాగస్వామ్యాలను నెలకొల్పడం మా ప్లాన్. పిచ్ ఇంకా బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంది. శ్రీలంక బౌలర్ల మాదిరిగానే భారత బౌలర్లు కూడా సుదీర్ఘ సమయం పాటు బౌలింగ్ చేయాల్సి ఉంటుందని అనుకుంటున్నా. మేం మ్యాచ్ గెలవాలంటే పట్టుదలతో ఆడాలి. 20 వికెట్లు తీయాలి. సరైన ప్రదేశాల్లో బంతులు వేస్తే వికెట్లు వాటంతట అవే వస్తాయి" అని ధ్రువ్ జురెల్ పేర్కొన్నాడు. మ్యాచ్ విషయానికొస్తే.. రెండో ఆట ముగిసేసమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 460/9 స్కోరుతో నిలిచింది. కుల్‌దీప్ యాదవ్ (12), ప్రసిద్ధ్ కృష్ణ (1) క్రీజులో ఉన్నారు.

## ఈ వారం ఐపీఓలు: 7 కంపెనీలు రూ.6400 కోట్లు




**విశ్వంభర, బిజినెస్:** దలాల్ స్ట్రీట్‌లో పబ్లిక్ ఇష్యూల సందడి కొనసాగుతోంది. ఈ వారం కూడా పలు కంపెనీల ఐపీఓలు ఎంట్రీ ఇవ్వనున్నాయి. ఏడు కంపెనీలు సంయుక్తంగా రూ.6,400 కోట్ల నిధులను సమీకరించనున్నాయి. లలితా జువెలరీ, హొరైజన్ ఇండస్ట్రియల్ వంటి పలు కంపెనీలు ఇందులో ఉన్నాయి. మరి వాటి వివరాలు పరిశీలిస్తే.. - బ్లాక్‌స్టోన్ మద్దతు కలిగిన హొరైజన్ ఇండస్ట్రియల్ పార్క్ కంపెనీ ఆగస్టు 17న పబ్లిక్ ఇష్యూకు రానుంది. రూ.2,600 కోట్ల నిధులను సమీకరించనుంది. ఒక్కో షేరు ధర రూ.57-60గా కంపెనీ నిర్ణయించింది. ఐపీఓ నిధులను కంపెనీ రుణాల చెల్లింపునకు ఉపయోగించనుంది.

- ప్రముఖ ఆభరణాల తయారీ కంపెనీ లలితా జువెలరీ కూడా రూ.1700 కోట్ల నిధుల లక్ష్యంతో ఆగస్టు 17న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఒక్కో షేరు ధర రూ.190-201గా కంపెనీ నిర్ణయించింది. రూ.1200 కోట్ల విలువైన తాజా షేర్లు, రూ.500 కోట్ల విలువైన షేర్లు ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయిస్తున్నారు.
- శంకేశ్ జువెలర్స్ రూ.367 కోట్లు నిధుల సమీకరణతో ఆగస్టు 18న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ధరల శ్రేణి రూ.88-93గా కంపెనీ నిర్ణయించింది. 2.95 కోట్ల తాజా షేర్లు, కోటి షేర్లు ఆఫర్ల ఫర్ సేల్ రూపంలో విక్రయానికి ఉంచుతున్నారు.
- ఫిల్మ్ అండ్ టెలివిజన్ సన్‌షైన్ పిక్చర్స్ రూ.282 కోట్ల లక్ష్యంతో ఆగస్టు 18న ఐపీఓకు వస్తోంది. ధరల శ్రేణి రూ.342-360 కంపెనీ నిర్ణయించింది. 48 లక్షల తాజా షేర్లు, 30.37 లక్షల షేర్లు ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయిస్తున్నారు.
- గాజా క్యాపిటల్ బ్రాండ్‌కు చెందిన గాజా అసెట్ మెనేజ్‌మెంట్ రూ.550 కోట్ల నిధుల లక్ష్యంతో ఆగస్టు 19న ఐపీఓకు వస్తోంది. ధరల శ్రేణి రూ.152-160 గా కంపెనీ నిర్ణయించింది. రూ.450 కోట్ల తాజా షేర్లు, రూ.100 కోట్ల ఆఫర్ ఫర్‌సేల్ రూపంలో ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్‌కు రానుంది.
- టెంప్‌సెన్స్ ఇన్‌స్ట్రుమెంట్స్ (ఇండియా) ఆగస్టు 20న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. రూ.95 కోట్ల తాజా షేర్లు, రూ.1.85 కోట్ల షేర్లు ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఉండనున్నాయి.
- గోల్డ్ అండ్ సిల్వర్ ప్లాట్‌ఫాం అగ్మోంట్ ఎంటర్‌ప్రైజెస్ రూ.825 కోట్ల నిధుల లక్ష్యంతో ఆగస్టు 21న పబ్లిక్ ఇష్యూకు రానుంది. రూ.620 కోట్ల తాజా షేర్లు, రూ.205 కోట్ల ఆఫర్ ఫర్‌సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు. ధరల శ్రేణిని కంపెనీ వెల్లడించలేదు. స్కైవేస్ ఎయిర్ సర్వీసెస్ కంపెనీ కూడా రూ.583 కోట్ల నిధుల లక్ష్యంతో ఆగస్టు 24న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది.

**కొనుగోళ్ల వైపు ఎఫ్‌పీఐలు**


ఆగస్టు మొదటి అర్ధభాగంలో విదేశీ పోర్ట్ ఫోలియో ఇన్వెస్టర్లు కొనుగోళ్ల వైపు నిలిచారు. ఈ మధ్య కాలంలో నికరంగా రూ.16,621 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కొనుగోలు చేశారు. జులైలోనూ దాదాపు రూ.20,200 కోట్ల భారత ఈక్విటీ షేర్లను ఎఫ్‌పీఐలు కొనుగోలు చేసినట్లు సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్ డేటా పేర్కొంది.



## వాళ్లిద్దరూ వద్దు.. సీఎస్కే కోచ్‌గా అతడే బెస్ట్: క్రిస్ శ్రీకాంత్

**విశ్వంభర, స్పోర్ట్స్:** చెన్నై సూపర్ కింగ్స్‌కు 18 ఏళ్లపాటు కోచ్‌గా ఉన్న స్టీఫెన్ ఫ్లెమింగ్ ఇటీవల ఆ బంధానికి ముగింపు పలికిన సంగతి తెలిసిందే. ఇప్పుడు సీఎస్కేకు కొత్త హెడ్‌గా ఎవరొస్తారనే దానిపై క్రికెట్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. మొన్నటివరకు ఇంగ్లాండ్ కోచ్‌గా ఉన్న బ్రెండన్ మెక్‌కల్లమ్ చెన్నై కోచ్‌గా వస్తాడని వార్తలొచ్చాయి. ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ కోచ్ పదవి రేసులో ఉన్నాడని సీఎస్కే మాజీ బౌలర్ రవిచంద్రన్ అశ్విన్ పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో చెన్నై కోచ్ అంశంపై టీమ్‌ఇండియా మాజీ బ్యాటర్ క్రిస్ శ్రీకాంత్ స్పందించాడు. ఇయాన్ మోర్గాన్ కోచ్ పదవిపై దృష్టిపెట్టకుండా కామెంటేటరీకి పరిమితమైతే మంచిదని పేర్కొన్నాడు. అలాగే, బ్రెండన్ మెక్‌కల్లమ్‌ను కూడా కోచ్‌గా నియమించుకోవద్దని సీఎస్కేకు సూచించాడు. బయట వ్యక్తులను కాకుండా ఇప్పుడున్న కోచింగ్ స్టాఫ్‌లో ఓ వ్యక్తికి హెడ్ కోచ్‌గా పగ్గాలు అప్పగించాలన్నాడు. "నేనైతే ఇయాన్ మోర్గాన్‌ను చెన్నై కోచ్‌గా ఎంచుకోవద్దని చెబుతా. అతడు ఇంగ్లాండ్ తరఫున మంచి ఆటగాడిగా, మంచి కెప్టెన్‌గా రాణించాడు. కానీ, కోచ్‌గా మాత్రం అతడిని పరిగణనలోకి తీసుకోను. ఐపీఎల్‌లో కేకేఆర్ కెప్టెన్‌గా కూడా మోర్గాన్ గొప్ప ప్రదర్శనేమీ చేయలేదు. అతడు కామెంటరీకే పరిమితమైతే మంచిది. అలాగే, బ్రెండన్ మెకల్లమ్‌ను హెడ్ కోచ్‌గా నియమించుకోవద్దు. ఇప్పుడు ఇంగ్లాండ్ వన్డే, టీ20 జట్టుకు కోచ్‌గా ఉన్నాడు. ఇలాంటి తరుణంలో మెక్‌కల్లమ్‌ను కోచ్‌గా నియమించుకుంటే సీఎస్కేకు ఇబ్బందులు తప్పవు. మోర్గాన్, మెక్‌కల్లమ్ ఇద్దరినీ ఆ ఫ్రాంఛైజీ పక్కనపెట్టాలి. తమ వద్ద 'మిస్టర్ క్రికెట్' (మైకేల్ హస్సీ) ఉన్నప్పుడు సీఎస్కేకు బయటి వ్యక్తుల అవసరం లేదు. మైకేల్ హస్సీనే ఆటోమేటిక్‌గా ప్రధాన కోచ్ కావాలి. అతడే అత్యుత్తమ ఎంపిక కూడా. ఇకపై సీఎస్కేలో ధోనీ పాత్ర ఏంటి? ముందుగా ఆ విషయంపై స్పష్టత రావాలి. అప్పుడే మిగిలిన విషయాలన్నీ ఒక కొలిక్కి వస్తాయి" అని క్రిష్ణమాచారి శ్రీకాంత్ వివరించాడు.

## సిన్సినాటి ఓపెన్‌లో జకోవిచ్‌కు షాక్



**విశ్వంభర, స్పోర్ట్స్:** టెన్నిస్ స్టార్ ఆటగాడు జకోవిచ్‌కు సిన్సినాటి ఓపెన్‌లో షాక్ తగిలింది. రెండో రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. తొలి సెట్‌లో గెలిచిన జకోవిచ్.. ఆ తర్వాత రెండు సెట్లను కోల్పోయి ఓటమిని చవిచూశాడు. అర్జెంటీనా ఆటగాడు థియాగో టిరంటే 2-6, 6-4, 6-4 తేడాతో జకోవిచ్‌పై విజయం సాధించాడు. గత వింబుల్డన్ తర్వాత 39 ఏళ్ల జకోవిచ్ తలపడిన మొదటి టోర్నీ ఇదే.


**ఇబ్బంది పడిన జకో..**

సిన్సినాటి ఓపెన్‌లో జకోవిచ్ ఓటమి కంటే అభిమానులను ఆందోళనకు గురి చేసే అంశం మరొకటి ఉంది. మరికొద్ది రోజుల్లో యూఎస్ ఓపెన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో జకో ఫిట్‌నెస్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సిన్సినాటి ఓపెన్ సమయంలో తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. అక్కడి వాతావరణం దెబ్బకు వాంతులు కూడా చేసుకోవాల్సి వచ్చిందని టెన్నిస్ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం అమెరికాలో వేసవికాలం. దీంతో ఎండలు విపరీతంగా ఉన్నాయి. యూఎస్ ఓపెన్ సమయంలోనూ ఇదే వాతావరణ పరిస్థితులు ఉంటాయి. తీవ్ర పోటీ ఉండే గ్రాండ్‌స్లామ్‌లో విజేతగా నిలవాలంటే మాత్రం జకోవిచ్ తన ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టాల్సిందే.

## ఒప్పోతో ఏంబర్ ఎంటర్‌ప్రైజెస్ డీల్.. స్మార్ట్‌ఫోన్ రంగంలోకి ఎంట్రీ




**విశ్వంభర, బిజినెస్:** ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ సర్వీసెస్ దిగ్గజం ఏంబర్ ఎంటర్‌ప్రైజెస్ స్మార్ట్‌ఫోన్ తయారీ రంగంలోకి ఎంట్రీ ఇవ్వనుంది. ఇందుకోసం ఒప్పోతో డీల్ కుదుర్చుకుంది. ఇకపై చైనాకు చెందిన ప్రముఖ బ్రాండ్‌లు ఒప్పో, వన్‌ప్లస్, రియల్‌మీ స్మార్ట్‌ఫోన్లను భారత్‌లోనే తయారుచేయనుంది. ఈ మేరకు కంపెనీ ఆర్థిక ఫలితాల వెల్లడి సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ అండ్ సీఈఓ జస్బీర్ సింగ్ తెలిపారు. ఉత్పత్తిని ప్రారంభించిన తొలి ఏడాదిలో దాదాపు 80 లక్షల యూనిట్లను విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సింగ్ తెలిపారు. ఇందుకు ఒప్పో మొబైల్ ఇండియా కంపెనీతో భాగస్వామ్యం కుదుర్చుకున్నామన్నారు. మరోవైపు, డిక్సన్ టెక్నాలజీస్‌తో కలిసి జాయింట్ వెంచర్ కంపెనీని ఏర్పాటు చేసేందుకు వివో సిద్ధమవుతోంది.



## బాధలో ఉన్నప్పుడు గుర్తొచ్చే మొదటి వ్యక్తి ఆయనే

నటి అనుపమ పరమేశ్వరన్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి పలు ఆసక్తికర విషయాలను ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. తాను కష్టకాలంలో ఉంటే.. సినీ పరిశ్రమ నుంచి ఇద్దరు హీరోలు ఎంతో అండగా నిలుస్తారని వెల్లడించారు. తాను బాధలో ఉన్నప్పుడు గుర్తుకొచ్చే మొదటి పేరు మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ అని తెలిపారు. "నేను డల్‌గా ఉన్న ప్రతిసారీ దుల్కర్ నుంచి నాకు మెసేజ్ వస్తుంది. నేను బాధలో ఉన్న విషయం ఆయనకు ఎలా తెలుస్తుందో అని ఆశ్చర్యపోతుంటాను. అలా దుల్కర్‌తో కాసేపు మాట్లాడితే నా బాధంతా పోతుంది. ఆయన తర్వాత నేను అంతగా నమ్మే మరో వ్యక్తి టాలీవుడ్ హీరో రామ్" అని ఆమె తెలిపారు. ఇదే ఇంటర్వ్యూలో అనుపమ తన గత ప్రేమ కథ గురించి కూడా మాట్లాడారు. మాజీ ప్రియుడి చేతిలో తాను ఎదుర్కొన్న మానసిక వేధింపుల గురించి వివరించారు. "నార్సిసిస్టిక్ అబ్యూస్ (మానసిక వేధింపుల) అనేది చాలా సైలెంట్‌గా జరుగుతుంది. అలాంటి వాళ్లు ఎప్పుడూ ఇతరులను తమ కంట్రోల్‌లో ఉంచుకోవాలని చూస్తారు" అని అనుపమ పేర్కొన్నారు. గతంలో దుల్కర్, అనుపమ కలిసి 'జోమోంటే సువిశేషంగల్' అనే మలయాళ చిత్రంలో నటించారు. ఇక దుల్కర్ సల్మాన్ నటించిన తాజా చిత్రం 'ఐయామ్ గేమ్' సెప్టెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు రానుంది.



## కన్నడలో శ్రీనిధి శెట్టికి లక్కీ చాన్స్..

కేజీఎఫ్' సినిమాతో దేశమంతటా గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ శ్రీనిధి శెట్టి. 'కేజీఎఫ్ 2' తర్వాత వేరే భాషల్లో బిజీగా మారిన ఆమె, తమిళం, తెలుగు భాషల్లో పలు హిట్ సినిమాల్లో నటించి మెప్పించారు. అతి తక్కువ సమయంలోనే స్టార్స్ సరసన నటించి క్రేజీ హీరోయిన్‌గా మారారు. ప్రస్తుతం తెలుగులో వెంకటేష్ – త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రాబోతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇలా వేరే భాషల్లో వరస ఆఫర్లు పొందుతున్న సమయంలో, శ్రీనిధి శెట్టికి మళ్లీ కన్నడలో ఓ లక్కీ చాన్స్ దక్కినట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. . తాజా సమాచారం ప్రకారం.. దర్శకుడు అనుప్ భండారి తెరకెక్కిస్తున్న కొత్త ప్రాజెక్ట్ ద్వారా ఆమె మళ్లీ కన్నడ ప్రేక్షకులను పలకరించబోతున్నారట. శ్రీనిధి రీ-ఎంట్రీతో ఈ సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దర్శకుడు అనుప్ భండారి, తన సోదరుడు నిరూప్ భండారితో కలిసి ఈ కొత్త సినిమాను మొదలుపెట్టినట్లు టాక్. ఇందులో హీరోయిన్‌గా శ్రీనిధి శెట్టిని ఎంపిక చేయగా.. ఇప్పటికే కర్ణాటకలోని కుమ్టా ప్రాంతంలో ఈ సినిమా షూటింగ్ కూడా మొదలైందట. శ్రీనిధి శెట్టి 'కేజీఎఫ్' తర్వాత ఇక అనుప్ భండారి, నిరూప్ భండారి కలయికలో వస్తున్న నాలుగో సినిమా ఇది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'రంగీతరంగ', 'రాజరథ', 'విక్రాంత్ రోణా' చిత్రాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ఇక ఇప్పుడు మరో ప్రాజెక్ట్ రాబోతుండటంతో పాటు ఇందులో శ్రీనిధి శెట్టి నటిస్తుండటంతో సినిమాపై అప్పుడే భారీ బజ్ క్రియేట్ అయింది.



## 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. రెండు రోజుల్లో రికార్డు వసూళ్లు..

సూర్య కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్'. మమితా బైజు కథానాయిక. రాధికా శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా తెలుగు, తమిళ భాషల్లో విడుదలైన ఈ మూవీ మంచి టాక్ తెచ్చుకుంది. అంతేకాదు, బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లు రాబడుతోంది. విడుదలైన రెండు రోజుల్లోనే రూ.100 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టినట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ మేరకు సూర్య బ్యాటింగ్ చేస్తున్న ఫొటోను పంచుకుంది. 'రెండు రోజుల్లో రూ.100 కోట్లు దాటేశాం' అని పేర్కొంది. ఫ్యామిలీ డ్రామాగా రూపొందిన ఈ చిత్రం ఓవర్సీస్‌లోనూ అలరిస్తోంది. ఇప్పటికే మిలియన్ డాలర్స్ గ్రాస్‌తో దూసుకుపోతోంది.

**అగ్ర నటులు ఫ్యామిలీ డ్రామాలు చేస్తే..**

గత కొన్నేళ్లుగా అగ్ర కథానాయకులు అభిమానులను దృష్టిలో పెట్టుకునే సినిమాలు చేస్తూ వస్తున్నారు. ఇందులో కమర్షియల్, మాస్, యాక్షన్ సినిమాలే ఉంటున్నాయి. అయితే, ఇలాంటి సినిమాలకు కుటుంబ ప్రేక్షకులను రప్పించడం కష్టం. పెద్దవాళ్లు కూడా ఆసక్తి కనబరచరు. ప్రస్తుతం ఈ ట్రెండ్ నడుస్తున్న సమయంలో ఫ్యామిలీడ్రామా, ఎమోషన్స్, ఎంటర్‌టైన్‌మెంట్ కలబోతగా, అదీ అగ్ర నటుడి మూవీ వస్తే కుటుంబ ప్రేక్షకులు ఆదరిస్తారని 'విశ్వనాథ్ అండ్ సన్స్' మరోసారి నిరూపించింది. అందుకు మూవీకి వస్తున్న వసూళ్లే నిదర్శనం. పిస్టల్ షూటర్ సంజయ్ విశ్వనాథ్ (సూర్య) కొడుక్కి ఉన్న ఆరోగ్య సమస్య ఓ సవాల్‌గా మారుతుంది. ఆ బాబు ఆపరేషన్‌కి అవసరమైన అవయవదాతను వెతుకుతుండగా మ్యాడీ అనే యువతి పరిచయమవడం.. ఆమె రాకతో ఆ తండ్రీకొడుకుల జీవితాలు ఎలా మారాయన్న కథాంశంతో వెంకీ అట్లూరి ఈ చిత్రాన్ని తీర్చిదిద్దిన విధానం మెప్పిస్తోంది.

## బిగ్గెస్ట్ ప్రాజెక్ట్‌తో కళ్యాణి ప్రియదర్శన్ బాలీవుడ్ ఎంట్రీ

'లోకా' సినిమాతో బాక్సాఫీసు వద్ద సంచలనం సృష్టించడంతో పాటు తన నటనతో ప్రశంసలు పొందిన కళ్యాణి ప్రియదర్శన్ ఇప్పుడు బాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. బాలీవుడ్ స్టార్ హీరో రణ్ వీర్ సింగ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న అతిపెద్ద యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'ప్రళయ్' లో ఆమె పవర్‌ఫుల్ పాత్రలో నటించబోతున్నారు. తాజాగా, ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ ముంబై పరిసర ప్రాంతాలలో అధికారికంగా ప్రారంభమైంది. బాక్సాఫీసు వద్ద సరికొత్త చరిత్ర సృష్టించిన 'ధురంధర్', 'ధురంధర్ ది రివేంజ్' వంటి ఆల్-టైమ్ బ్లాక్‌బస్టర్ల తర్వాత రణ్ వీర్ సింగ్ చేస్తున్న ప్రాజెక్ట్ ఇదే కావడం విశేషం. ఈ చిత్రంలో రణ్ వీర్ హీరోగా కాకుండా నిర్మాణ భాగస్వామిగా కూడా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి అత్యంత క్రేజ్ ఉన్న పాన్-ఇండియా చిత్రంలో కళ్యాణి ప్రియదర్శన్ హీరోయిన్‌గా నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. 'స్కామ్ 1992', 'లూటేరే' వంటి మైండ్ బ్లోయింగ్ ప్రాజెక్ట్‌లను అందించిన దర్శకుడు జై మెహతా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. బిర్లా స్టూడియోస్ బ్యానర్‌పై అనన్య బిర్లా సమర్పిస్తుండగా, 'ట్రూ స్టోరీ ఫిల్మ్స్' నిర్మాణంలో హన్సల్ మెహతా, సాహిల్ సైగల్ నిర్మిస్తున్నారు. ప్రపంచం అంతమయ్యే అత్యంత భయంకరమైన పరిస్థితి ఎదురైనప్పుడు.. ముంబై నగర నేపథ్యంలో మనుషులు తమ వారి కోసం, ప్రాణాల కోసం చేసే ఉత్కంఠభరిత పోరాటమే ఈ సినిమా ప్రధాన కథాంశం అని టాక్. ఈ గ్రిప్పింగ్ సర్వైవల్ డ్రామాలో కళ్యాణి ప్రియదర్శన్ పాత్ర ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుందని సమాచారం.







## 'ఇరుముడి'లో కొత్త రవితేజ కనిపించారు

"బలమైన భావోద్వేగాలతో నిండిన యాక్షన్ థ్రిల్లర్ 'ఇరుముడి'" అంటోంది నటి ప్రియా భవానీ శంకర్ . ఆమె.. రవితేజ జంటగా నటించిన ఈ చిత్రాన్ని శివ నిర్వాణ తెరకెక్కించిన సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. ఇది ఈ నెల 21న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకుంది ప్రియా భవానీ.

"ఈ చిత్ర ట్రైలర్ చూస్తే ఈ కథేంటన్నది ఓ స్పష్టత వచ్చి ఉంటుంది. నేనిందులో కావేరి అనే సాధారణ గృహిణి పాత్రలో కనిపిస్తా. తాగుబోతు భర్త, అల్లరి కూతురు.. ఈ ఇద్దరే తన ప్రపంచం. వాళ్లిద్దర్ని బ్యాలెన్స్ చేసుకుంటూ కుటుంబాన్ని ఎంతో శ్రద్ధగా చూసుకుంటుంది. నేనిప్పటి వరకు ఇలాంటి పాత్ర చేయలేదు. ఇది నాకొక కొత్త అనుభవం. కావేరి లాంటి పాత్రల్ని నిజ జీవితంలో చూస్తుంటాం. ఇది తప్పకుండా అందరికీ కనెక్ట్ అయ్యే పాత్రగా ఉంటుంది". "దర్శకుడు శివ నిర్వాణ రాసే కథలు, పాత్రలు చాలా లోతుగా ఉంటాయి. ఆయన నాకు ఈ కథ వినిపిస్తున్నప్పుడు దీన్ని తను ఊహించిన విధానం, నా పాత్రని తీర్చిదిద్దిన తీరు నాకు బాగా నచ్చాయి. ఇక ఈ సినిమాలోని తండ్రీ కూతుళ్ల ఎమోషన్ యూనివర్సల్‌గా అందరికీ కనెక్ట్ అవుతుంది. ప్రతిఒక్కరికీ ఆ పాత్రలు గుర్తుండిపోతాయి. ఈ చిత్రంలో రవితేజతో కలిసి పని చేయడం గొప్ప అనుభూతి. ఆయన ఎనర్జీ అద్భుతం. దాన్ని మ్యాచ్ చేయడం అంత తేలిక కాదు. కాకపోతే ఈ సినిమాలో ఆయనతో కలిసి నటిస్తున్నప్పుడు నాకు ఓ కొత్త రవితేజలా కనిపించారు". "నేను కెరీర్ ఆరంభంలో వచ్చిన ప్రతి అవకాశాన్ని ఒప్పుకున్నా. కానీ, ఇప్పుడు మాత్రం పాత్రలోని లోతు, కథలో దానికున్న ప్రాధాన్యతను బట్టే సినిమాలు ఎంచుకుంటున్నా. ఈ పదేళ్ల సినీ ప్రయాణం.. ఓ వ్యక్తిగా, నటిగా నాలో ఎంతో పరిణతిని తీసుకొచ్చింది. ప్రస్తుతం 'దూత 2' సిరీస్ చేస్తున్నా. ఇది తొలి భాగం కంటే మరింత థ్రిల్లింగ్‌గా ఉండబోతుంది. అలాగే 'డిమాంటి కాలనీ 3' విడుదలకు సిద్ధమవుతోంది". "నేను నిజ జీవితంలో కావేరి పాత్రకి పూర్తి భిన్నంగా ఉంటాను. ఓ నటిగా ఇలాంటి పాత్రలు చేయడం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. కాకపోతే ఇందులోని పల్లెటూరి తెలుగు యాసని పట్టుకోవడం సవాల్‌గా అనిపించింది. ఇందులో రవితేజ తన కూతుర్ని ఎంత ప్రేమ, బాధ్యతతో పెంచారన్నది ట్రైలర్‌లో చూసుంటారు. దీంట్లో చూపించినట్లు ప్రతి అమ్మాయి ఏం జరిగినా తమ భావాల్ని, సమస్యల్ని తల్లిదండ్రులకు చెప్పడం చాలా ముఖ్యం. ఇంట్లో పిల్లలకు అలాంటి స్వేచ్ఛా వాతావరణాన్ని కల్పించాలని ఈ చిత్రంతో చెప్పబోతున్నాం".

## ఓటీటీలో పృథ్వీరాజ్ సుకుమారన్ క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ వచ్చేస్తోంది!



మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'ఐ, నోబడీ' . నిస్సాం బషీర్ దర్శకత్వంలో రూపొందిన క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. పార్వతి తిరువోతు కథానాయిక. గత నెలలో విడుదలైన ఈ మూవీ యాక్షన్ ప్రియులను మెప్పించింది. ముఖ్యంగా కథలో ట్విస్ట్‌లు అలరించాయి. ఇప్పుడు ఈ మూవీ ఓటీటీ వేదికగా వినోదం పంచడానికి సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో ఆగస్టు 25వ తేదీ నుంచి మలయళంతో పాటు, తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లోనూ స్ట్రీమింగ్ కానుంది.

**ఇంతకీ కథేంటంటే..** రాజీవ్ (పృథ్వీరాజ్ సుకుమారన్) ఓ ప్రభుత్వ ఉద్యోగి. భార్య మీరా (పార్వతి తిరువోతు), ఇద్దరు పిల్లలతో కూడిన ఓ మధ్య తరగతి కుటుంబం. ఓ బ్యాంకులో జరిగిన దోపిడీ వ్యవహారంలో తన ప్రమేయం లేకుండానే చిక్కుకుంటాడు. ఆ తర్వాత నేరం చేసిన వ్యక్తులు చనిపోయినా, అందులో దోపిడీకి గురైన డబ్బు విషయంలో మాత్రం అందరి వేళ్లూ రాజీవ్‌నే చూపిస్తాయి. పోలీసులూ అతన్నే అనుమానిస్తారు. అతని వద్దే కోట్లకొద్దీ దోపిడీ సొమ్ము ఉందనే ప్రచారం మొదలవుతుంది. అసలే సోషల్ మీడియా యుగం. ఆ దోపిడీ వ్యవహారం కాస్త వైరల్ అయిపోవడంతో రాజీవ్ ప్రశాంతతని కోల్పోతాడు. డబ్బు కోసం కొద్దిమంది అతన్ని భయపెడితే, మరికొన్ని ముఠాలు అతన్ని వెంటాడతాయి. తన దగ్గర డబ్బు లేదన్న విషయాన్ని సమాజం నమ్మాలని ఓ వ్యూహం రచిస్తాడు. ఆ వ్యూహం ఫలించిందా? లేదా?ఆ వ్యూహం కారణంగా తన కుటుంబానికి ఎలాంటి ముప్పు ఏర్పడింది? అసలు దోపిడీ సొమ్ము రాజీవ్ దగ్గర ఉందా లేదా? తదితర విషయాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే.



## ఫాంటసీ హారర్ థ్రిల్లర్‌తో భయపెట్టేందుకు వస్తున్న నిత్యామీనన్!

తెలుగు, తమిళం, కన్నడ సినీ పరిశ్రమల్లో తన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న స్టార్ బ్యూటీ నిత్యామీనన్. రీసెంట్‌గా 'తలైవాన్ తలైవి', 'ఇడ్లీ కడై' వంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన ఆమె, చిన్న విరామం తర్వాత ఒక సరికొత్త హారర్ డ్రామాతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈసారి ఒక విభిన్నమైన ఫాంటసీ హారర్ థ్రిల్లర్ సబ్జెక్ట్‌తో ఆమె ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు సమాచారం. 'యామిరుక్కా బయమే' చిత్రంతో వినోదాత్మక హారర్ జోనర్‌లో మంచి విజయాన్ని అందుకున్న దర్శకుడు డీకే ఈ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించనున్నట్లు టాక్. డీకే మార్క్ కామెడీ, సస్పెన్స్ ఎలిమెంట్స్‌కు నిత్యామీనన్ వంటి పవర్‌ఫుల్ నటి తోడవ్వడంతో ఈ చిత్రంపై అంచనాలు భారీగా నెలకొన్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ అక్టోబర్‌లో ప్రారంభం కానుండగా, వచ్చే ఏడాది సమ్మర్ రేసులో థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. సరికొత్త కథాంశంతో వస్తున్న ఈ థ్రిల్లర్ మూవీతో నిత్యామీనన్ బాక్సాఫీస్ వద్ద మరో హిట్ తన ఖాతాలో వేసుకోవడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com